తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక
జనవరి 2017 వెల రూ.5/-



08-01-2017
వైకుంఠ ఏకాదశి

విష్ణుం జిష్ణుం మహావిష్ణుం
ప్రభవిష్ణుం మహేశ్వరమ్,
అనేకరూపదైత్యాన్తం
నమామి పురుషోత్తమమ్.



మంగళాశాసనాలతో...



శ్రీశ్రీ పెరియకోయిల్ కేళ్వి అప్పన్ శ్రీ శఠగోపరామానుజ జియ్యర్ స్వామి
(తిరుమల పెద్దజియ్యర్ స్వామి)

శ్రీశ్రీ ఇళయకోయిల్ కేళ్వి అప్పన్ శ్రీ శఠగోపగోవిందరామానుజ జియ్యర్ స్వామి
(తిరుమల చిన్నజియ్యర్ స్వామి)

శ్రీ పద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవ శోభ



కొలనిదోపరికి గొబ్బిళ్ళో...


కొలనిదోపరికి గొబ్బిళ్ళో యదు
కులస్వామికి గొబ్బిళ్ళో ॥

కొండ గొడుగుగా గోవులగాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్లో
దుండగంపుదైత్యుల కెల్లను తల
గుండుగండనికి గొబ్బిళ్ళో ॥

పాప విధుల శిశుపాలుని తిట్టుల
కోపగానికిని గొబ్బిళ్ళో
యేపున కంసుని యిడుమలబెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో ॥

దండి వైరులను తఱిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండిపైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో ॥

(సంపుటం-5, సంకీర్తన-98)



ఇచట 'గొబ్బిళ్ళు' అంటే 'నమస్కారాలు' అని అర్థం. ఈ కీర్తనలో అన్నమయ్య గోపికలు పాడిన గొబ్బి పాటల్లాగానే తానుకూడా తన గొబ్బిపాటలో స్వామికి నమస్కారాలను వివిధ రకాలుగా అందజేస్తూ కీర్తించాడు.

ఆ భావపరంపర ఎలాగుందంటే.....

కొలనును దోచుకున్న శ్రీక్రిష్ణమూర్తికివే నా కైమోడ్పులు.

గొల్లకులానికి స్వామియైన శ్రీకృష్ణునికివే నా జోహార్లు.

గోవర్ధనపర్వతాన్నే గొడుగుగా పట్టి తన గోవులను కాపాడిన చిన్నికృష్ణునికివే నా జోతలు.

దుష్టరాక్షసులకు ప్రాణాంతకుడైన శ్రీకృష్ణునికివే నా సన్నుతులు.

తన్ను దూషించిన పాపాత్ముడైన శిశుపాలునిపై కన్నెర్ర చేసిన శ్రీకృష్ణునికివే నా నమోవాకాలు.

గర్వాంధకారి కంసుని మట్టుపెట్టిన గోపబాలుడైన శ్రీకృష్ణునికివే నా అభివందనాలు.

శత్రురాక్షసులకు దండననిచ్చే శ్రీకృష్ణునికివే నా ప్రణామాలు మరియు బంగారుకొండ వేంకటగిరిపై కొలువైన కొండలయ్యకివే నా వేవేల మ్రొక్కులంటూ స్వామికి ఘనమైన గొబ్బిళ్ళతో కీర్తించాడు.

శ్రీ ఆండాళ్ 'నీరాట్టోత్సవము' చూతమురారండి!!

(జనవరి-06 ఆండాళ్ నీరాట్టోత్సవంసందర్భంగా....)



గోదాదేవి శ్రీకృష్ణపరమాత్మను భర్తగా కోరి ధనుర్మాసవ్రతమాచరించింది. ఈ వ్రతజ్ఞాపకంగా ధనుర్మాసంలో వచ్చే భోగిపండుగకు ఏడురోజులముందు అనగా జనవరి ఆరోతేదీన నీరాట్టోత్సవం ప్రారంభమౌతుంది.

ఆ రోజున శ్రీగోదాదేవి ధనుర్మాస పూజానంతరం పల్లకీనధిష్ఠిస్తారు. అలా అధిష్ఠించి తిరుపతిలోనున్న గోవిందరాజుల స్వామివారిగుడినుంచి తిరువీథుల్లో ఉత్సవంగా బయలుదేరుతారు. అలా బయలుదేరి రామచంద్రతీర్థంకట్టమీదున్న నీరాట్టమండపానికి వేంచేస్తారు. అచ్చట ఆమెకు నీరాట్టం (అభిషేకం), నివేదనం, శాత్తుమొఱ, ఆస్థానం జరుగుతాయి. అలా ఆ సాయంకాలంవరకు అక్కడే ఉంటారు. ఆ తర్వాత ఆమె పుష్పాలంకారభూషితయై తిరుచ్చినధి ష్ఠించి తిరువీథుల ఉత్సవంగా గోవిందరాజులస్వామి వారి కోవెలకు వేంచేస్తారు. ఆ విధంగా ఏడురోజులు ఉత్సవాలు జరిగి నీరాట్టోత్సవం పూర్తౌతుంది.

ఎనిమిదోరోజున అనగా భోగిపండుగరోజున ఆండాళ్ శ్రీకృష్ణస్వామితో సహా భోగితేరునధిష్ఠిస్తారు. ఆ సాయంకాలం తిరువీథులఉత్సవం జరిగి సన్నిధికి వేంచేస్తారు. ఈ రోజునే గోదాపరిణయం జరుగుతుంది. శ్రీకృష్ణస్వామితోసహా వేడుకలు జరుగుతాయి. కనుమ పండుగనాడు శ్రీగోదాపరిణయోత్సవం జరుగుతుంది. ఇదే ప్రసిద్ధ ఆచారంగా నేటికీ కొనసాగుతోంది.





పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ

2017

ఆంగ్ల నూతన సంవత్సర

మరియు

సంక్రాంతి శుభాకాంక్షలు

దేవదేవుడైన వేంకటేశుని కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై అనవరతం ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ స్వామిని ప్రార్థిస్తూ..... మీ **సప్తగిరి**



తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సప్తగిరి

సంపుటి : 47 జనవరి, 2017 సంచిక : 08

వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి ॥

ఇతర వివరాలకు
0877-2264543

సప్తగిరి మాస పత్రిక

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఈ నెలలో....

ముఖచిత్రం : శ్రీవైకుంఠనాథుడు
వెనుక చిత్రం : కలియుగ వైకుంఠనాథుడు



సర్వేజనాస్సుఖినోభవంతు

మన మతంలో, ధర్మంలో శాంతిమంత్రం ప్రశస్తమైంది. దీన్ని పండితులు, పూజారులు – పూజ, ప్రవచనం, యజ్ఞం, యాగం, హోమం మొదలైన శుభసందర్భాల్లో చివరగా శాంతిమంత్రం తప్పక పఠించి ముగింపు పలుకుతారు. ఆ మంత్రమేమంటే:

ఓమ్ సహనావవతు సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై
తేజస్వినా వధీ తమస్తు మావిద్విషావహై, ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

మనమందరం కూడా నిత్యమూ ఏదో ఒక సందర్భంలో ఈ శాంతిమంత్రాన్ని పఠిస్తూంటాము. కాని దాని అర్థం మనం తెలుసుకోకుండానే కాలం గడిపేస్తున్నాం. ఈ మంత్రం మనకు బోధించిన జీవనరీతి ఎంతో ఉత్కృష్టమైంది. అందరం తప్పక ఆచరించదగింది. మనందరం ఒకే కుటుంబానికి చెందినవారంగా భావించాలి. అందుకే ఎన్నోసంస్థలు ప్రత్యేకించి విధినిర్వహణలో ఈ శాంతిమంత్రాన్ని పఠించేలా చర్యలు తీసుకుంటూన్నాయి. ఎందుకంటే సంస్థల్లో పనిచేసేవారికి శాంతిసుఖం లేకపోతే ఆ సంస్థ ముందంజ వేయలేదు కాబట్టి. పూర్వం ఉత్తరం రాసేటపుడు మొదటగా ఉభయకుశలోపరి అని రాసేవారు. దానర్థం 'మీరూ, నేనూ ఇరువురమూ కుశలంగానే ఉన్నాం' అని. కానీ ప్రస్తుతం ఆ సంస్కారం, సంస్కృతి కాలగర్భంలో కలిసిపోయాయి. ఎన్నోరకాల వినూత్న పోకడలొచ్చేసి మానవజీవితాల్నే నిర్వీర్యం చేసేస్తున్నాయి. కాబట్టి ప్రస్తుత సమస్యకు పరిష్కారం ఈ శాంతిమంత్రాన్నే అంతటా అమలుపరచినట్లైతే సర్వత్రా శాంతిసౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని పై శ్లోకం తెలియచేస్తోంది. ఇకపోతే ఆ శ్లోకార్థమేమనగా:

ఇది పంచాంగముల నిర్దేశం. ఈ మంత్రంలో విద్యనుగూర్చి సంక్షిప్తంగా వివరించబడి ఉంది.

1) సహనావవతు : మనమందరం ఒకరినొకరు పరస్పరం కాపాడుకుందాం. అంటే పరస్పరం కలసిమెలసి రక్షించుకుందాం. మనరాష్ట్రాన్ని, భాషను, సంస్కృతిని కాపాడుకుందాం. ముఖ్యంగా ఇది ఐక్యతాసూత్రంవంటిది.

2) సహనౌభునక్తు : ప్రపంచంలో నున్న ఐశ్వర్యాన్ని మనమందరం కలసి అనుభవిద్దాం. అలాంటి ధనసంపాదనకుగాను దోహదం చేసే శక్తిగల విద్యనే మనం సంపాదించుకుందాం. విలువలు లేని విద్యలు మనకొద్దు. అలాంటి వాటిని తక్షణమే పరిత్యజించుదాం.

3) సహవీర్యం కరవావహై : మనం కలసిమెలసి పరాక్రమిద్దాం. సాహసోపేతమైన, వీరత్వమైన, రాష్ట్రీయమైన కార్యాలను గావించడానికి తోడ్పడే విద్యను మనం నేర్చుకుందాం. మానసికవికాసాన్ని కల్గించి సాహసకార్యాలు చేయగలిగే చైతన్యాన్ని కల్గించే, ప్రబోధించే విద్యను మనం సాధిద్దాం.

4) తేజస్వినావధీతమస్తు : మనల్ని తేజోవంతులుగా, వర్చస్సు కలవారినిగా, కీర్తి కలవారినిగా తీర్చిదిద్దే అధ్యయనాన్ని, జ్ఞానాన్ని, విద్యను పొందుదాం. మనలో ఆత్మాభిమానం, స్వజాతి అభిమానం, స్వరాష్ట్రాభిమానం కల్గియుండేలా నడుచుకుందాం. అంతర్జాతీయఖ్యాతి గడించేలా కార్యాతేజస్సులతో, బుద్ధిబలంచాతుర్యంతో కొత్త కొత్త పరిశోధనలను గావిస్తూ, ప్రపంచాన్ని ప్రభావితం చేద్దాం.

5) మావిద్విషావహై : మనం ఒకరినొకరు ద్వేషించుకోకుండా మిత్రభావంతో నడచుకుందాం. 'అహింసా పరమోధర్మః' అనే సూక్తిని పాటిద్దాం. ఇదే విశ్వశాంతికి దోహదకారి కాబట్టి ప్రగతిపథంవైపు పయనిస్తూ పురోభివృద్ధిని సాధిద్దాం.

కాబట్టి పై తెల్పిన విధంగా మనమందరం కూడా శాంతిమంత్రాన్ని తప్పక పఠిస్తూ ఆచరణలో ఇతరులకు ఆదర్శంగా ఉండేలా ఉండేందుకు ప్రయత్నిద్దాం. ప్రజలంతా సుఖంగా ఉండాలని కోరుకుందాం.

బంగారు యుగంలో.. స్వామికి నాణేలు

– శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి, 80996 81422

ఇల వైకుంఠం శ్రీ తిరుమలనందున్న వేంకటేశుని హుండీలో ఎందరో రాజులు బంగారునాణేలను ముద్రించి, ఎంతో భక్తి ప్రపత్తులతో సమర్పించుకున్నారు. అందులో విజయనగరరాజులు తమ పరిపాలనాకాలంలో స్వామికి సంబంధించిన నాణేలనే సమర్పించుకున్నారు. ఆ నాణేలన్నిటిమీద కూడా హిందూదేవుళ్ళూ, జంతువులు, పక్షులు మొదలైన చిత్రాలను ముద్రించారు. అవన్నీ కూడా ఎంతో వైభవోపేతంగా ఉన్నాయి. ఈ నాణేలన్నీకూడా స్వామియొక్క వైభవంలో ఒక భాగమే. విజయనగర రాజులందరూ కూడా స్వామిపై అచంచల భక్తితో నాణేలను ముద్రించి, వాటిని తిరుమలనందున్న స్వామిహుండీలో కానుకలుగా సమర్పించుకున్నారు. అలా ముద్రించిన ఆ రాజులెవరు? వారు ముద్రించిన నాణేలేంటి? వాటి చరిత్ర ఏంటి? ఆ వివరాలను తెలుసుకుందాం.

విజయనగరరాజులొక్కచోట...

వంశయుగం	రాజు	పరిపాలనాకాలం
1) సంగమ	మొదటి హరిహరరాయలు	1336-1356
	రెండవ హరిహరరాయలు	1377-1404
	మొదటి దేవరాయలు	1406-1424
	రెండవ దేవరాయలు	1424-1446
2) తుళువ	శ్రీకృష్ణదేవరాయలు	1509-1529
	అచ్యుతరాయలు	1529-1542
	సదాశివరాయలు	1543-1570
3) అరవీటి	తిరుమలరాయలు	1570-1578
	మొదటి శ్రీరంగరాయలు	1578-1586
	మూడవ వెంకటపతిరాయలు	1586-1614

నాణేల వైభవమెలా ఉండేదంటే...

విజయనగరప్రభువుల పరిపాలనాయుగానికే స్వర్ణ(బంగారు) యుగమని పేరు. శ్రీ విద్యారణ్యస్వామివారి ఆశీస్సులతో, అండదండలతో మొదటి హరిహరరాయలు తన సోదరుల సాయంతో 1336వసం॥లో ఈ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఈతని హయాంలోనే మొట్టమొదటగా బంగారునాణేల ముద్రణకు నాంది జరిగింది.

వీరందరూ కూడా వారి వారి పరిపాలనాకాలంలో వివిధ రకాలైన బంగారునాణేలను ముద్రించి, శ్రీవారిహుండీలో వేశారు. ఆ నాణేలన్నీ కూడా శ్రీ వేంకటేశ్వరునివైభవాన్నే తెలిపాయి. విజయనగరపాలకులు విడుదల చేసిన ప్రతి నాణెంమీద ఒక హిందూదేవతో లేక దేవుని ప్రతిమో ఉండేది. బొమ్మవైపు జంతువులచిత్రాలుండేవి. అవన్నీకూడా దేవతామూర్తుల వాహనాలుగా ఖ్యాతి పొందినవే! బొరుసువైపు దేవనాగరి, కన్నడ లిపుల్లో అక్షరాలుండేవి. తెలుగు లిపికూడా ఉండేది. బరువు, ఇతరలక్షణాలవిషయంలో విజయనగరంనాణేలు చాలా ప్రామాణికతను కల్గి ఉండేవి. ఒక వరహా లేదా బంగారునాణెం 52 గ్రెయిన్లు (గోధుమగింజల బరువునుబట్టి దీనిని రూపొందించారు) లేదా 3.4 గ్రాముల బంగారంతో తయారు చేశారు. ఒక వరహాగా ఉంటున్నట్లైతే అందులో ఎనిమిదింట ఒకవంతు భాగం ఫణంగా ఉండేది. అలాగే వీరి నాణేలమీద హనుమంతుడు, లక్ష్మీనరసింహస్వామి, గణేశుడు, సరస్వతి, బ్రహ్మ,





బాలకృష్ణుడు, దుర్గ, శివపార్వతులు, సీతారాములు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలుడు, శ్రీమహా విష్ణువు మొదలైన దేవతాప్రతిమలు చిత్రించారు. అలాగే జంతు రూపాలైన సింహం, ఏనుగు, నంది, గుర్రం, గరుడపక్షి, హంస, గండభేరుండం, వరాహంవంటివి కూడా చిత్రించారు. అలా నాణేలు సమాచార వినిమయానికి కూడా ఆధారంగా ఉండేవి. ముద్రణాటంకశాలలు బరాకూరు, మంగళూరు, గండికోట, పెనుగొండ, తిరుపతి, గుత్తి, ఆదోని, తాడిపత్రి, మధుర, మైసూరుల్లో ఉండేవి. సామ్రాజ్యపతనానంతరం కూడా ఆ నాణేల వైభవం అలాగే కొనసాగింది. వాటి గురించి తెలుసుకుందాం.

అ) సంగమవంశయుగంలో...

1) మొదటి హరిహరరాయలకాలంలో...



బొమ్మ బొరుసు

వీరు విజయనగరసామ్రాజ్య మొట్టమొదటి స్థాపకులు. వీరికి తిరుమలతో ఎంతో అనుబంధముంది. వీరు నాణేల బొమ్మవైపు హనుమంతునిబొమ్మతో (కాళ్ళు కొద్దిగా ముందుకు వంచి, చేయి పైకెత్తి, కత్తి విసురుతున్న యోధుడిబొమ్మ) నాణేలు చిత్రించి ముద్రించారు. బొరుసువైపు కన్నడలిపిలో ‘శ్రీవిరహరి హర’ అనే అక్షరాలు ముద్రించారు.

ఏ నాణెం ఎంతెంత...

నాణెం	వ్యాసార్థం (సెం.మీ.లో)	బరువు (గ్రాములు)	సంఖ్య
1) వరహా	1.3	3.38	1
2) వరహా	1.2	3.38	3
3) వరహా	1.2	3.36	1
4) వరహా	1.2	3.37	1

2) రెండవ హరిహరరాయలకాలంలో...



బొమ్మ బొరుసు

వీరు నాణేల బొమ్మవైపు నాలుగుచేతులున్న శివుడు, పార్వతీసమేతంగా చిత్రించారు. పైన కుడిచేతిలో శూలం, ఎడం చేతిలో లేడి ఉన్నాయి. కింద ఎడమచేయి పార్వతీదేవి చుట్టూ ఉండి, కింది కుడిచేయి అభయముద్రతోనున్నది. విష్ణువు, లక్ష్మి, లక్ష్మీ సమేత నరసింహులు మరియు సూర్యచంద్రుల్ని కూడా చిత్రించారు. బొరుసువైపు దేవనాగరిలిపిలో ‘శ్రీప్రతాపహరిహర’ అనే అక్షరాలు ముద్రించారు.

ఏ నాణెం ఎంతెంత...

నాణెం	వ్యాసార్థం (సెం.మీ.లో)	బరువు (గ్రాములు)	సంఖ్య
1) అర్ధవరహా (లేదా) ప్రతాప	1	1.7	3
2) ప్రతాప	1	1.7	4
3) ప్రతాప	1	1.7	87
4) ప్రతాప	1	1.7	11
5) ప్రతాప	1	1.7	1

3) మొదటి దేవరాయలకాలంలో...



బొమ్మ బొరుసు

వీరు నాణేల బొమ్మవైపు శివపార్వతులు ఆశీనులై ఉన్నట్లు చిత్రించారు. అందు శివునికి నాలుగు చేతులున్నాయి. అందు ఒకటి పార్వతిని చుట్టుకొన్నట్లుంది. రెండుచేతుల్లో దమరుకము, లేడి ఉన్నాయి. ఒక చేయి అభయముద్రతో ఉండి, పైన సూర్యచంద్రుల్ని చిత్రించారు. బొరుసువైపు దేవనాగరి లిపిలో 'శ్రీప్రతాపదేవరాయ' అనే అక్షరాలు ముద్రించారు.

ఏ నాణెం ఎంతెంత...

నాణెం	వ్యాసార్ధం (సెం.మీ.లో)	బరువు (గ్రాములు)	సంఖ్య
1) వరహా	1.3	3.41	1
2) వరహా	1.3	3.4	3
3) ప్రతాప	1	1.7	70

4) రెండవ దేవరాయలకాలంలో...



బొమ్మ బొరుసు

నాణెం బొమ్మవైపు కుడిదిశగా కదులుతున్నట్లు అలంకారాలతోనున్న ఏనుగుబొమ్మను చిత్రించారు. బొరుసువైపు దేవనాగరిలిపిలో 'శ్రీదేవరాయ' అనే అక్షరాలు ముద్రించారు.

ఏ నాణెం ఎంతెంత...

నాణెం	వ్యాసార్ధం (సెం.మీ.లో)	బరువు (గ్రాములు)	సంఖ్య
1) కటి (1/4 వరహా)	0.8	0.85	1

ఆ) తుళువవంశయుగంలో...

1) శ్రీకృష్ణదేవరాయలకాలంలో...



బొమ్మ బొరుసు

వీరికి తిరుమలస్వామియే ఆరాధ్యదైవం. వీరు తాను ముద్రించిన బంగారునాణేలతోనే శ్రీ వేంకటేశ్వరునికి అభిషేకం గావించారు. వీరు నాణేల బొమ్మవైపు వేంకటేశ్వరుని ప్రతిమతో చిత్రించారు. మరియు బొమ్మవైపు కాలువంచుకుని పీఠంమీద కూర్చున్న బాలకృష్ణుడు, మరో కాలుమీద ఎడమచేయి ఆన్చి ఉన్నట్లుండి, కుడిచేత వెన్నముద్ద ఉన్న చిన్నికృష్ణుని చెవులకు లోలాకులు, కాళ్ళకి మువ్వలు, ఇతర ఆభరణాలు మరియు చేతికడియాలు, కాళ్ళకు పట్టీలు, తలకు పింఛం, కుడి, ఎడమ చేతుల్లో శంఖచక్రాలు చిత్రించారు. బొరుసువైపు దేవనాగరి లిపిలో 'శ్రీప్రతాపకృష్ణరాయ' అనే అక్షరాలు ముద్రించారు. ఈయన ముద్రించిన నాణేలకు బొమ్మవైపు బాలకృష్ణుడు, వేంకటేశ్వరుడు, శివపార్వతుల ప్రతిమలు విశేషఖ్యాతి పొందాయి.

ఏ నాణెం ఎంతెంత...

నాణెం	వ్యాసార్ధం (సెం.మీ.లో)	బరువు (గ్రాములు)	సంఖ్య
1) వరహా	1.3	3.36	1
2) వరహా	1.2	3.34	1
3) ప్రతాప	1	1.69	1
4) ప్రతాప (అర్ధవరహా)	1.1	1.72	1
5) ప్రతాప (అర్ధవరహా)	1	1.71	1

2) అచ్యుతరాయలకాలంలో...



బొమ్మ బొరుసు

వీరు నాణేల బొమ్మవైపు గండభేరుండపక్షిని వెనుకవైపు నుంచి చూస్తున్నట్లు చిత్రించారు. ఇది ఎంతో ఖ్యాతి గాంచింది. ఈ దేవతావిహంగానికి రెండు తలలుంటాయి. ఎగురుతున్నట్లు కనిపించే రీతిలోనున్న ఈ పక్షి సర్వాభరణాలతో ఉన్నట్లుంది. రెండు ముక్కులలోను, రెండు కాళ్ళగోళ్ళమధ్య ఏనుగుల్ని చిత్రించారు. బొరుసువైపు దేవనాగరిలిపిలో 'శ్రీప్రతాపచ్యుతరాయ' అనే అక్షరాలు ముద్రించారు.

ఏ నాణెం ఎంతెంత...

నాణెం	వ్యాసార్ధం (సెం.మీ.లో)	బరువు (గ్రాములు)	సంఖ్య
01) వరహా	1.3	3.39	1
02) వరహా	1.2	3.37	1
03) ప్రతాప (అర్ధవరహా)	1	1.69	2
04) ప్రతాప	1	1.61	1
05) ప్రతాప	0.90	1.69	2
06) ప్రతాప	0.97	1.69	1
07) ప్రతాప (అర్ధవరహా)	1	1.68	2
08) ప్రతాప (అర్ధవరహా)	0.80	1.70	1

09) ప్రతాప	1	1.70	1
10) ప్రతాప (అర్ధవరహా)	0.90	1.50	1

3) సదాశివరాయలకాలంలో...



బొమ్మ బొరుసు

వీరు నాణేల బొమ్మవైపు విష్ణువు - లక్ష్మి, శివపార్వతులను చిత్రించారు. బొరుసువైపు దేవనాగరిలిపిలో 'శ్రీ ప్రతాప శివరాయ' అనే అక్షరాలు ముద్రించారు.

ఏ నాణెం ఎంతెంత...

నాణెం	వ్యాసార్ధం (సెం.మీ.లో)	బరువు (గ్రాములు)	సంఖ్య
1) వరహా	1.30	3.30	1
2) వరహా	1.3	3.33	2
3) ప్రతాప	1	1.69	2

ఇ) ఆరవీటివంశయుగంలో...

1) తిరుమలరాయలకాలంలో...

వీరు తన రాజ్యాన్ని పెనుగొండకు మార్చారు. వీరు వరహా, అర్ధవరహానాణేలపై సీతారాములప్రతిమను చిత్రించి ముద్రించారు. కానీ అవి అలభ్యం.

2) మొదటి శ్రీరంగరాయలకాలంలో...

వీరు వేంకటేశునిబొమ్మతో బంగారునాణేలను ముద్రించడంలో శ్రీకృష్ణదేవరాయలు ప్రవేశపెట్టిన సంప్రదాయాన్నే పునరుద్ధరించారు. ఆ నాణేలమీద నాలుగుచేతులతో స్వామి వారు నిలబడి ఉన్నట్లు చిత్రించారు. బొరుసువైపు 'శ్రీరంగ రాయ' అనే అక్షరాలు ముద్రించారు. కానీ అవి కూడా అలభ్యం.

3) మూడవ వెంకటపతిరాయలకాలంలో...



బొమ్మ బొరుసు

వీరు కూడా మొదటి శ్రీరంగరాయలవిధానాన్నే అనుసరించారు. శ్రీదేవి, భూదేవులతో ఉన్న వేంకటేశ్వరునిబొమ్మను చిత్రించి ముద్రించారు. శ్రీరంగరాయ గండికోటలో టంకశాలను స్థాపించారు. అక్కడ ముద్రింపబడిన నాణేలకే 'గండికోటవరహా' అని పేరు. వీరు ముద్రించిన నాణేలపై వేంకటేశ్వరుడు ఒక తోరణంకింద నిలబడిఉన్నట్లు చిత్రించారు. నాలుగుచేతులతోనున్న ఈ ప్రతిమ రెండుచేతుల్లో శంఖచక్రాలున్నాయి. నిజానికి ఆ నాణెంమీద శ్రీ వేంకటేశ్వరుని ప్రతిమ సాధారణంగా కనిపించే బొమ్మకాదు. తిరుమలఆలయంలో దర్శనమిచ్చే ప్రతిమను పోలి ఉన్నది. దీనినే తిరుమల వేంకటేశుని రేఖాచిత్రం లేదా ఛాయాచిత్రంగా భావించుకోవాలి. బొరుసువైపు దేవనాగరిలిపిలో 'శ్రీవేంకటేశ్వరాయ నమః' అనే అక్షరాలు ముద్రించారు.

ఏ నాణెం ఎంతెంత...

నాణెం	వ్యాసార్ధం (సెం.మీ.లో)	బరువు (గ్రాములు)	సంఖ్య
01) వరహా	1.2	3.43	1
02) వరహా	1.3	3.33	1
03) వరహా	1.3	3.43	1
04) వరహా	1.2	3.35	1
05) ప్రతాప	1	1.75	1
06) ప్రతాప	1	1.7	13
07) ప్రతాప	1	1.50	1
08) ప్రతాప	1	1.65	1
09) ప్రతాప	1	1.71	28
10) ప్రతాప	1	1.65	1
11) ప్రతాప	1	1.63	1
12) ప్రతాప	1	1.64	1
13) ప్రతాప	1	1.72	5
14) ప్రతాప	1	1.73	4
15) ప్రతాప	1	1.69	3
16) ప్రతాప	1	1.70	1
17) ప్రతాప	1	1.66	1

ఇదీ విజయనగరపాలకులకు తిరుమలకు ఉన్న అనుబంధం. వారి యుగంలో అంటే బంగారుయుగంలో స్వామివారికి భక్తితో సమర్పించుకున్న బంగారునాణేల వైభవం నేటికీ విరాజిల్లుతుండటం గణనీయవైభవంగా చెప్పుకోవచ్చు.

(తి.తి.దే. వారి "తిరుమల శ్రీ వేంకటేశ్వరునిహుండీలో బంగారునాణేలు" అన్న గ్రంథమాధారంగా)

ధర్మాచరణము మోక్షప్రతిబంధకాలను తొలగిస్తుంది

పరమపుణ్యధామమూ... ఉత్తరద్వారదర్శనము!!

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 9985670152

శ్లో॥ సత్యం సత్యం పునస్సత్యం నదేవో వేంకటేశ్వరాత్
బ్రహ్మాండే నాస్తి, యత్కించిత్ న భూతం న భవిష్యతి.
- భవిష్యోత్తర పురాణం

సత్యంగా చెబుతున్న మాట! ఒకసారి కాదు. మళ్లీ మళ్లీ చెబుతున్న సత్యమైన మాట ఇది! ఏమిటా సత్యం. అంటే ఈ బ్రహ్మాండాల్లో ఎక్కడా అటు భూతకాలంలోను ఇటు భవిష్యత్తులోను శ్రీవేంకటేశ్వరునివంటి దేవుడు లేడు. లేనే లేడు. కనపడడు కూడా" అని.

అలాంటి ఆనందనిలయుని దర్శనంకోసం బయలు దేరడం, ఏడుకొండల్లో విహరించడం, బంగారుమేడ ఆనంద నిలయాన్ని వీక్షించడం, ఆనందనిలయుని నిలువెత్తు దివ్యమంగళ విగ్రహాన్ని కన్నులారా దర్శించడం... ఇలా వీటన్నింటివల్ల దివ్యాను భూతులతో ఒక ఆనందాన్ని పరమానందాన్ని పొందడం అద్భుతం పరమాద్భుతం! అయితే !

'అందరూ ఒక ఎత్తు, అగస్త్యుడొక ఎత్తు' అన్నట్లు ఇన్నిన్ని ఆనందాల్ని నిరంతరం పంచుతూ. భక్తులను మైమరపిస్తున్న తిరుమలక్షేత్రాన్ని ఏడాది పొడవునా దర్శించడం ఒక ఎత్తు! కాగా

ప్రత్యేకంగా ధనుర్మాసంలో ఒక నెలరోజుల్లో, ఏ ఒక్క రోజైనా తిరుమలక్షేత్రాన్ని సందర్శించే భాగ్యం కలగడం, ఆనంద నిలయుణ్ణి దర్శించి వింత వింత అనుభూతుల్ని ఆనందాన్ని పొందే అదృష్టం కలగడం మాత్రం, మరో ఎత్తు! అందులోను ధను ర్మాసంలో వచ్చే వైకుంఠఏకాదశిపండుగనాడు కలియుగవైకుం ఠంలో విహరించడంవల్ల, సందర్శించడంవల్ల భక్తుని మనస్సు ఆనందాలపంటలు పండేపూదోట అవుతుంది.

వెంకన్న సన్నిధిలో వైకుంఠఏకాదశి

ధనుర్మాసంలో శుక్లపక్షంలో వచ్చే 'ఏకాదశి'ని 'వైకుంఠ ఏకాదశి' అంటారు. తిరుమలక్షేత్రంలో వైకుంఠఏకాదశి, ఆ మరునాడు వైకుంఠద్వాదశి ఇలా ఇది రెండు రోజుల పండుగగా ఎన్నో విశిష్టసేవలతో నిర్వహింపబడుతుంది.

వైకుంఠద్వారం తెరవబడుతుంది

వైకుంఠ ఏకాదశికి ముందురోజు అనగా దశమినాటి రాత్రి ఏకాంతసేవానంతరం బంగారు వాకిళ్లు మూసివేస్తారు. పిదప తెల్లవారుజామున వైకుంఠఏకాదశినాడు సుప్రభాతసమయంనుండి మరు నాడునాడు ద్వాదశినాటి రాత్రి ఏకాంతసేవ వరకు శ్రీవారి గర్భాలయానికి దగ్గరగా ఆనుకొని ఉన్న "ముక్కోటిప్రదక్షిణమార్గం" తెరవబడుతుంది. ఈ ద్వారాలను వైకుంఠద్వారాలనీ, ఉత్తరద్వారాలనీ అంటారు. ఈ మార్గాన్ని 'వైకుంఠప్రదక్షిణమార్గం' అనీ అంటారు. ఈ మార్గం విద్యుద్దీపా లతో, సుగంధ, సుమనోహరమైన పులమాలలతో అలంకరింప బడిన ఈ వైకుంఠప్రదక్షిణంలో ప్రవేశించే భాగ్యం ఏడాదిలో ఈ రెండురోజులు మాత్రమే కలుగుతుంది. వైకుంఠఏకాదశి, ద్వాదశి రోజుల్లో శ్రీ స్వామివారిని దర్శించిన తర్వాత వైకుంఠప్రదక్షిణంలో ప్రవేశం కలుగుతుంది. ప్రవేశించిన భక్తులకు దివ్యానుభూతులతో పాటు, పూర్వసంచిత పాపకర్మలన్నీ నశిస్తాయి. ఇష్టార్థాలన్నీ నెర వేరతాయి.

స్వర్ణరథోత్సవం

వైకుంఠ ఏకాదశినాడు సప్తగిరీశునికి మరో విశేష ఉత్సవం జరుగుతుంది. అదే స్వర్ణరథోత్సవం!

వైకుంఠ ఏకాదశినాడు ఉదయం 7 గంటలవేళ కలి యుగవైకుంఠనాథుడైన కొండలరాయడు శ్రీదేవీ భూదేవేరులతో కలిసి బంగారుతేరుపై పురవీధుల్లో దర్శనమిస్తారు. వైకుంఠఏకా దశినాటి స్వర్ణరథోత్సవంలో పయనిస్తున్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుణ్ణి దర్శిస్తే చాలు భక్తుల మనోరథాలు తప్పక తీరతాయి. భక్తుల గోవిందఘోషలమధ్య జరిగే తిరుమల గోవిందుని స్వర్ణ రథోత్సవదృశ్యాన్ని వర్ణించడం అక్షరాలకు అందదు. దర్శించి అనుభవించాలి. అంతే!



(జనవరి-08 వైకుంఠఏకాదశిసందర్భంగా....)

వైకుంఠఏకాదశి మరునాడు 'వైకుంఠద్వాదశి'. వీటినే "ముక్కోటిఏకాదశి", "ముక్కోటిద్వాదశి" అంటారు.

వైకుంఠఏకాదశి మరునాడు వైకుంఠద్వాదశినాడు "శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి ఉత్సవం" జరుగుతుంది.

ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యా మరుణోదయే
ఆయాతి సర్వతీర్థాని స్వామిపుష్కరిణీ జలే
తత్ర స్నాత్వా నరః సద్యోముక్తి మేతి నసంశయః
యస్య జన్మ సహస్రేషు పుణ్య మేవార్జితం పురా

ధనుర్మాసంలో వైకుంఠద్వాదశి నాటి అరుణోదయ వేళలో ముక్కోటి తీర్థాలు "శ్రీస్వామి పుష్కరిణి"లో మునకలిడుతాయి. శుభప్రదమైన ఆ వేళలో స్నానం చేసే మహాభాగ్యం అందరికీ కలుగనే కలగదట! ఎవరైతే వేలజన్మల్లో పుణ్యాన్ని ఆర్జించుకొని ఉంటారో, వారికి మాత్రమే ఈ నాడు తిరుమల శ్రీవారి కోనేట్లో స్నానం చేసే భాగ్యం కలుగుతుంది. అలాంటి వారికి సద్యోముక్తి కలుగుతుంది. అంటే వారు శరీరంతో ఉన్నా, జీవన్ముక్తిని పొందుతారని సారాంశం. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని స్కాందపురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యం స్పష్టం చేస్తోంది.

శ్రీవారి చక్రస్నానం

ఇలాంటి శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి శుభఘడియల్లో, అంటే వైకుంఠ ద్వాదశినాటి అరుణోదయవేళలో సూర్య భగవానుడు ఉదయిస్తుండగా తిరుమల శ్రీవారిఆలయం నుండి శ్రీ సుదర్శనభగవానుని ఉత్సవమూర్తి ఊరేగింపుగా వెళతారు. మహాప్రదక్షిణంమార్గంలో దర్శనమిస్తూ ఊరేగింపుగా శ్రీ సుదర్శన భగవానుడు 'శ్రీస్వామి పుష్కరిణికి చేరుకొంటారు. అక్కడ ముందుగా శ్రీసుదర్శనచక్రత్తాళ్వారుకు అర్చన అభిషేకాలు పూర్తి అయినతర్వాత శ్రీస్వామి పుష్కరిణిలో అర్చకస్వాములు మంగళ స్నానం చేయిస్తారు. దీన్నే "చక్రస్నానం" అంటారు. వైకుంఠ ద్వాదశినాటి సూర్యోదయవేళలో శ్రీ స్వామిపుష్కరిణీ తీర్థ ముక్కోటి శుభఘడిమల్లో ముక్కోటితీర్థాలు మునిగేవేళ శ్రీ వేంకటేశ భగవానుని దివ్యాయుధమైన శ్రీ సుదర్శనునికి జరిగే చక్రస్నానం సమయంలో వేలాదిమంది భక్తులు కోనేట్లో పవిత్రస్నానాలు చేస్తూ పునీతులవుతారు. ఇది మహాద్భుత ఘట్టం. ఇది సిద్ధించిన భక్తుని అదృష్టం ఏమని చెప్పగలం! ఎంతని చెప్పగలం!!

చెప్పగలం! ఎంతని చెప్పగలం!!
ఎందుకంటే!

శ్లో॥ స్వామిపుష్కరిణీ స్నానం సద్గురోః పాదసేవనం
ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యంత దుర్లభమ్

స్వామి పుష్కరిణిలో స్నానం చెయ్యడం, సద్గురువు పాద సేవ దొరకడం, ఏకాదశీవ్రతం ఆచరించడం అనే మూడు పవిత్ర కార్యాల్లో, ఒక్కటంటే ఒక్కటైనా కలగడం ఎంతో అదృష్టం.

ధనుర్మాసం, అందులో వైకుంఠఏకాదశి, ద్వాదశి పండుగవేళల్లో, శ్రీస్వామిపుష్కరిణీ స్నానంచేసి శ్రీవారిని దర్శించే భాగ్యం కలగడం ఎంతటివారికో మాత్రమే కలుగుతుంది.

తిరుమలలో "ధనుర్మాసం"

'ధనుర్మాసం' నెలలో తిరుమల శ్రీవారి ఆలయంలో ఆరాధనల్లో, అర్చనల్లో, సేవల్లో, ఊరేగింపుల్లో కొన్ని ప్రత్యేకతలు గోచరిస్తాయి.

శ్రీవారి మూలమూర్తిని సాక్షాత్తు శ్రీకృష్ణునిగాను, వక్షఃస్థల శ్రీమహాలక్ష్మిని గోదాదేవిగా భావించి వక్షఃస్థలంలో రెండు వైపులా బంగారుచిలకను, తమలపాకులచిలుకను అలంకరిస్తారు. ఆ తర్వాత సహస్రనామార్చనలో శ్రీస్వామివారికి బిల్వదళాలను ఉపయోగిస్తారు. పిదప శ్రీవారికి వేడివేడిగా పొంగళ్ళను, బెల్లపు దోసెలను నివేదిస్తారు.

రాత్రి ఏకాంత సేవాసమయంలో ఈ నెలరోజుల పాటు వెన్నముద్ద కృష్ణునికి పట్టెమంచంపై శయనభాగ్యం కలిగిస్తారు, ఆ తెల్లవారుజామున సుప్రభాతసమయంలో గోదాదేవి పాశురాలను ఏకాంతంగా జియ్యంగార్లు, వైష్ణవాచార్యులు పఠిస్తూ మేల్కొల్పుతారు. ఆ తర్వాత చిన్నికృష్ణునికి గోరువెచ్చనినీళ్లతో స్నానం చేయించి. పొంగళ్లను, బెల్లవుదోసెలను నివేదిస్తారు.

ముల్లోకాల తీర్థస్నానఫలం

చిరంజీవి అయిన మార్కండేయమహర్షి పూర్వం బ్రహ్మదేవుణ్ణి గూర్చి తపస్సుచేశాడు. సమస్తలోకాల్లోని అన్నితీర్థాల్లో స్నానం చేసేట్లుగా వరం ఇమ్మని అడిగాడు. అది అసాధ్యం! ఎన్నెన్ని లోకాలు ఉన్నాయో నాకే తెలియదు. ఈ బ్రహ్మాండాలు అనంతం. అందువల్ల నీవు వేంకటాచలంలోని "శ్రీస్వామి పుష్కరిణి"లో ధనుర్మాసంలో వైకుంఠఏకాదశి, ద్వాదశిరోజున సూర్యోదయవేళలో స్నానం చేస్తే చాలు. అన్ని తీర్థాలస్నాన ఫలితం సిద్ధిస్తుంది. ఎందుకంటే సమస్తతీర్థాలు తమ పాపాన్ని పోగొట్టుకోవడం కోసం ధనుర్మాసంలో వైకుంఠద్వాదశి, శ్రీస్వామిపుష్కరిణి తీర్థ ముక్కోటినాటి అరుణోదయవేళలో ఆ కోనేట్లో మునకపెడతాయి. అట్లా నీ కోరిక నెరవేరుతుంది అని వరమిచ్చాడు బ్రహ్మదేవుడు. ఇలా ధనుర్మాసంలో వైకుంఠఏకాదశీ, ద్వాదశీ పండుగ రోజుల్లో కలియుగ వైకుంఠమైన తిరుమలను దర్శించి ధన్యులమవుదాం.

ఓం నమో వేంకటేశాయ!

స్వామిత్వసిద్ధి పుష్కరిణి

- శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్

శేషాచలంపై అర్చావతారంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యాలయానికి ఈశాన్యభాగంలో స్వామిపుష్కరిణి అనే తీర్థమున్నది. ప్రతి సంవత్సరం ధనుర్మాసం శుక్లపక్షద్వాదశినందు సూర్యోదయసమయంలో ప్రసిద్ధమైన మూడుకోట్ల యాభైలక్షల పుణ్యతీర్థాలన్నీ కూడా సంవత్సరమంతా తమయందు పాపాత్ములు స్నానం చేస్తారు కాబట్టి వారి పాపమంతా తొలగించుకోవటానికి గాను ఈ స్వామి పుష్కరిణియందు కలుస్తాయి. ఆ సమయంలో మానవులు కూడా స్నానమాచరించినట్లైతే ఆ పుణ్యతీర్థస్నానఫలమంతా వారికి కూడా లభిస్తుంది. అన్ని తీర్థాలకు స్వామిని కాబట్టి ఈ తీర్థానికి స్వామిపుష్కరిణి అనే పేరొచ్చింది. శ్రీస్వామి పుష్కరిణిలో స్నానమాచరించి, శ్రీస్వామివారిని సేవించి తీర్థప్రసాదాల్ని స్వీకరించినవారికి సకలార్థసిద్ధి కలుగుతుందని వామనపురాణవాక్కు.

వేంకటాచలంలో సరస్వతీదేవిని అనుగ్రహించ దానికే పుష్కరిణిని భగవంతుడు ప్రత్యేకంగా సృష్టించాడని విన్నాం. బ్రహ్మాండంలోని అన్ని సరోవరాలకన్నా ప్రశస్త్యమైన దని విన్నాం. ఆ పుష్కరిణిమహిమలు, అందులో స్నానం చేస్తే కలిగే ఫలాలు, ఎవరెవరు అలా చేసి తరించారో కొందరి వివరాలు విన్నాం. ఈ పుష్కరిణికే 'స్వామి పుష్కరిణి' అని పేరు. ఆ పేరు ఎలా వచ్చింది? ఎందుకొచ్చింది? ఆ వివరాలు తెలుసుకుందాం...

దానికి పురాణాలు రెండుకారణాలు చెప్తున్నాయి. అన్ని సరోవరాలకన్నా ప్రముఖమైనది కనుక శ్రేష్ఠమైనది. నాయికీ, స్వామిని లాగే ప్రధానమైంది కనుక దానికి స్వామి పుష్కరిణి అని పేరు వచ్చిందని ఒక కథనం.

రెండో కారణం - ఎవరైతే వారి స్వామిత్వం పోగొట్టుకొన్నప్పుడు అలాంటివారు కనుక భక్తిశ్రద్ధలతో ఈ పుష్కరిణిలో స్నానం చేస్తే వారు పోగొట్టుకొన్న స్వామిత్వాన్ని మరల పొందుతారు కనుక ఈ పుష్కరిణికి 'స్వామిపుష్కరిణి'



(జనవరి-09 స్వామిపుష్కరిణీతీర్థముక్కోటిసందర్భంగా..)

అని పేరు వచ్చిందని పురాణ కథనం. దీనికి 'శంఖ' లేదా 'శంఖణ' కథయే నిదర్శనం.

ఆ కథేమంటే...

'శంఖ' అనే రాజు అపర భక్తుడు. అపరపరాక్రమ శాలి. చాలా ధార్మికంగా పరిపాలన చేసేవాడు. అతనిది అతిపెద్ద రాజ్యం. విస్తృతమైన అధికారం చెలాయించేవాడు. అతని చుట్టుపక్కల రాజ్యాల రాజులు అతనిని ఎదిరించే పరిస్థితే లేదు. కాని, విధివశాత్తు ఆ రాజులందరూ ఒక ఒప్పందానికొచ్చి అందరూ కలిసి అతనిపైకి ఒక్కసారిగా దండెత్తి వచ్చి ఓడించి అధికారభ్రష్టుని చేశారు.

అలా ప్రాణాలతో తప్పించుకొని బయటపడ్డ ఆ 'శంఖ' రాజు తన గురువులైన జ్ఞానులను, మహాత్ములను కలిసి తన పరిస్థితి వివరించాడు. వారిని తనకు ఏదైనా సలహా ఇవ్వుమని అడిగాడు. అదివిని వారు 'వేంకటాచలానికి వెళ్లి అక్కడి భగవంతుని ప్రార్థించి పుష్కరిణిలో స్నానం చేస్తే నీ సమస్యలన్నీ పరిష్కారమై, నీ రాజ్యం నీకు దక్కుతుందని" సలహా ఇచ్చారు.

ఆ సలహామేరకు అతను ప్రగాఢమైన భక్తిశ్రద్ధలతో వేంకటాచలానికి యాత్రచేసి, శ్రీనివాసుని ప్రార్థించి, పుష్కరిణిలో స్నానం చేశాడు. అతనిభక్తికి మెచ్చి, స్వామి అతడు పుష్కరిణిలో స్నానం చేస్తున్న సమయంలోనే పుష్కరిణి మధ్యలోనే అతనికి దర్శనమిచ్చి అనుగ్రహించాడు.

అంతా భగవదేచ్ఛ...! స్వామి అనుగ్రహం పొందిన తనకు తనను జయించిన రాజులవద్దనుండి కబురొచ్చింది. ఆ రాజులందరూ, 'శంఖ' మీద గెలిచేవరకూ కలిసే ఉన్నారు. తర్వాత 'శంఖ' రాజ్యం ఎవరు తీసుకోవాలనే విషయంలో భేదాభిప్రాయాలు వచ్చాయి. 'నాకు కావాలి' అంటే 'నాకు కావాలి' అని వారిలో వారికి పరస్పర తగాదా ప్రారంభమైంది. 'శంఖ'కు స్వామి పుష్కరిణిస్నానంతో, పోయిన స్వామిత్వం మరల సిద్ధించే భాగ్యం కలగటంవల్ల ఆ శత్రురాజులందరూ ఒక ఒప్పందానికొచ్చి, 'శంఖ' రాజు రాజ్యం అతనికే తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించారు. అందుకే వారివద్దనుంచి కబురొచ్చింది.

అలా 'శంఖ'కు – మహాప్రయత్నం చేసినా నిలుపుకోలేని రాజ్యం పుష్కరిణిస్నానంతో తిరిగొచ్చిందనీ, అలా పోయిన స్వామిత్వం తిరిగి ఇప్పించే శక్తి కలది కనుకదానికి స్వామి పుష్కరిణి అని పేరు వచ్చిందనీ పురాణం చెబుతోంది. అధికారం పోగొట్టుకున్నవారు ఎవరైనాసరే వారు రాజు కావచ్చు, మంత్రికావచ్చు, అధికారి కావచ్చు, నాయకుడు కావచ్చు – ఈ 'స్వామి పుష్కరిణి'లో భక్తితో స్నానంచేసినట్లైతే, పోయిన పదవి తిరిగి వస్తుందని పురాణవాక్కు.

అందుకే దీనికి 'స్వామి పుష్కరిణి' అని పేరు. కాని అది కామ్యకర్మ. అది ఎలాగైనా దొరుకుతుంది. దానికంటే మనకు బయటి శత్రువులకన్నా లోపలి శత్రువులే (అంతః శత్రువుల) గొప్ప శత్రువులు. మన మనస్సే మనకు ముఖ్యశత్రువు. మన మనస్సుమీద మనకు నిగ్రహముండదు. ఇంద్రియాల మీదా నిగ్రహముండదు.

కాబట్టి ఈ వేంకటాచలంలోని పుష్కరిణిలో స్నానం చేసి మనస్సు అనే శత్రువును జయించి, ఇంద్రియాలపై స్వామిత్వం సిద్ధించుకోవచ్చు కనుక దీనికి 'స్వామి పుష్కరిణి' అని పేరు.

రచనలకు ఆహ్వానం

బాలబాలికలకు, యువతకు సనాతన హైందవ ధర్మంపట్ల ఆసక్తి కల్గించి ఆచరించేలా చేసేందుకుగాను ప్రసిద్ధ రచయిత (త్రు)లు మరియు బాలబాలికలతో కూడా 'బాలప్రబోధం', 'బాలవాక్కు' శీర్షికన రచనలకై 'సప్తగిరి' పత్రిక ఆహ్వానిస్తోంది. ఉత్తమరచనలకు బహుమతులుంటాయి.

రచనలు పంపాల్సిన చిరునామా :
ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం,
కపిలతీర్థం రోడ్డు, తి.తి.దేవస్థానములు,
తిరుపతి - 517 507.

గొబ్బిళ్లో... భోగి గొబ్బిళ్లో..

- శ్రీమతి పి.పద్మజ

(జనవరి-13 భోగి సందర్భంగా..)



సూర్యోపాసన వేదకాలంనుండి ఆచారంగా వస్తోంది. సంధ్యావంద నాల్లో జపించే అనేకమంత్రాల్లో సైతం ఆదిత్యుని స్తుతించటం జరుగుతోంది. సూర్యభగవానుడు ఉదయించే తూర్పు దిశ మనకు పరమపవిత్రమైంది. వైజ్ఞానికపురోభివృద్ధితో పరుగుపందెం వేస్తున్న పాశ్చాత్యదేశాలదృష్టిలో సూర్యచంద్రులు కేవలం గ్రహాలే ఐనా మన దృష్టిలో మాత్రం ఎప్పటికీ ప్రత్యక్ష దైవాలే. ఆంధ్రదేశాన్నంతా ఆనందడోలికల్లో ఊగించే 'సంక్రాంతి' పర్వం సప్తాశ్వుని గమనానికి సంబంధించిన పర్వదినం.

ముచ్చటైన మూడురోజులపండుగ

సంక్రాంతిని సాధారణంగా భోగి, మకరసంక్రాంతి, కనుము అని మూడురోజులు జరుపుకుంటారు.

భోగిపండుగ

మకరసంక్రమణానికి ముందు రోజు భోగిపండుగ జరుగుతుంది. భోగి అనే పదం 'భుజ్' అనే సంస్కృత ధాతువు నుంచి ఉత్పన్నమైంది. సర్వ సమృద్ధికి దేవేంద్రుని అనుగ్రహార్థం ఈ పండుగ జరుపబడుతోందని కొందరి భావన. భూదేవి అంశగా జన్మించిన 'గోదాదేవి' ఈ ధనుర్మాస కాలంలో ధనుర్మాసవ్రతం చేసి విష్ణుమూర్తిని ఆరాధించి, మకరసంక్రమణానికి ముందు రోజు విష్ణువును వివాహమాడింది. ఆ పెళ్లికి సూచకంగానే ఈ భోగిపండుగ (గోదాదేవి విష్ణుమూర్తుల భోగజీవితానికి చిహ్నం) నిర్వర్తింపబడుతోందని పురాణాలవాక్కు. భోగిపండుగనాటి తెల్లవారుజామున తమ తమ ఇండ్లల్లోనున్న పాత వస్తువులు మంటల్లో వేస్తారు. ఉత్తరభారతంన ఈ మంటల్ని 'లోడి' అంటారు. ఆ మంటపై కాగబెట్టిన నీటితో అభ్యంగన మంగళస్నానంచేసి దీనితో అశుభం పీడ విరుగడైందని భావిస్తుంటారు. శీతాకాలస్తబ్ధతను పారద్రోలి నూతన చైతన్యం కలిగించటానికే ఈ భోగిమంటలు పూర్వికులచే నిర్దేశించబడ్డాయనే భావన మాత్రం స్ఫుటంగా తోస్తుంది.

గొబ్బిళ్ల వృత్తాంతమేమంటే.....

'గొబ్బి' అనే మాట 'గర్భ' అనే పద్మంనుండి వచ్చిం దని కొందరూ, 'గోపి' అనే పదంనుండి వచ్చిందని మరి కొందరిమాట. 'గర్భ' అనే పదము కన్నా 'గోపి'



అనే పదమే సమంజసమైందిగా తోస్తుంది. ఆండాళ్ రచించిన తిరుప్పావై అనే గ్రంథంలో గోపాలకృష్ణుని గోపికలు 'గోపియలో' అంటూ గానం చేస్తూ స్తుతించారు కాబట్టి గొబ్బినృత్యాలు గోపికానృత్యాలుగా భావించబడ్డాయి. అంతే గాక ధనుర్మాసానికి వైష్ణవమతానికి గల సాన్నిహిత్యాన్ని బట్టి కూడ ఈ గొబ్బినాట్యాలు వైష్ణవమత ప్రాబల్యంతో గోపికలనృత్యంగా ఊహించబడ్డాయి.

ధనుర్మాసారంభంనుండి మకరసంక్రమణం వరకూ గృహప్రాంగణమున రమ్యమైన రంగ వల్లులు దిద్ది, ఆ ముగ్గు మధ్యలో పసుపు కుంకుమ, గుమ్మడిపూలతో అలంకరించిన మూడు గోమయపుముద్దలు (గొబ్బిళ్ళు) పెడతారు. ధనుర్మాస నియమాలందు ఈ గొబ్బిళ్లను గురించి–

గోమయేనచ గాంకృత్వా తథాగోవర్ధనం శుభమ్
గోపాలం పూజయేన్నిత్యం శ్రద్ధయా కురునందన

అని ఉల్లేఖింపబడింది. మూడు గోమయపు ముద్దల్లో ఒకటి గోపాలకృష్ణునికి, రెండవది గోమాతకు, మూడవది గోవర్ధనగిరికి సంకేతాలని భావం. ఈ విధంగా అలంకరించిన గొబ్బిళ్లచుట్టూ బాలికలు ప్రదక్షిణం చేస్తూ పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. దీనిని బట్టి కన్యలు తమ కోర్కెలు ఫలించేందుకు గొబ్బిళ్లను పూజి స్తుంటారని తెలుస్తోంది.



శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు, శ్రీనివాసమంగాపురం

2017, ఫిబ్రవరి 15 నుండి 24 వరకు

తేదీలు	వారం	పగలు ఉత్సవం	రాత్రి ఉత్సవం
15-02-17	బుధ	---	అంకురార్పణం
16-02-17	గురు	ధ్వజారోహణం	పెద్దశేషవాహనం
17-02-17	శుక్ర	చిన్నశేషవాహనం	హంసవాహనం
18-02-17	శని	సింహవాహనం	ముత్యపుపందిరివాహనం
19-02-17	ఆది	కల్పవృక్షవాహనం	సర్వభూపాలవాహనం
20-02-17	సోమ	మోహినీఅవతారం	గరుడవాహనం
21-02-17	మంగళ	హనుమద్వాహనం	సా॥వసంతోత్సవం,గజవాహనం
22-02-17	బుధ	సూర్యప్రభవాహనం	చంద్రప్రభవాహనం
23-02-17	గురు	రథోత్సవం	అశ్వవాహనం
24-02-17	శుక్ర	చక్రస్నానం	ధ్వజావరోహణం

సంక్రాంతి సంబరాలు

- శ్రీ ఎం.గురుస్వామి

(జనవరి-14 సంక్రాంతి సందర్భంగా..)

పుష్యమాసంలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రకృతిశోభను నింపుకు వచ్చే అందమైన పండుగ సంక్రాంతి. గడప గడపకును వ్రేలాడే పచ్చని మామిడాకుల తోరణాలతోను, ప్రతిఇంటిముంగిటిలో విరగబూసిన బంతి పూల పరిమళాలతోను, ఆబాలగోపాలానికి ఆనందోత్సాహాల్ని పంచిఇచ్చే ఈ పండుగకు మకరసంక్రాంతి అనిపేరు.

సంక్రమణమంటే....

సంక్రాంతి అంటే సంక్రమణం. సంక్రమణమంటే కదలిక. సూర్యభగవానుడు ఈ సంక్రాంతి పర్వదినాల్లో ధనుస్సురాశినుండి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. అందువల్లనే ఇది మకరసంక్రాంతి అయింది. ఆరోగ్యప్రదాత అయిన భానుడు సంక్రాంతినుండి ఆరోగ్యపు వాతావరణాన్ని కల్పిస్తాడు. సంక్రాంతినాడు సంవత్సరంలో ఆరుమాసాల దక్షిణాయనకాలం పూర్తై, ఆరుమాసాల ఉత్తరాయణకాలం ప్రారంభమౌతుంది. మానవుని సమస్తపాపాలు భస్మీపటలమై స్వర్గద్వారాలు తెరువబడుతాయని మన శాస్త్రాలు తెల్పుతున్నాయి. మహాభారతయుద్ధంలో శరతల్పగతుడైన భీష్ముడు ఈ ఉత్తరాయణకాలంనే తన మరణకాలంగా కోరుకున్నాడు.

జానపదుల ఆనందహేల

'మాసానాం మార్గశీర్షోస్మి' అన్నాడు గీతాచార్యుడు శ్రీకృష్ణుడు. పుష్యమాసానికి ముందరిదే విష్ణుప్రీతికరమైన మార్గశిరమాసం. ఈ మాసంలో పై తెలిపినట్లు సూర్యుడు ధనూరాశిలో ఉండడంవల్ల దీనిని ధనుర్మాసం అని పిలుస్తారు. ఈ మాసంలో భక్తులు వేకువజామునే లేచి నగరసంకీర్తనం గావిస్తారు. స్త్రీ పురుషులు సూర్యోదయాత్పూర్వమే లేచి స్నానాదులు ముగించుకొని దేవాలయాలకు వెళ్తారు. 'హరిలో రంగ హరి' అంటూ విష్ణుసంకీర్తనం చేసే హరిదాసులతోను, 'అమ్మగారికి దణ్ణంపెట్టు అయ్యగారికి దణ్ణంపెట్టు' అంటూ బసవన్నలను ఆడించే గంగిరెద్దులవారితోను, 'అంబ పలుకు జగదంబ పలుకు' అనే బుడబుక్కలవారితోను మార్గశిరపుష్యమాసాల ప్రాతఃకాలాలు ఎంతో ఆనందంగా ఉంటాయి.

గొబ్బిదేవతాలంకరణ

రకరకాలుగ తీర్చిన ముగ్గులతో, కళకళలాడే వాకిళ్లతో పల్లెలూ, పట్టణాలూ కూడా వింతవింత అందాల్ని సంతరించుకుంటాయి. స్త్రీల కళాభిరుచి, నైపుణ్యం వ్యక్తమౌతుంటాయి. ఆడపిల్లలు గోమయంతో గొబ్బెమ్మలను గుండ్రంగా చేసి, వాటిని పసుపుకుంకుమలు, బంతిపువ్వులు, గుమ్మడిపూలతోను అలంకరించి, ఆ ముగ్గుల్లో చక్కగ అమరుస్తారు. సందెవేళల్లో పెద్దగొబ్బెమ్మను చేసి, పూజించి, ఇరుగుపొరుగువారిని పేరంటానికి పిలిచి, వారిని పసుపు, కుంకుమ, పూలతో సత్కరిస్తారు.



చామంతిపూవంటి చెల్లెల్నియ్యవే
తామరపూవంటి తమ్ముణ్ణియ్యవే
మొగిలిపూవంటి మొగుణ్ణియ్యవే
పనసపండంటి పాపణ్ణియ్యవే

అంటూ పాడుతూ, చప్పట్లుచరుస్తూ ఆ గొబ్బి దేవతచుట్టూ తిరుగుతారు. రమ్యమైన ఆ సన్నివేశం చూపరులమనస్సుల్ని ఎంతగానో రంజింపజేస్తుంది.

భోగిసంబరంలో....

సం(క్రాంతి మూడురోజులూ ముచ్చటైన పండుగే. మొదటిరోజైన భోగిపండుగనాడు వేకువజామున భోగి మంటలు వేస్తారు. సాయం(త్రం రేగుపండ్లతో పూరేకులు నాణేలు కలిపి బాలబాలికలకు భోగిపోస్తారు. అలా పోసి పిల్లలకు భోగిపీడ వదలినట్లుగ భావిస్తారు. ఈ మూడు రోజులూ రకరకాల బొమ్మలతో బొమ్మలకొలువులు అమరుస్తారు. మహిళలు వివిధభంగిమలతో అత్యంత ఆకర్షణీయంగా అమర్చబడిన ఆ బొమ్మలకొలువుల్లో వారి నైపుణ్యం చూపిస్తారు. ఆ బొమ్మలపేరంటాలు స్నేహభావాన్ని పెంచేవిగను, సమసమాజంయొక్క భావాన్ని పెంపొందించేవిగానూ తోస్తాయి.

సంక్రాంతిసంబరంలో.....

రైతులు తమ వ్యవసాయంలో వచ్చిన ధాన్యాన్ని కుప్పగా పోసి, గుమ్మడిపండును దిగదుడిచి, ధాన్యపురాశిని పూలతో అలంకరించి, తమధాన్యానికి దిష్టి తగలకుండునని భావిస్తారు. ఇది మన పురాతన వ్యవసాయదారుల సం(ప్రదాయం.

కనుమసంబరంలో...

కనుమనాడు పశువులకోష్టాల్ని శు(భంచేసి, ముగ్గులేసి, పొంగళ్ళు చేస్తారు. తమతమ పశువుల్ని పసుపుకుంకాలతో పూజించి ఆనందిస్తారు. ఆ పొంగలి మెతుకుల్ని పొలంలో చల్లుతారు. ఈ కార్యానికే 'పొలి చల్లడం' అనిపేరు.

కొత్త ఉత్సవానికి, ఉజ్జ్వలభవితకు స్వాగతం పలుకుతూ, గతానికి వీడ్కోలుగా రథం ముగ్గులు వేస్తారు. సం(క్రాంతిపండుగకు తుదిపలుకు చెప్తారు. నూతన జామాతలతోను, చుట్టపక్కాలతోను, బోసిపాపల నవ్వుల సంబరాలతోను (ప్రతిఇల్లునూ సత్వభావనతో కనబడుతుంది. పరస్పరావగాహన, స్నేహ, సుహృద్భావాల్ని పెంపొందించు కోవడమే ఈ పర్వాల, పండుగలయొక్క అంతరార్థం.

వైజ్ఞానికపర్వసంక్రాంతి

మృగశిరనక్ష(త్రం ఈ మాసపు శుద్ధపాడ్యమినాడు సూర్యాస్తమయం తర్వాత మొదటగా గగనతలంమీద కనిపిస్తుంది. కనుక ఆ నక్ష(త్రంనామంతో ఇది 'మృగశిర మాసం' అయింది. ఈ మార్గశిరమాసం దక్షిణాయనంలో కడపటి మాసం. ఈ మాసంలో చలి మిక్కిలి ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలోనే అనేకమైన తీ(వ్ర అనారోగ్యాల్ని కల్పించే సూక్ష్మజీవులు, (క్రిములు, కీటకాలు ఉద్ధృతంగా (ప్రబలుతాయి. గోమూ(త్రానికి, గోమయానికి ఈ సూక్ష్మ జీవుల్ని సంహరించే శక్తి ఉంది. గోమూ(త్రం చల్లేచోటున తేళ్లు, జె(ర్రులు వంటివి వచ్చే అవకాశముండదు. సూక్ష్మ జీవుల్ని నిర్మూలించే శక్తి ఈ గోమూ(త్రానికి ఉన్న కారణంగా (ప్రాచీనులు పంచగవ్యాన్ని సేవించేవారు. పంచగవ్యమంటే అందులో గోక్షీరం, గోదధి, గోఘృతం, గోమూ(త్రం, గోమయం ఉంటాయి. గోమయాన్ని నీటిలో కలిపి ముంగిళ్ళలో కలయంపి చల్లుతారు. తర్వాత దీనిమీద పెద్ద పెద్దముగ్గులు వేస్తారు. ఈ ముగ్గుల్లో (ప్రధానంగా సున్నం ఉండటంవల్ల ఇదికూడా సూక్ష్మజీవుల నిర్మూలనకుపయోగ పడుతుంది. ఈ గొబ్బెమ్మలమీద మరల పసుపు, కుంకుమలతో ముగ్గులు వేస్తారు. ఇవికూడా సూక్ష్మజీవుల నాశ కారకాలే. తర్వాత ఆ గొబ్బిళ్లపైన గుమ్మడిపూలను పెడ్తారు.



ఈ పూలు కాకపోతే మరే ఇతర పూలనైనా పెడతారు. గుమ్మడిపూలు పెద్దవిగా, ఆకర్షణీయంగా ఉండటంవల్ల వివిధాలైన అల్పకీటకాలు వచ్చి వాలటానికి అవకాశ ముంటుంది. అవి తీసుకొచ్చే సూక్ష్మజీవులు గోమయం ఘాటుకు నాశనమౌతాయి.

భోగి ధనుర్మాసంలోని చివరిరోజు. అంటే దక్షిణా యనంలోని చివరిరోజౌతుంది. అంతవరకు ఎముకలను కొరికి బాధించిన చలికి ఆఖరురోజు. అటువంటి చలికాలం పూర్తౌతోందన్న సంతోషంతో ఇళ్లల్లో ఉన్న పాతచొక్కాలు, చాపలు, చీపురుకట్టలు, కర్రలు ప్రోగుచేసి, మంటలేసి చలికాచుకుంటారు. చలికాలంలో పంటలకు, పశువులకు, మనుష్యులకును హానికలిగించే కీటకాలు వస్తాయి. ఇవన్నీ ఆ మంటలవల్ల ఆకర్షించబడి ఎగిరివచ్చి వాటిలో పడి ప్రాణాలు పోగొట్టుకుంటాయి. ఈ మంటల్లో గొబ్బి పిడకలను కూడ వేస్తారు.

సంకురుమయ్య ఎవరు?

దానం చేయటంలో తనకు తానే సాటియైనవాడు బలిచక్రవర్తి. అతడు స్వర్గాధిపత్యం పొందగలడని ఇంద్రుడు భయపడ్డంవల్ల శ్రీమన్నారాయణమూర్తి వామనుని అవతారమెత్తి బలిచక్రవర్తిని పాతాళానికి పంపించేడు. పాతాళమనగా దక్షిణధృవప్రాంతం. బలిచక్రవర్తి తనకు జరిగిన అన్యాయానికి ప్రతిగా సంవత్సరంలో సగభాగం సూర్యుని బంధించి ఉంచుతాడని కొన్ని పురాతనగాథల వాక్కు. వేదవాఙ్మయంలో ఇంద్రుడు-సూర్యుడు ఇరువురూ ఒక్కరుగనే కనబడతారు. ఈ బలిచక్రవర్తి బంధనుండి విడివడి సూర్యభగవానుడు బయటికి వచ్చినందుకు అనగా సూర్యభగవానుడు బలిచక్రవర్తిని జయించి వచ్చినందుకు ఆనందపూర్వకంగా ఈ సంక్రాంతిని జరుపుకుంటారు. ఈ కథలో బలిచక్రవర్తికి గల ప్రాముఖ్యం మూలంగానే అతనిని 'సంకురుమయ్య', 'సంక్రాంతిపురుషుడు' అనే నామములతో వ్యవహరిస్తారు.

కనుమునాడు కాకియైనను.....

సంక్రాంతి దినత్రయంలో చివరిరోజున జరుపు కునేది కనుముపండుగ. సంక్రాంతిసమయానికి పంటలన్నీ



పండి, ఆ పంట రైతుచేతికొచ్చి, ఆతనికి పుష్కలంగా పైకం చేతుల్లో ఆడుతుంటుంది. అందుకే ఈ పండుగకు ముఖ్యంగా కొత్తఅల్లుండ్రను పిలిపించుకొని బహుఉత్సాహవంతంగా ఈ పండుగను జరుపుకుంటారు. ఈ కారణం చేతనే దీనికి 'అల్లుండ్రపండుగ' అని కూడ పేరు. 'కనుమునాడు కాకియైనను కదలకూడదు' అని మనకున్న సామెత. అందువల్ల వచ్చిన బంధువులందరు పూర్తిగా ఈ మూడు రోజులూ ఉండి, ఆనందించిపోతారు. అట్లా ఉండాలనే ఈ సామెతను సృష్టించారేమో?

వ్యవసాయపర్వసంక్రాంతి

సంక్రాంతి వ్యవసాయానికి సంబంధించిన పర్వం కనుకనే, సేద్యానికి సంబంధించిన ఎద్దులను గంగిరెద్దులుగా అలంకరించడం, వాటి కొమ్ములకు రంగులు పూసి అందం కలిగించడం, మంచి బలమైన వృషభరాజములతో పందెములు నడపడం మనవారికి ఆచారంగ వచ్చింది. మన తెలుగువారికి వ్యవసాయంతో ఉంటున్నటువంటి బలీయమైన సంబంధం మూలంగా ఈ సంక్రాంతి మనకు కూడ ఎంతో ముఖ్యమైన పండుగ కాగలిగిందని చెప్పొచ్చు.

భీముడి సంక్రాంతి పొంగలిపూజ

- డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

సంక్రాంతి ముందు రోజు ధర్మరాజు అర్జునుని పిలిచి "అర్జునా" రేపు సంక్రాంతి. సంక్రమణపూజ జరగాలి. నీవు వెళ్లి శ్రీకృష్ణుని ఆహ్వానించు. నీ వెంటే అతడొస్తే మరీ సంతోషం అంటూ ఆదేశించాడు.

అన్నగారి ఆజ్ఞమేరకు అర్జునుడు ద్వారకకు వెళ్లాడు. కృష్ణుని రాజభవనంలో ప్రవేశించాడు. అంతా విచిత్రంగా ఉంది. ఎవరూ అతనిని పలకరించలేదు. అతనిని తృణ ప్రాయంగా చూసారు. కృష్ణుని అంతఃపురంలోనికి పోనివ్వలేదు. కృష్ణపర మాత్మ ఆజ్ఞమేరకు ఎవరూ లోపలికి ప్రవేశింప వీలులేదు అన్నారు. అర్జునుడు కోపంతో మండిపడ్డాడు. 'నేనెవరో తెలుసా? లేదా సోమరస ప్రభావమా?' అంటూ గర్జించాడు.

సేవకులు అతని గర్జనను వినిపించుకోలేదు. నీవు ఇక్కడినుండి వెళ్లిపోవాలి. లేకపోతే మా ప్రభువు ఆజ్ఞ పాలించక తప్పదు అన్నారు.

త్రిలోకవీరుడైన అర్జునుని "నీవు అంటూ సంబోధిస్తు న్నారు కదా! ఏమిటీ సేవకుల అలసత్వం!".

గాండీవి అవమానాన్ని సహించలేకపోయాడు. కోపా వేశంతో వెంటనే వెనుతిరిగాడు.

హస్తినాపురం చేరిన వెంటనే గాండీవాన్ని విసిరి పారేశాడు. కిరీట కర్ణ కుండలాలను తీసేసాడు. శయనా గారానికి వెళ్లి జరిగిన అవమానానికి కుమిలిపోయాడు. సుభద్ర పరుగెత్తుకు వచ్చింది. ఏం జరిగింది? అంటూ ప్రశ్నించింది. సమాధానం లేదు. వెంటనే ద్రౌపదిని పిలుచుకొని వచ్చింది. ద్రౌపది కలవరంతో విషయమేమిటని ప్రశ్నించింది. అర్జునుని కోపం చల్లారలేదు. దూతిక వెళ్లి ధర్మరాజుకు విషయం తెల్పింది.

ధర్మరాజు స్వయంగా అర్జునుని వద్దకు వచ్చాడు. అర్జునుడు సిగ్గుతో అన్నగారిని చూశాడు.

జరిగిన సంగతి అన్నగారికి తెలిపాడు. ధర్మరాజు బాధపడ్తూ "మనమేమైనా తప్పు చేసామా? శ్రీకృష్ణుని ప్రేమ కురుక్షేత్రానికే పరిమితమైందా?" అనుకున్నాడు.

'ధర్మనందనా! అలా అనకండి. దుశ్శాసనుడు నన్ను నిండుసభలో అవమానిస్తున్నపుడు మీరు నిస్సహాయులై బాధపడుతూన్నారు. నేను "కృష్ణా" అని పిలిచిన వెంటనే వచ్చి నా గౌరవంకాపాడలేదా? అరణ్యవాసంలో ఉన్నప్పుడు దుర్వాస మహర్షి మన ఆతిథ్యం కోరాడు. అప్పటికే నేను అక్షయపాత్రను కడిగి తుడిచిపెట్టేశాను. అప్పుడు కూడా కృష్ణుడే కదా వచ్చి అక్షయపాత్రలోనున్న ఒకేఒక్క మెతుకును తిని మనలను కాపా డాడు. కురుక్షేత్రయుద్ధంలో కర్ణుని బాణం అర్జునుని శిరస్సును ఖండిస్తుందేమోనని రథాన్ని నేలలోనికి క్రుంగదీసి అర్జునుని ప్రాణం కాపాడలేదా? అతడు నాకు అన్న కదా! నేను ఒకమారు "కృష్ణా" అని పిలుస్తాను. అతడు నా పిలుపు విని తప్పక వస్తాడు అంటూ ద్రౌపది ధర్మరాజును సమాధానపరిచింది'.

ద్రౌపది కనులుమూసుకొని తన రెండుచేతులు పైకెత్తి "కృష్ణా.. కృష్ణా.. కృష్ణా..."అంటూ జపించింది. ఆమె పిలుపును విని వెంటనే రావల్సిన కృష్ణుడు రాలేదు. పలుమార్లు కృష్ణనామం జపించి అలసిపోయింది ద్రౌపది.

మనవల్ల ఏదో అపరాధం జరిగింది. అందుకే కృష్ణుడు రాలేదు. ధర్మరాజు తల వంచు కున్నాడు. భీమ, నకుల, సహ దేవులు కూడా విషణ్ణవదన లయ్యారు. కాని భీమునిలో ఏదో ఒక మెరుపు మెరిసింది. ఒంటరిగా తన వ్యాయామశాల చేరు కున్నాడు. రాత్రయ్యింది. అతనిలో ఒక

(జనవరి-14 మకరసంక్రమణం సందర్భంగా..)

ఆలోచన మెరిసింది. తన గదను ఎత్తుకొని బయటికి వచ్చాడు. ఒకమారు ఆకాశంవైపు చూసాడు. అమావాస్య తరువాత రోజు ఆకాశంలో నక్షత్రాలు మాత్రమే మెరుస్తున్నాయి. "హుం" అంటూ ఘీంకరించి గదను బొంగరంలా తిప్పి పైకి విసిరాడు. అది వేగంగా తిరుగుతూ కిందికి పడుతూ ఉంది. సరిగ్గా, గద క్రిందనే నిలబడ్డాడు భీముడు!

కృష్ణా! నన్ను కాపాడు అని వేడుకొన్నాడా? అంటే అదీలేదు. కృష్ణా! వస్తావా... రావా? అంటూ తన రెండు చేతులను నడుముపై ఉంచుకొని హుంకరించాడు.

పదిమణుగుల బరువున్న ఆ ఉక్కుగద భీముని తలపై పడి అతని తల వేయిముక్కలై పోవాల్సింది. కాని గద అతని తలపై పడలేదు. శ్రీకృష్ణుడు భీముని తలమీద పడుతున్న గదకు మధ్య తన అమృతహస్తముంచి ప్రమాదాన్ని తప్పించాడు. భీముడు కళ్లు తెరచి చూసాడు. అతని ముందు చిరునవ్వుతో వేణువును తన కుడిచేతిలో ఉంచుకొని ఎడమచేతితో భీమునితడుతూ నిల్చొనున్నాడు కృష్ణుడు.

ఆ రీతిగా కృష్ణపరమాత్మ ఎదురుగా కనిపిస్తే మునులు, ఋషులు సహస్రనామాలతో అతణ్ణి ప్రార్థిస్తూ సాష్టాంగనమస్కారం చేసి అతని పాదధూళిని తలపై చల్లుకునేవారు. తాము ధన్యుల మయ్యామని భావించేవారు. కాని కృష్ణుని దురదృష్టం. అతడు ప్రత్యక్షమైనది మంకుబుద్ధిగల జగజెట్టి భీమునిముందు. నన్ను కాపాడావు, ధన్యవాదాలు అని చెప్పాలి కదా? పోనీలే! పదిమణువుల బరువున్న గద తలపై పడుతున్నపుడు చెయ్యి అడ్డు పెట్టావు కదా! నీకేమైనా దెబ్బ తగిలిందా అన్న సౌజన్యమైనా ఉండాలి కదా? అలాంటిది ఏమీ కనబడలేదు.

ఓహ్! వచ్చావా! నీకు పొగరు బాగానే తలకెక్కినట్లుంది? అంటూ కర్కశంగా పల్కాడు భీముడు. "అలా కాదు భీమా" అంటూ సమాధానం చెప్పేదాకా ఆగక, అలా, ఇలా అనకు. వచ్చావు సరే. అదో అటు పడిన గదను తీసుకురా అంటూ ఆజ్ఞాపించి వ్యాయామశాల లోపలికి వెళ్లాడు.

కృష్ణుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. "ఇదేమిటయ్యా భీమా!". 'మరేమిలేదు' అంటూ గదను అందుకున్నాడు. భక్తుని సంకెళ్లల్లో బందీయై తనకు తానే భీమునిచేతిలో పడ్డాడు. భక్తవత్సలుడు గదను తీసుకొని లోపలికి ప్రవేశించాడు. అది చలివేళ. చలి తీవ్రంగా ఉంది. కృష్ణుడు నెమ్మదిగా 'భీమా' అంటూ గదను ఒక మూలపెట్టి, విషయమేంటని అనడిగాడు. "అయ్యా! రేపు సంక్రమణపూజ. నీవేమో ఈరోజే నన్ను రప్పించావు. చలి తీవ్రంగా ఉంది కదా?" "అందుకు నన్నేమి చేయమంటావు?" "నీవు తొందరపెట్టావు. నేను ఉన్నపళంగా వచ్చేసాను. ఉత్తరీయం కూడా లేదు. కంబళి, గొంగళి ఏదైనా ఉంటే ఇవ్వవయ్యా!" భీముడు వేలాడుతున్న తన కౌపీనాన్ని కృష్ణునివైపు విసిరాడు. ఉన్నది ఇంత మాత్రమే. దాన్నే ఉత్తరీయంగా ధరించు అన్నాడు. గ్రహచారం అనుకుంటూ దాన్నే తన భుజంపై వేసుకున్నాడు. 'భీమా! ఇప్పుడేం చేయాలయ్యా, అంటూ సణుగుతూ అడిగాడు. "మరేంలేదు, రాత్రి పడుకోడానికి ఏమైనా ఏర్పాటుచేశావా" అన్నాడు. "ఓహో! నన్ను అంత మూర్ఖడనుకున్నావా?' అన్ని ఏర్పాట్లు చేశాను" అన్నాడు భీముడు. కృష్ణుడు ఎంతగానో సంతోషించాడు. కాని ఆ సంతోషం కాసేపైనా లేకపోయింది.



అదో అటు చూడు. ఎర్రమట్టిపరుపు నీ కోసం సిద్ధం చేశాను. ఆ...! ఈ మట్టిపరుపా! కృష్ణుడు ఆశ్చర్యంగా అడిగాడు. ఎందుకు రాజమందిరంలో హంసతూలికాతల్పం. ఇక్కడ చిన్న మంచం కూడా లేదంటావా? అదంతా రేపటిదినం మా అన్నగారి ఆతిథిగా వెళ్లినప్పుడు. ఈ రాత్రి ఈ మట్టిమంచమ్మీదే పడుకో అంటూ భక్తుడు భగవంతుణ్ణి ఆదేశించాడు.

కృష్ణుడు రామావతారం తలచుకొన్నాడు. తండ్రి మాట మేరకు పదునాల్గేళ్లు అడవుల్లో పర్ణకుటీరాల్లో గడ్డిపరుపుపై గడిచింది. కాని ఈ భీముడు తనను మళ్లీ వనవాసానికి తోస్తు న్నాడు కదా. అప్పుడైతే లక్ష్మణుడు అనే ఆదిశేషుడు మెత్తని పరుపు వేసాడు. అప్పుడు సీత నాకు తోడుగా ఉండింది. ఇప్పుడు రుక్మిణి కూడా లేదు అంటూ నిట్టూర్చాడు.

'పోనీ ఒక తలదిండైనా ఇవ్వవయ్యా' అంటూ కృష్ణుడు బతిమాలాడు. 'మంచి భగవంతుడవయ్యా నీవు? ఈ వ్యాయామ శాలలో ఏమీ ఉండదని తెలిసి అడుగుతున్నావేమి? అయితే ఈ గదను తలదిండుగా పెట్టుకో అన్నాడు భీముడు. ఆ గద, నాకు మెడనొప్పి కలిగించదు కదా! 'సరే ఇటురా. ఇదిగో నా చేయి మడిచి ఉంచాను. మాంసఖండం ఉబ్బుకొని దిండుగా ఉంది అంటూ తన కర్మ అంటూ బాధపడ్డాడు. భీముని చేతిమడత నుంచి కమ్మనివాసన! కృష్ణుడు సద్దుచేయకపడుకున్నాడు.

నిద్రాదేవి బాహుబంధంలో సుఖంగాఉన్న శ్రీకృష్ణుని కృష్ణా! కృష్ణా! అంటూ గర్జిస్తూ నరకాసురంతో పలికినట్టుంది. వెంటనే కన్నులు తెరచి చూసాడు. నరకాసురుడూ లేడు, ఏ అసురుడూలేడు. అదీ భక్తశిరోమణి భీముడు కృష్ణుని నిద్రలేపిన తీరు.

"ఇంకా తెల్లవారలేదు" కదా అన్నాడు కృష్ణుడు.

ఎప్పుడో తెల్లవారింది. లే! అంటూ తన చేతిని కృష్ణుని మెడనుంచి తీసాడు.

భీముడు ఒక పెద్దరాగిపాత్రను పొయ్యిమీద ఉంచి దానిని నీటితో నింపాడు. కృష్ణా! అదిగో వంటచెరకు. పొయ్యి వెలి గించు. కృష్ణుడు సరే అంటూ పొయ్యి వెలిగించాడు. భగ్గుమని మండింది. భీముడు నిలబడి నవ్వుతూన్నాడు.

దేవుడిమహిమ దేవుడుకంటే మిన్నగా భక్తునికి తెలు స్తుంది కదా! నీళ్లు సలసలకాగాయి. ఆ పెద్ద రాగిపాత్రలోని వేడినీటిని సగందాకా పోసుకున్నాడు. సగం నీరు మిగిల్చాడు భీముడు.

'కృష్ణా! రా.. ఇదిగో ఇక్కడ కూర్చో!' అంటూ ఒక రాతిపై కూర్చోబెట్టాడు. "అపోహిష్ఠామ యోభువః" అంటూ రాగిపాత్రలో మిగిలిన నీటిని కృష్ణుని తలపై పోశాడు.

"శుద్ధోదకస్నానం సమర్పయామి" అన్నాడు.

ఖాళీగా ఉన్న రాగిపాత్రను పొయ్యిమీద ఉంచి అందులో బియ్యం, పెసరబేడలు పాత్రలోకి పోశాడు.

కృష్ణుడు చలితో వణుకుతున్నాడు. ఒక చిన్న ఉత్తరీయా న్నిచ్చి తుడుచుకో అన్నాడు. ఒక కొత్త కొపీనాన్ని తీసి కృష్ణుని భుజంపై ఉంచి "వస్త్రం సమర్పయామి" అంటూ ఎర్రమట్టిని కొద్దిగా తీసుకొని ఎర్రమట్టిముద్దను నొసట పెడుతూ "గంధాక్ష తాన్ సమర్పయామి" అన్నాడు.

చేరువలో ఉన్న ఒక చెట్టునుండి పూవును తీసి ఇచ్చాడు. ఇదిగో హారతికి అన్ని వస్తువులు సిద్ధమయ్యాయి. నైవేద్యం కూడా సిద్ధమైంది. ఇటు వైపురా అంటూ తన రెండు చేతులను ఆ రాగిపాత్రలో పెట్టి సిద్ధమైన పొంగలిని తీసుకొని ఉండగా చేసి ఇదిగో నైవేద్యం అంటూ "నైవేద్యం సమర్పయామి" అంటూ ఆ పొంగలి ఉండను తినుమన్నాడు.

ముందు నిల్చున్న భీముడు రామావతారంలోని శబరిలా కనిపించాడు కృష్ణునికి. నవ్వుతూ పొంగలి ఉండను తిన్నాడు. భీముడు సంతృప్తుడై నిల్చున్నాడు.

తిను, త్వరగా తిను అంటూ తొందరపెట్టాడు. తరు వాత 'కృష్ణార్పణ' మంటూ మిగిలిన పొంగలి ఉండలను తాను తినసాగాడు భీముడు.

భీముని బాలభక్తికి మెచ్చి అభయహస్తం చూపుతూ చిరునవ్వు చిందించిన భక్తవత్సలుడైన శ్రీకృష్ణభగవానుడు అందరికి మంగళం కలిగించుగాక. *('తరంగ' సౌజన్యంతో)*

కైంకర్యమే.. తనువు దాల్చితే....

9

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



(జరిగిన కథ - రామానుజులు కాంచీపూర్ణుని మహత్త్వాన్ని గుర్తించి తనను శిష్యునిగా స్వీకరించమని వారిని వేడుకుంటు న్నారు. కాంచీపూర్ణులు కాదు, కూడదు అన్నారు. అందుకు సమాధానంగా శ్రీరామానుజులు తిరుప్పాణా ళ్వార్ కథ చెబుతున్నారు)

తిరుప్పాణ్ తన నుదుటికి తగిలినరాయిని చేతిలోకి తీసుకున్నారు. "నా రంగని పూజించే చేతులకలంకారమైన రాయి. నా నుదుటిని ఆదరంగా హత్తుకున్న రాయి. మునీశ్వరుల హస్తాలింగన సుఖాన్ని నా నుదుటికి అనుగ్రహించినరాయి, మునీశ్వరుని ఈ దాసుని దగ్గరకు తెచ్చిన రాయి. అంటదగిన వానిని అంటదగని వానిని అంటుకొన్నాను ఏమీ అంటని రాయి, నా రంగనాథుడే మునీశ్వరుల చేతిమీదుగా ఈ రూపంలో నాకు దొరికాడు" అని ఆనందభరితులై పారవశ్యంలో మునిగి పోయారు.

ఇదంతా చూచిన లోకసారంగమహాముని అనుచరులు "తిరుప్పాణ్! నీవు ప్రతిరోజూ ఇలా ఈ తీరాన్ని తాకడమెం దుకు? మా మహామునికి ఆగ్రహం, విసుగూ తెప్పించడం ఎందుకు?" అని అడిగారు.

తిరుప్పాణ్ - "నాకేమీ తెలీదు. దేవా! శ్రీరంగనాథా - నా తండ్రీ! నా పై నీకెంతప్రేమ! మునీశ్వరుల పాదముద్రలతో పవిత్రమైన ఈ తీరంలో నాకు చోటిచ్చితివా తండ్రీ! వేద మూర్తులైన లోకసారంగమునీశ్వరుల పాదపద్మాల ముద్రల మీద నాకు సింహాసనం ఏర్పరచావా దేవా? దేవాలయ ప్రాంగణ మంతా పరిభ్రమిస్తూ శ్రీరంగని పాదాలు సేవించే పెద్ద పూజారులవారి పాదాలసన్నిధిలో నాకు స్థానం కల్పించితివా? స్వామీ! నాదే కదా అదృష్టం! నాదేకదా ఆనందం! నీ హస్తాలు ఆశీర్వదించాయి! నన్నంతటా అలముకొన్నాయి. నాలో నీవే దేవా! నేనంతయు నీవే తండ్రీ! రంగా శ్రీరంగా!" అని తమలోతాము తలపోసుకుంటూ మళ్లీ అలౌకికస్థితికి వెళ్లి పోయారు.

లోకసారంగముని స్నానంచేసి, నిత్యకర్మానుష్ఠానాలను ముగించుకొని, తిరుమంజనతీర్థాన్ని తీసికొని, ఛత్రచామరవాద్య ఘోషాదులతో ఆలయానికి వెళ్లారు. తిరుప్పాణ్ ఆళ్వార్ల ముఖంలో తగిలిన దెబ్బ శ్రీరంగనాథుని మనస్సులో తగిలినందు వల్ల, ఆ స్వామికి మనస్సులో చాలా బాధ కల్గింది. దాన్ని గమ నించిన శ్రీరంగనాయకి "మనకు అంతరంగ భక్తుడైన తిరు ప్పాణ్‌ను బయట నిలిచేటట్లు కాకుండా, లోపలకు ఆహ్వానిం చండి" అని సూచించింది. శ్రీరంగనాథుడు దేవేరి మాటల్ని ఆచరణలో పెట్టారు. తన సుందరవదనారవిందాన్ని కోపోద్రిక్తం చేసుకున్నారు.

లోకసారంగముని ఇది గమనించి, తిరుప్పాణ్ వల్ల కావేరి మైలపడిందని, ఆ జలం ఆలయంలోకి తీసుకురావడం వల్ల ఆగ్రహించాడని పొరబడ్డారు. "దేవా! శ్రీరంగేశా! ఏమిటి నాకీ శిక్ష? నా తప్పేమి? ఎందుకీ వ్యథ? ఎందుకీ దుఃఖం? ఏమిటాచూపు? ఎందుకీ కినుక? నిన్ను మైలపరచు తలపు లేదు. పూజ ఆపు ఉద్దేశం లేదు. మైలనీరు తెచ్చుచుంటినన్న తెలివిలేదు. నేనేమి చేయుదును? ఎందుకీ కోపం? ఎందుకు కోప ఘూర్ణితనేత్రుడవై బాధించడం? నిత్యధూపదీప నైవేద్యా లలో నీకు లోపం చేయలేదే? పూలపూజ మానలేదే? మేలు కొలుపు నుండి పవ్వళింపుసేవదాకా నీ పాదాలకడ నిలిచినానే! నా మీద ఎందుకింత కోపం? ఎందుకీ ఎడముఖం, పెడ



ముఖం? నేను ఉత్సవాలు చేయలేదా? తిలకం దిద్దలేదా? ఎందుకీ మౌనం తండ్రీ? నీ చూపులో ప్రేమ, నవ్వులో ఆత్మీయత, పిలుపులో వాత్సల్యం ఏవి తండ్రీ? మునుపటి ముచ్చటలన్నీ ఏమయ్యాయి? ఒక నవ్వు లేదు. ఒక పిలుపు లేదు. ఒక కనుసైగ లేదు. రమ్మనవు. పొమ్మనవు. ఏమిటి మౌనానికర్థం. ఏది ఆ ఆదరణ? ఏది ఆప్యాయత? ఏది ఆ వాత్సల్యం? ఏవి ఆ దయాదాక్షిణ్యాలు? ఏమి తండ్రీ నా గుండె బొగ్గై రాజుకుంటోందీ తనువు కుంపటిలో. దేవా! ఎందుకీ మూగనోము? ఎందుకీ అలుక? ఎవరేమి చేసినారయ్యా స్వామీ! ఇది అని తెలిసి చేసితిమా? ఇటులని అనుకొంటిమా? ప్రతిరోజూ నీ ముఖమెంత ప్రసన్న సుందరం! ప్రత్యుదయం నీ నేత్రాలెంత వికసితపుష్పాలు! నన్నేడ్పించుట నీకిష్టమా? నన్ను బాధించుట లక్ష్యమా? నా దుఃఖమే నీకు వేడుకా? నీ భక్తుణ్ణి, నీ సేవకుణ్ణి, నీ పూజారిని. స్వామి క్రమం తప్పక నీ గళసీమను, కరసీమను పూలమాలికలుంచితిని- అందుకేమి ప్రతిఫలం? తెలియక చేసిన తప్పులు మన్నించండి ప్రభూ!" అని పలుపలు విధాల స్వామిని ప్రార్థించారాయన.

అప్పుడు శ్రీరంగనాథుడు ఆ కోవెల తలుపులను మూయించి, లోక సారంగమునితో అర్చకముఖంగా "నా కుమారుని వంటి తిరుప్పాణ్ పట్ల మీరు ఈ రీతిలో ప్రవర్తించ వచ్చునా?" అని తన కోపాన్ని ప్రకటించి, తన ఆలయకవాటాలను తెఱవకుండా మూసి ఉండేటట్లు చేశాడు.

"మహాభాగవతుని పట్ల అపచారం చేశానే! అయ్యో!" అని చాలా క్లేశపడ్డ లోకసారంగమునికి కలలో ఆ రాత్రి శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై, భాగవతాపచారం నుండి బయటపడే ఉపాయాన్ని గూర్చి తనను అడిగిన ఆ మునితో, "నా ధ్యానైకదీక్షాపర తంత్రుడు, భక్తి పరవశుడు, నా కవి, నా గాయకుడు అయిన తిరుప్పాణ్ పాదమంటిన ఆలయం మైలపడిపోవునని అపవిత్రమైపోవునని నీ అభిప్రాయం. కనుక అతడి పాదాలు తాకకుండా రేపు, ఉదయం సూర్యోదయాత్పూర్వమే అతనిని నా పూజకు నీవు నీ భుజాల మీద మోసి తీసికొనిరమ్ము! ఆ మహాభక్తుని గానమాధుర్యం లోకానికి జీవన మాధుర్యం. చూడు! నిజానికి మాధవునికి, మానవునికి మధ్య మలినం లేదు. లోకసారంగ మునీ! మనుష్యులందరూ ఒక్కటే! తేడాలు భౌతికాలు. ఆత్మికంగా అందరూ ఒక్కటే! వేదం దేవదత్తమే! దేవుడు వేదవేద్యుడే. దేవవేద ద్వయంలో ప్రాణాలు స్థిరమే! వ్యంజనాలే వ్యత్యస్తాలు. వ్యత్యయ మైంది వ్యంజనాలే కదా! వ్యత్యస్తాలు ఎప్పటికైనా వ్యత్యస్తాలే కానీ ప్రాణాలు స్థిరమే! అనుగ్రహాగ్రహాల కతీతుడు తిరుప్పాణ్. భగవంతుని అనుగ్రహముంటే ఏటినీరు అభిషేక జలం. తోట పువ్వు పూజాపుష్పం! అది లేని నాడు నింగిచుక్క నేలపాలు. అమృతబిందువే విషసింధువు! కనుక నేను చెప్పిన పని చేయి" అని ఆజ్ఞాపించారు.

లోకసారంగముని ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచారు. ఈ రోజు దాకా తన భుజాలు కావేరీ తీర్థభాండ సంభరణ సంభావితాలు. మరి ఆ భుజాలకా భగవంతుడు ఈ పని పురమాయించాడు అనుకున్నారు. కలవరంతో నిద్రపట్టక కావేరీ తీరానికి వచ్చారు.

గోపురం మీద, ప్రాకారం పైన వెన్నెల కుప్పబోసినట్లు ఎంతో సుందరంగా ఉంది. కావేటితరగలపై వెన్నెల ఊగిసలాడుతోంది. చూడముచ్చటగా ఉంది. ***(ఇంకా ఉంది)***

యువవాణి

ధర్మసందేహం

– శ్రీ త్రిపురాన వేంకటాచలరావు

సస్సంగతివల్ల నిస్సంగం, నిస్సంగంవల్ల నిర్మోహం, నిర్మోహంవల్ల నిశ్చలత్వం, నిశ్చలత్వంవల్ల జీవన్ముక్తి పొందటానికి రాచబాటయని ఆదిశంకరులవారి వాక్కు.

సస్సంగ మాహాత్మ్యమటువంటిది మరి. మానవ పరమావధియైన జీవన్ముక్తికి సులభశుభమార్గం. పూర్వ కాలంన మహర్షులు, చక్రవర్తులు అఖండ యజ్ఞం చేసేవారు. ప్రజోపయోగానికి, సామ్యసమాజ స్థాపనానికుద్దేశింపబడిన గొప్పసదాచారమది.

మహర్షులైతే వారి వారి శిష్యులైన రాజులను యాచించి, తమవద్దనున్న గో, ధన, ధాన్యాలనంతా ఋషులకు, బ్రాహ్మణులకు, ప్రజలకు, కమండలం, యోగదండన, కృష్ణాజనాలు తప్ప, తమ తపోధనం గూడ పూర్తిగా దానం చేసేవారు. రాజులైతే తమ ఖజానాలు ఖాళీచేసి రాణిగారి మంగళసూత్రం తప్ప తక్కిందంతా దానాలు చేసేవారు. తర్వాత వ్రతయధ్యాపనం చేసి, మరునాటి నుండి మహర్షులు తపోధనాన్ని, రాజులు దండయాత్రల ద్వారా ధనాన్ని ప్రోగుచేసుకునేవారు.


వసిష్ఠ, విశ్వామిత్రులకు వైషమ్యముండేది అందరికీ తెలిసిందే. విశ్వామిత్రమహర్షి అఖండయజ్ఞాన్ని ప్రారంభించాడు. ఆ యజ్ఞానికి వసిష్ఠులవారు వచ్చారు. విశ్వామిత్ర మహర్షి ఆతనికి పదివేలసంవత్సరాలు పంచాగ్నిమధ్యంన నిలిచి చేసిన తపోధనాన్ని ధారపోశాడు.

కొంతకాలం గతించిన తర్వాత వసిష్ఠమహర్షి అఖండయజ్ఞం చేయాలని తలచాడు. ఆ యజ్ఞానికి విశ్వామిత్రమహర్షులు గూడ ఆహ్వానింపబడ్డారు. కాని, వసిష్ఠులవారిని ఇరకాటంలో పెట్టే దురుద్దేశ్యంతో వసిష్ఠుని వ్రత పరిసమాప్తి అవడానికి ముందు, ఆతనివద్ద ఉన్నవన్నీ దానం చేసినట్లు తెలుసుకొని, ఆ సమయానికే వచ్చాడు.

వసిష్ఠబ్రహ్మర్షి విశ్వామిత్రులను సాదరంగా "ఓ రాజర్షిశేఖరా!" దయచేయండని అర్ఘ్యపాద్యాదులనిచ్చి సత్కరించాడు. "రాజర్షి" అన్న సంబోధన విశ్వామిత్రునకు మరింత కోపకారణమయ్యింది. అంత వసిష్ఠమహర్షి విశ్వామిత్రునితో "రాజర్షిసత్తమా!" యాగపరిసమాప్తి సమయంన తమరు వచ్చారు. ఐనా ఏమి? నా సస్సంగ పుణ్యధనంలో ఒక సంవత్సరకాలపుణ్యాన్ని మీకు ధారపోస్తున్నాను తీసుకోండని పలికాడు.

విశ్వామిత్రమహర్షి ఆతని సంబోధనకు రెచ్చిపోయిన కోపంతో "ఆహా! ఏమిది? నేను మీకు పదివేల సంవత్సరాల పంచాగ్నిమధ్యంన తపస్సుయొక్క పుణ్యాన్ని ధారపోసానే! మీరు సంవత్సరకాలపుణ్యాన్ని నాకు ధార పోయటమేమి? ఇది నన్నవమానపరచడానికి మీరు చేసిన పన్నాగమంటూ కోప్పడ్డాడు.

ఆ మాటలకు వసిష్ఠమహర్షి మీరు చెప్పింది సమంజసం కాదు. మీరు దానంగా ఇచ్చారు కదా! దానానికి ప్రతిఫలం కోరవచ్చా? ఐనా నేను మీకిచ్చిన పుణ్యఫలం తక్కువదేమీకాదు. దాని ప్రభావాన్నర్థం చేసుకోక మీరట్లంటున్నారు. మీరు నాకిచ్చిన పదివేలసంవత్సరాల తపోఫలం గొప్పదో? నేను మీకివ్వనున్న సస్సంగత్య సంవ



త్సర పుణ్యఫలం గొప్పదో? నిర్ణయించటానికి కర్మసాక్షియైన సూర్యభగవానుని, ఆదిశేషుని, ప్రాణాధారమైన వాయు దేవుని న్యాయనిర్ణేతలుగా నేనొప్పుకుంటున్నాను. నేను యజ్ఞ దీక్షలో ఉన్నాను కనుక వారు ముగ్గుర్నీ ఒకేవేదిక మీదకు రప్పించినట్లైతే వారే నిర్ణయిస్తారని చెప్పాడు.

విశ్వామిత్రమహర్షి సూర్యునివద్దకెళ్లి హే మార్తాండా! నాకూ వసిష్టమహర్షికి ధర్మసందేహం కలిగింది. మీరు న్యాయనిర్ణేతగా రావాల్సిందిగా కోరాడు.

సూర్యుడు "మహర్షీ!" నేను రావడానికెట్టి అభ్యం తరం లేదు. కాని నేను నడువకున్న కాలగమనమాగి పోతుంది. కాలగమనమాగిపోకుండ ప్రత్యామ్నాయాన్ని తమ రేర్పరిచినట్లైతే రాగలనని చెప్పాడు. విశ్వామిత్రునకేమి చేయాలో తోచక శేషునివద్దకెళ్లి అతని రాకను కోరాడు. ఆదిశేషువు గూడ భూభారాన్ని వహించే మార్గమేర్పరిచినట్లైతే వస్తానని చెప్పాడు. వాయుదేవుడు గూడ జగత్ప్రాణాధారా నికి ప్రత్యామ్నాయమేర్పరిచినట్లైతే నేను గూడ రాగలనన్నాడు.

అంత విశ్వామిత్రుడు వసిష్ఠునివద్దకొచ్చి న్యాయ నిర్ణేతలుగా మీరు కోరిన వారెలా రాగలరు? వారి వారి



పనులకు ప్రత్యామ్నాయం లేకున్న జగత్ప్రళయం కలుగు తుందే! వారు రాలేరన్న ఉద్దేశంతోనే వారిని మీరు కోరారని నిందించాడు. అంత వసిష్ఠులవారు దీక్షలో నున్న మనమిద్దరం కలిసి వారొచ్చే ఏర్పాటు చేద్దామంటూ బయలుదేరారు.

వసిష్ఠ, విశ్వామిత్రులిద్దరు సూర్యభగవానుని తమ ధర్మసందేహం దీర్చ న్యాయనిర్ణేతగా రమ్మని ప్రార్థించారు. సూర్యభగవానుడు "మహర్షులారా! నా గమనానికి ప్రత్యామ్నాయాన్ని కల్పిస్తే నేను మీవెంటే వస్తానన్నాడు. అప్పుడు వసిష్ఠమహర్షి తన కమండలంలోని నీటిని గ్రహించి, నెలదినముల సత్సాంగత్యపుణ్యఫలాన్ని ధారపోస్తు న్నాను. తత్పుణ్య ప్రభావంతో నిజసూర్యుడు వచ్చే వరకు ప్రత్యామ్నాయసూర్యుడుదయించుగాక! అని నీటిని ధార పోసాడు. వెంటనే కృత్రిమసూర్యుడు ప్రకాశిస్తూ సూర్యుని స్థానమలంకరించాడు.

నిజసూర్యభగవానుడు "మహర్షులారా పదండి! ఆదిశేషునివద్దకు వెళ్దామన్నాడు. ముగ్గురు కలసి ఆదిశేషుని దర్శించి అతని భూభారం వహించటానికి ఒక నెలరోజులు సత్సాంగత్య పుణ్యఫలాన్ని వసిష్ఠులవారు ధారపోయగా తత్ప్రభావంతో శేషుడు గూడ భూభారం వహించుట నుండి విముక్తుడై అందరు కలిసి వాయుదేవుని ప్రార్థించి జగ త్ప్రాణాధారానికి మరొకనెల సత్సాంగత్యపుణ్యాన్ని ధారపోసి ముగ్గురనేకం చేశాడు.

పై విధమంతా చూచిన తర్వాత వారిక చెప్పేదే ముంది? విశ్వామిత్రుడు సిగ్గుతో తలదించు కొని వసిష్ఠ బ్రహ్మర్షితో "మహర్షిసత్తమా! మీ గురించీ, సత్సాంగత్య ప్రభావాన్నిగురించీ తెలుసుకోలేక మిమ్మల్ని కించపరచాను. నన్ను క్షమించండని ప్రార్థించి తొమ్మిదిమాసాల సత్సాంగత్య పుణ్యాన్ని గ్రహించి తన ఆశ్రమానికి వెళ్లిపోయాడు.

ముఖ్యంగా గమనించాల్సింది "సత్సంగతి" ఎవరు? ఏది? అన్నది తెలుసుకోవడం కష్టతరం. సత్పురుషులను గుర్తించటం రత్నపరీక్షలాంటిది. అది తెలుసుకొని వారి సాంగత్యంవల్ల పునీతులమవటం తథ్యమని పై కథవల్ల తెలుస్తోంది.

ఉత్తమగుణాలే దైవానికి దగ్గరగా చేరుస్తాయి

2017 సంవత్సరంలో ముఖ్యమైన పండుగలు, పర్వదినాలు

జనవరి 2017

01 ఆంగ్లసంవత్సరాది
06-12 శ్రీకపిలేశ్వరస్వామివారి తెప్పోత్సవాలు
06-12 శ్రీఆండాళ్ నీరాట్టోత్సవం
08 వైకుంఠఏకాదశి
14 మకరసంక్రాంతి
15 కనుమ, శ్రీగోదాదేవి పరిణయోత్సవం
26 గణతంత్రదినోత్సవం
28 శ్రవణం

ఫిబ్రవరి 2017

02 రథసప్తమి
07 భీష్మఏకాదశి
10 శ్రీ రామకృష్ణ తీర్థముక్కోటి
04-10 శ్రీ గోవిందరాజస్వామివారి తెప్పోత్సవాలు
16-24 శ్రీనివాసమంగాపురం,
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
24 మహాశివరాత్రి
17-26 తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

మార్చి 2017

08-12 తిరుమల శ్రీవారి తెప్పోత్సవాలు
13 లక్ష్మీజయంతి
24 శ్రవణం, అన్నమాచార్య వర్ధంతి
24-28 నాగులాపురం, శ్రీ వేదనారాయణస్వామివారి
తెప్పోత్సవాలు, సూర్యపూజ
25 మార్చి నుండి ఏప్రిల్ 02 వరకు
శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
29 శ్రీహేమలంబినామసంవత్సరం ఉగాది
30 మత్స్య జయంతి





2017 సంవత్సరంలో ముఖ్యమైన పండుగలు, పర్వదినాలు

ఏప్రిల్ 2017

05 శ్రీరామనవమి
05-13 ఒంటిమిట్ట, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు
06-07 శ్రీకోదండరామస్వామివారి కల్యాణోత్సవం, పట్టాభిషేకం
08-10 తిరుమల, శ్రీవారి వసంతోత్సవం
14 తమిళ నూతన సంవత్సరాది
12-20 నాగులాపురం, శ్రీవేదనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు
29 పరశురామజయంతి

మే 2017

01 మే డే, రామానుజజయంతి
04-06 తిరుమల శ్రీపద్మావతీశ్రీనివాస పరిణయం
09 నృసింహజయంతి, వేంగమాంబజయంతి
10 శ్రీకూర్మజయంతి
11 అన్నమాచార్యజయంతి
16 తిరుపతి గంగజాతర
18-26 కార్వేటినగరం, శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాలు
21 హనుమజ్జయంతి
31 నుండి జూన్ 8 వరకు తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు

జూన్ 2017

05-09 శ్రీపద్మావతీ అమ్మవారి తెప్పోత్సవాలు
06-14 అప్పలాయిగుంట, ఋషికేష్, నారాయణవనం బ్రహ్మోత్సవాలు
07-09 తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
29 మరీచిమహర్షిజయంతి

2017 సంవత్సరంలో ముఖ్యమైన పండుగలు, పర్వదినాలు

జూలై 2017

04-06 శ్రీ గోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేకం
04-07 తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు
16 తిరుమల శ్రీవారి ఆణివారఆస్థానం
28 గరుడపంచమి

ఆగష్టు 2017

03-05 తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలు
04 శ్రీవరలక్ష్మీవ్రతం
05 శనిత్రయోదశి
07 జంధ్యాలపూర్ణిమ, హయగ్రీవ, విఖనసజయంతులు
15 స్వాతంత్ర్యదినోత్సవం
23 బలరామజయంతి
24 వరాహజయంతి
25 వినాయకచవితి

సెప్టెంబరు 2017

02 వామనజయంతి
05 అనంతపద్మనాభవ్రతం, ఉపాధ్యాయదినోత్సవం
08 ఉండ్రాళ్ళతద్దె
12 కావేరినదిపుష్కరాలు ప్రారంభం
19 మహాలయ అమావాస్య
23 నుండి అక్టోబరు 01 - తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు
27 తిరుమల శ్రీవారి గరుడసేవ
28 దుర్గాష్టమి
29 మహానవమి
30 విజయదశమి





2017 సంవత్సరంలో ముఖ్యమైన పండుగలు, పర్వదినాలు

అక్టోబరు 2017

02 గాంధీజయంతి

07 అట్లతద్దె

18 నరకచతుర్దశి

19 దీపావళి, శ్రీ కేదారగౌరీవ్రతం

23 నాగులచవితి

28 తిరుమల శ్రీవారి పుష్పయాగం

నవంబరు 2017

01 కైశికద్వాదశి

03 కార్తికపూర్ణిమ

08 తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివారి లక్షబిల్వార్చన

15-23 శ్రీ పద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు

16 ధన్వంతరిజయంతి

24 సుబ్బరాయషష్ఠి

30 గీతాజయంతి

డిసెంబరు 2017

01 హనుమత్అవతారం

02 కార్తికదీపోత్సవం

03 దత్తజయంతి

13 స్మార్తఏకాదశి

14 వైష్ణవఏకాదశి

16 ధనుర్మాసం ప్రారంభం

29 వైకుంఠఏకాదశి

30 శ్రీస్వామివారి పుష్కరిణీతీర్థముక్కోటి

గోవుల పరిరక్షణలో.. తిరుమల తిరుపతి దేవస్థానములు

– శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి, 80996 81422



(జనవరి - 15 కనుమపండుగ - మనగుడి - గోపూజసందర్భంగా....)

గోవును భారతదేశంలో హిందువులు గోమాత అని పిలుస్తారు. మనది పాడిపంటల పుణ్యభూమి. పాడి అంటే పాలు అని అర్థం. పాలనిచ్చేది గోవు. పంటలకు సనాతన కాలంనుండీకూడా ఎడ్లనే ఉపయోగిస్తూన్నారు. ఈ విధంగా గో, వృషభాలు మన వేదసంస్కృతిలోనే ప్రముఖస్థానాన్ని అలంకరించాయి. ఆ దేవదేవుడైన శ్రీకృష్ణునికి గోపాలుడని పేరు. కృష్ణ డంటే మనకు గోవుయే గుర్తుకొస్తుంది. ఆ నేపథ్యమేంటో తెలుసుకుందాం.

ఉపనిషత్తులను గోవులయొక్క క్షీరమే భగవద్గీత.

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః
పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్

'ఉపనిషత్తులన్నీ గోవులే. అందులో శ్రీకృష్ణుడు పాలు పితుకువాడు. అర్జునుడు దూడవంటివాడు. మహత్తరమగు గీతామృతమే పాలు. సద్బుద్ధి గలవాడే ఆ పాలను త్రాగుతాడు' అని పై శ్లోకార్థం.

'గోవిందుడు' నామనేపథ్యం

భక్తులందరూ గోవిందనామోచ్చారణలోనే పులకించిపోతూంటారు, కాని గోవిందుడనే నామాన్ని ఎవరు ఎవరికిచ్చారో శ్రీమద్భాగవతమిలా చెప్తోంది.

బృందావనంలో నందమహారాజు ఇంద్రయాగాన్ని చేయాలని తలపెట్టాడు. ఆ యాగాన్ని కాదని ఏడేండ్ల బాలుడు కృష్ణుడు గోవులు, బ్రాహ్మణులు, గోవర్ధన పర్వతం ప్రీతిచెందే యజ్ఞాన్ని ఆరంభించాడు. అదే గోవర్ధన పూజోత్సవం. ఐతే బృందావన వాసులు చేసిన ఈ కార్యానికి ఇంద్రునికి కోపమొచ్చింది. ఆ కోపంతో బృందావనంపై వడగండ్లవానను కురిపించాడు. అపుడు శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్నెత్తి బృందావన వాసుల్ని, లక్షలకొద్దీ గోవులను రక్షించాడు. అందుకు సురభి అనే గోవు దేవతలు, మహర్షుల సమక్షంలో శ్రీకృష్ణునికి క్షీరాభిషేకంచేసి **'గోవిందుడు'** అనే నామాన్ని ఇచ్చింది. ఆ విధంగా గోగణరక్షణంచేసి దేవదేవుడైన శ్రీకృష్ణుడు గోవిందునిగా ప్రసిద్ధి చెందాడు. అప్పటినుండి గోపూజ, గోవర్ధనపూజ జగద్విఖ్యాతం చెందాయి. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు గోవిందుడుగా ఉన్నాడు కాబట్టే కలి యుగంలోకూడా ఆ గోవిందనామాలనే భక్తులచేత ఉచ్చరింప చేయిస్తూ పరవశం చెందుతూంటాడు.

గోమాత ప్రాశస్త్యమేమంటే..

పృథివిపైనున్న సప్తతత్త్వాలకన్న గోవుకే మిన్న యైన స్థానముందని ఆర్యోక్తి. ప్రాచీనభారతీయసంస్కృతీ సంపదలకు ప్రతీక గోమాత! భారతీయులకు అనాదినుంచీ ఆరాధ్యదేవత! ధర్మమాత! పరమపునీత! మానవజాతికి ఆవుకన్నా మిన్నగా ఉపకారం చేయగలిగే జంతువు మరొకటిలేదనే చెప్పొచ్చు. మానవునికి స్వస్థత, దీర్ఘాయువు కలిగించేది గోవుయే! గోవులు అధికంగా పాలివ్వాలనీ ఎప్పుడూ ఎవరిచేతా అవి దొంగలింప బడకూడదనీ, సింహం మొదలైన జంతువులబారిన పడకుండా కాపాడుకోవాలనీ, దుష్టులవాత పడకూడదనీ, అధిక సంతతి పొందాలనీ యజుర్వేద వాక్కు. యజ్ఞయాగాదుల్లో హవనికై దుగ్ధ ఘృతాల నందించే గోవు సకలప్రాణికోటికీ జీవనాధారమైందనీ, గోసేవవలన ఉదాత్తగుణాలు అలవడతాయనీ, ధనసంపదలు వృద్ధిపొందుతాయనీ ప్రశంసింప బడింది.

గోమాత విశిష్టస్థానం

ఆవుకొమ్ములమూలంలో బ్రహ్మ, విష్ణువులుంటారు. అగ్రభాగానతీర్థస్థానాలు, స్థావరజంగమాలు అలరారుతూంటాయి. శిరస్సుకు మధ్యభాగం శివునిగేహం. ఈ చతుష్పాతు అంగాల్లో చతుర్దశభువనాలూ ఇమిడి ఉన్నాయని అధర్వవేదవాక్కు. ప్రపంచంలో అన్నాన్ని ఉత్పన్నం చేసేవి గోవులు అని ఆర్యులమాట. అలా గోవు శీతము, ఉష్ణము అన్న భేదంలేకుండా అన్ని ఋతువుల్లోని ఈతిబాధలనుభరిస్తూ మనకు కల్యాణకారిణియై శోభిల్లు



తూంది. ఈ జగత్తులో గోసంపదతో సమానమైన ధనం లేదని చ్యవన మహర్షి తన 'నహుషం'లో ప్రవచించాడు.

చతుర్వేదాల్లోనేకాక హిందూధర్మశాస్త్రగ్రంథాల్లోనూ, భారత, రామాయణ, భాగవతాది పవిత్రగ్రంథాల్లోనూ గోమహిమ అసమానమైందిగా చెప్పబడింది. వాల్మీకి, వ్యాసుడు, బుద్ధుడు, స్వామి దయానందసరస్వతి, గురునానక్, శంకరాచార్యులు, తులసీదాస్, కబీర్, చైతన్యమహా ప్రభువుమున్నగు మహానుభావులెందరో గోసంపదయొక్క రక్షణావశ్యకతను గూర్చి నొక్కివక్కాణించారు. శ్రీకృష్ణభగవానుడు స్వయంగా గోమాతను పూజించి, సేవించి గోపాలకుడైనాడు.

గోవులే స్వర్గానికి సోపానాలు. స్వర్గంలోకూడా గోవులు పూజింపబడుతాయి. కోరుకున్న వరాలన్నింటినీ ప్రసాదించేశక్తి ఒక్క గోవుకు మాత్రమే ఉంది. గోవును మించిన ఉత్తమమైన వస్తువు మరేదీలేదని పురాణాలఘోష. హిందూమతంలో గోరక్షణ అత్యంత ప్రధానమైంది. సాధుత్వం, ఔదార్యం, త్యాగం, ఉపకారం మూర్తీభవించిన మహాప్రాణి కూడా భారతదేశపు కామధేనువు గోవుయే! వేదాలు దీన్ని చంపకూడదని చెప్పాయి.

భారతదేశంలో గోరక్షణ పూర్తిగా జరిగిననాడే జాతి, ఆత్మబలం, మనోబలం వృద్ధిచెంది, స్వాతంత్ర్యాన్ని సద్వినియోగం చేసుకున్నట్లౌతుంది. గోధూళిస్పర్శవల్ల, గోనివాసంవల్ల, ఆ భూమి పవిత్రమూ, సస్యశ్యామలమూ ఔతుంది. గోవు సత్త్వగుణ స్వరూపిణి. పృథివితో, సూర్యరశ్మితో, పంచభూతాలతో, త్రిగుణాత్మకమైనప్రకృతితో గోవుకుగల సన్నిహితసంబంధం అజరామరమైనది. గోవంశంతో మనదేశానికున్న సంబంధం మానవశరీరానికి మనస్సుతోగల సంబంధంవంటిది.

ఆవు రుద్రులకు మాత. వసువులకు పుత్రిక. అదితి పుత్రులకు సహోదరి. అమృతానికి నిధి. అట్టిగోవును వివేకియైన వ్యక్తి ఎన్నడును హింసించదని ఋగ్వేదసూక్తి. మన పూర్వులు గాయత్రి, గంగ, గీతతో సమానంగా గోవును కూడా అతిపూజ్య భావంతో కొనియాడారు.

గోవధనిషేధం - ప్రభుత్వచట్టం

గోసంరక్షణ కార్యక్రమంలో ముఖ్యాంశంగా గోవధను నిషేధిస్తూ మన ప్రభుత్వం చట్టంచేసింది. ఐతే ఇది ఆచరింపబడటంలేదనే చెప్పొచ్చు. జాతి యావత్తూ గోసంపదాభివృద్ధిని పవిత్రమహోన్నత ఉద్యమంగా భావించి ముందుకు అడుగేయాలి. భారతదేశంలోని కోట్లాదిశిశువుల శారీరక, బౌద్ధిక వికాసం గోక్షీరసంపదమీదనే ఆధారపడి ఉంది. గోసంపదవల్ల లభిస్తున్న పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, గోమూత్రం, గోమయం, ఆవుచర్మం, కొమ్ములనుండి తయారయ్యే పలురకాలైన వస్తువులు మనకు అనేకవిధాలుగా ఉపకరించబడుతున్నాయి.

ప్రాతఃకాలం నిద్రలేవగానే గోముఖం దర్శించి మానవజాతి సమస్తపాపాలను పోగొట్టుకుంటుందన్న నగ్న సత్యాన్ని సకలశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. గోవధ, గోమాంస భక్షణ నేటికీ దేశంలో కొన్నిప్రాంతాల్లో ఉండటం శోచనీయం. దీనిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గోసంపద అభివృద్ధిని గూర్చిన శాస్త్రీయపరిజ్ఞానాన్ని, ప్రతిపల్లెలోనూ కర్షకులకు, కార్మికులకు తెలియచేసేలా ప్రభుత్వం తగిన పథకాలతో శిక్షణాతరగతులు ప్రారంభించినట్లైతే ఎంతో బాగుంటుంది. సేవాసంస్థలుకూడా ఈ దిశలో కృషి చేయాలి. గోశాలలు, పశువైద్యశాలలు అధికసంఖ్యలో నెలకొల్పబడినట్లైతే భారతదేశ ఆర్థికవ్యవస్థ ప్రగతిని సాధిస్తుందని నిస్సందేహంగా చెప్పొచ్చు.

తి.తి.దే. శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాల

తిరుమలతిరుపతిదేవస్థానం శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ శాల అనే పేరుతో ఒక సంస్థను స్థాపించింది. తద్వారా తి.తి.దేవ



పనిచేయటం శరీరానికీ, ఆత్మకూ మంచిది



గోశాలచరిత్ర

సుమారు వెయ్యిసంవత్సరాలక్రితమే గోశాల పాలఉత్పత్తికి సంబంధించిన వివరాలు, శ్రీ వేంకటేశ్వర స్వామి కార్యక్రమాలకు సంబంధించిన రికార్డుల్లో పొందుపరచబడియున్నాయి. ఆ శాసనాల్లో చోళుల పరిపాలనాకాలంలో ఒకటవ కులోత్తుంగచోళుడు (1070-1122వసం॥) వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కైంకర్యాలకుగాను వినియోగించేట్లు తెలుపబడియున్నది. ఆ కోవలోనే శ్రీ వేంకటేశ్వరపాల ఉత్పత్తికేంద్రం అనే పేరుతో గోవిందరాజస్వామిఆలయం దక్షిణమాడవీథిలో దక్షిణపశ్చిమపుమూలలో ఒక గోశాల ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1933వసం॥లో "పాలరాజుతోట" (పి.ఆర్.ఉద్యానవనము) - ప్రస్తుతమున్న శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, కపిలతీర్థంమార్గం, తిరుపతి వద్ద పెట్టబడింది. అదే మరలా ప్రస్తుతం మహతి సభామందిరం ఉన్నచోట ఏర్పాటు చేయబడింది. ఆ గోశాలకే 1956వ సంవత్సరం నవంబరునెల 13వతేదీన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయికశాఖ మంత్రివర్యులు శ్రీ పి.తిమ్మారెడ్డివారిచే తిరుపతి - చంద్రగిరి మార్గంలో, రైల్వేక్రాసింగ్‌దగ్గర దాదాపు 400 ఎకరాల్లో ప్రారంభోత్సవం జరిగింది. దానినే ప్రస్తుతానికి వందఎకరాలకు తగ్గించారు. అలా 1955వసం॥వరకు ఆవులు గోశాలకు చేరుకున్నాయి. 1956వ సం॥న అదే శ్రీ వేంకటేశ్వర పాలఉత్పత్తి కేంద్రమనేపేరుతో మార్చబడి క్రమేణా 'శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాల' అనే పేరుతో ఆవులను రక్షించడమే ముఖ్యకర్తవ్యంగా సంస్థ నెలకొల్పబడింది.

స్థానానికి సంబంధించిన ఆలయాలు, సంస్థలు, భోజనశాలలు మొదలైనవాటికి స్వచ్ఛతకల్గిన, శుద్ధమైన ఆవుపాలను మరియు తిరుమల స్వామివారి ఆలయానికి వెన్న, నెయ్యిలను సరఫరా చేయబడుతాయి. వీటితోపాటు 'గోదానం'లో భక్తులిచ్చిన ఏనుగులు, గుర్రాలు, దమరం వృషభాలను కూడా క్రమానుగతంగా వస్తోన్న తీర్థపర్వాలు మొదలైన సందర్భాల్లోనూ మరియు ఆలయ ఉత్సవమూర్తుల ముందు ఊరేగించబడుతాయి. అవేకాకుండా తిరుపతిలోనున్న శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాల అధీనంలోనున్న జింకలపార్కును తిరుమలకొండలపైనున్న మొదటి కనుమదారి మార్గంలోనున్న ఏడోమైలురాయివద్ద ఏర్పాటుచేశారు. గోశాల విజ్ఞానశాస్త్రసంబంధమైన నిర్వహణాసామర్థ్యంతో పశువులపాక (ఆహారము, వాటిసంతతిని పెంచటం, వాటి ఆరోగ్యపరిరక్షణ)ను ఏర్పాటుచేయడం, పాలఉత్పత్తులు పెంచడం మరియు ఆలయాలకు సంబంధించిన సారెలను తీసుకుపోవటానికిగాను పశువులను ఏర్పాటుచేయటం మొదలైనవి గావిస్తుంది.

గోవుల సామర్థ్యం

శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలనందు 12రకాల జాతులకు సంబంధించిన గోవులన్నీ కలిపి సుమారు 2,500 దాకా ఉన్నాయి. పలమనేరులో 400 ఎకరాల్లో ప్రత్యేక గోసంరక్షణశాలను నెలకొల్పాలని తి.తి.దేవస్థానం నిర్ణయించింది. ఇందుకు శ్రీవారిసేవకులకు గోసేవకై పిలుపు నిచ్చింది.

సంప్రదాయిక మరియు సాంస్కృతికకార్యక్రమాలు

శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలనందు తిరుమల తిరుపతిదేవస్థానం ఎన్నో సంప్రదాయిక సాంస్కృతికకార్యక్రమాలు ఏర్పాటుచేస్తుంది. అందులో ముఖ్యంగా -

1) గోసంరక్షణ

గోసంరక్షణ లేక గోవులను కాపాడ్డమే ముఖ్యమైన కర్తవ్యంగా నిర్వహించడం. చాలామంది రైతులు వారివారి









ఆవులను, ఎద్దులను వర్ధన/గోదానంపథకంమీద ఇస్తున్నారు. అలా ఇవ్వబడిన ఆ పశువులసంరక్షణకోసం వాటికి పాకశాలలు, బల వర్ధకమైన ఆహారాన్ని వాటి మరణానంతరం వరకు అందించేలా ఏర్పాట్లు చేయడం.

2) గోదానం

ఈ పథకంక్రింద భక్తులు మంచిపాలనిచ్చే శ్రేష్ఠమైన ఆవులను దానంచేయడం. భక్తులు విరాళాల రూపేణా ధనమిచ్చినట్లైతే దాంతో ఆవుల పోషణానిర్వహణను కొన సాగించడానికి తగిన సహాయసహ కారాలందించడం.

తి.తి.దే.గోసంరక్షణశాల ఉద్దేశాలు

తి.తి.దేవస్థానం ఆలయాలకు, వైదికకార్యాలకు, అభిషేకాలకు, ప్రసాదాల తయారీలో వినియోగించడానికి పరిశుద్ధమైన, స్వచ్ఛమైన ఆవుపాలను ఉత్పత్తిచేయడంలాంటివి గావించడం. భక్తులచేత గోసేవకు అంగీకరింప చేసి, గోసంరక్షణలేక ఆవులను కాపాడ్డానికిగాను వారివంతు సహాయం చేసేలా ప్రోత్సహించడం.

3) గోపూజ

శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలనందు గోపూజకై తమవంతు సహాయాన్ని అందించడం.

4) గోకులాష్టమిఉత్సవం

గోకులాష్టమిపండుగరోజున ఇక్కడ శ్రీకృష్ణజన్మాష్టమి నాడు, శ్రీవేణుగోపాలస్వామిమూర్తిముందు వేడుకలు నిర్వహిస్తారు.

ఆ రోజున గోవులను అలంకరించి భక్తుల సందర్శనార్థ ముంచుతారు. ఆవుపాలనే స్వామివారికి నైవేద్యంగా పెడతారు.

వైకుంఠపాళి

:: 14 – సమాధానాలు ::

1 పు		2 ప	లు	3 కు	టె	4 ల	నా	5 గ
ట్ట		ద్మం		రు		గ్నం		యు
6 పు	లి		7 సు	క్షే	త్రం		8 కా	డు
ట్టు		9 జ		త్రం		10 గ్రా		
11 వు	ర్ఘు	న	పు		12 ణి	మ	రు	13 తి
		ని		14 అ		ణి		లా
15 ప	జ్జ		16 అ	ప	ర్ణ		17 ప	పా
త్ర		18 సౌ		వా		19 కో		ప
20 ము	దు	రు	చ	దు	వు	లు		ము

ఆ రోజున వేలాదిమంది భక్తులు, తి.తి.దే. ఉద్యోగులు, అధికారు లందరూకూడా ఆ కార్యక్రమానికి హాజరై ఉత్సవాన్ని దిగ్విజయంగా జయప్రదం గావిస్తారు.

శ్రీనివాసక్షీరదానం

శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికై వచ్చే భక్తులకుగాను తిరుమల లోనున్న రెండవ వైకుంఠ నియత శ్రేణీసముదాయం వద్ద 4 గం౹౹ల నుండి 6గం౹౹లకొకసారి పాలను వితరణచేసేట్లుగా దాతలు ముందుకు రావాలనే ఉద్దేశంతో 'శ్రీనివాసక్షీరదానం' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకుగాను కనీసం రూ. 1,000/- విరాళం చెల్లించి, భగవంతునికృపకు పాత్రులౌదామంటూ పిలుపునిచ్చింది.

శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ ధర్మనిధిసంస్థ

ఈ ధర్మనిధిసంస్థ 2002వసం౹౹ సెప్టెంబరునెల 22వ తేదీన ప్రారంభించబడింది. అది ధర్మనిధిసంస్థగా దృశ్యమాన నమోదుసంఖ్య: 8/2002 ప్రకారంగా నమోదైంది.

ఆ క్రమంలో 'మనగుడి' కార్యక్రమంలో భాగంగా గోసేవే పరమార్థంగా గోపూజా మహోత్సవ వేడుకలను తిరుమల తిరుపతి దేవస్థానం రాష్ట్రమంతటా 2017వసం౹౹ జనవరి 15వ తేదీన కనుమపండుగనాడు అత్యంత వైభవంగా జరిపేలా నిర్ణయించి అందులకై నిధులను ఆయాచోట్లకు పంపిణీ కూడా చేసింది.

కాబట్టి సకలశుభాలను కలిగించే గోసేవలో ప్రతి ఒక్కరూ తమ శక్త్యానుసారం పాల్గొని ధన్యుల మౌదాం.

గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తా స్సుఖినో భవంతు



(జనవరి-15
శ్రీస్వామి
పార్వేటఉత్సవం
సందర్భంగా..)

స్వామివెడలె పారువేటకు..!



- శ్రీ పండిత వేదాన్తం జగన్నాథాచార్యులు

శ్రీమద్భాగవతంలో గోపికలు తమ ధనుర్మాసవ్రతావసానసమయంలో శ్రీకృష్ణభగవానుడికి వనభోజనం ఏర్పాటు చేశారు. ఆ విందుకు విచ్చేసిన శ్రీకృష్ణపరమాత్మ కంసుడు పంపిన రాక్షసశక్తిబారినుండి గోపికలను కాపాడాడు. ఈ మహోపకారాన్ని స్మరించి గోపికలంతా శ్రీకృష్ణుని ఊరేగింపుగా వ్రేపల్లెకు తీసుకొచ్చారు. ఆ సందర్భమే కనుమపండుగనాడు పార్వేటఉత్సవంగా ప్రసిద్ధి చెందింది.

తిరుమలలో పార్వేటఉత్సవతీరు...

తిరుమలలోనున్న స్వామివారికి పార్వేటఉత్సవం కనుమపండుగనాడు జరుగుతుంది. ఆరోజున స్వామివారికి ప్రాతఃకాల మధ్యాహ్నారాధన పూర్తైనతర్వాత శ్రీమలయప్ప స్వామి వారు వెండితిరుచ్చిలో వేంచేస్తారు. శ్రీకృష్ణస్వామివారు మరొక తిరుచ్చిలో వేంచేస్తారు. అలాగే పార్వేటమండపానికి వెళతారు. ఆ మండపమందు పుణ్యాహం జరిగిన తర్వాత మంచెలో వేంచేస్తారు. శ్రీస్వామివారికి ఆరాధనం, నివేదనం, హారతులు అయిన తర్వాత ఉభయదార్లకు, తాళ్లపాకవారికి, మఠంవారికి మర్యాదలు జరిగి స్థానబహుమానపూర్వకంగా గోష్ఠికి వినియోగం జరుగుతుంది.



తర్వాత శ్రీమలయప్ప స్వామివారు, శ్రీకృష్ణస్వామివారు మండపంనుంచి ప్రాంగణానికొస్తారు. శ్రీకృష్ణస్వామివారిని మాత్రం సన్నిధిగొల్లపూజవద్దకు వేంచేపు చేసి పాలు, వెన్న ఆరగింపై, హారతైన పిమ్మట శ్రీమలయప్పస్వామివారి సన్నిధికి వెళతారు. తర్వాత ఆ గొల్ల సమర్పించిన పాలు, వెన్న శ్రీమలయప్పస్వామి నివేదన హారతి అయి గొల్లకు బహుమానం జరుగుతుంది. తర్వాత శ్రీమలయప్పస్వామివారు ముందుకు కొంత దూరం పరుగెత్తి వారి తరపున అర్చకులు బాణం వేసిన తర్వాత వెనుకకు వస్తారు. ఆ విధంగా మూడుసార్లు జరుగుతుంది. తర్వాత శ్రీవారు మహద్వారానికి వేంచేస్తారు. అచట హాథీరాంజీ మఠం వారికి బెత్తము ఇచ్చి తిరువీథులఉత్సవంలో వేంచేస్తారు. ఈ సమయంలో శ్రీకృష్ణస్వామివారు సన్నిధికి వేంచేస్తారు. శ్రీమలయప్పస్వామివారు ఉత్సవం పూర్తై మహద్వారానికి వచ్చి హాథీరాంజీవారి బెత్తమును తీసుకొని సన్నిధిలోనికి వేంచేస్తారు.

ఇదీ స్వామివారికి జరిగే పారువేట ఉత్సవవిశేషం.



బాలప్రబోధం

కార్యసాధనోపాయం

- శ్రీ అవసరాల లక్ష్మీపతిరావు

భారతంలో సూమారు 220 కథలున్నాయి. పిల్లలకు సూటిగా ధర్మం, న్యాయం, నీతి బుర్రలోనికి ఎక్కించ డానికి వ్యాసభగవానుడు చిన్న చిన్న కథల రూపంలో అందిం చాడు. భారతం పంచమవేదం. భారతంలో లేనివి ప్రపంచంలో లేవు. భారతంలో ఉన్నవే ప్రపంచమంతటా ఉన్నాయి. దేశకాల పరిస్థితులనుబట్టి రాజు శత్రువులతో కూడా సంధి చేసుకోవా లంటూ, భీష్ముడు అంపశయ్య మీద ఉన్న 58రోజులూ కూడా ధర్మాన్ని గురించే పాండవులకు బోధించాడు. ఆ క్రమంలోనే ఈ కథ చెప్పాడు.

ఒక మహారణ్యంలో పెద్దచెట్టుంది. ఆ చెట్టు కలుగులో 'పలితం' అనే ఎలుక(మూషికం) నివసిస్తోంది. ఆ చెట్టు మీద 'లోమశం' అనే పిల్లి (మార్జాలం) నివసి స్తోంది. వ్యాధుడు ప్రతి రోజులాగా ఆ రోజు కూడా వలవేసి మాటున్నాడు. పిల్లి ఆ వలలో చిక్కుకుంది. పిల్లి వలలో ఉండడం చూచిన ఎలుక నిర్భయంగా పచార్లు చేయడం ప్రారంభించింది. ఇంతలో ఎలుకకు 'హరిణం' అనే ముంగిస, 'చంద్రకం' అనే గుడ్లగూబ కనబడ్డాయి. ఒక్కసారిగా ప్రాణం గతుక్కుమంది. ఈ శత్రువులనుండి ఎలా తప్పించుకోవాలా అని ఒక ఉపాయం ఆలోచించింది. ఆపదలోనున్నప్పుడు శత్రువును కూడా మిత్రుడుగా చేసుకోవాలి. ఈ పిల్లి కూడా ఆపదలో ఉంది. నేను దీనిపాశాలు త్రెంపి సహాయం చేసి, మైత్రి చేసుకుంటే ఈ ఆపదనుండి గట్టెక్కగల్గుతాను అంటూ దాంతో మాటా, మంతీ కలిపింది.

మార్జాలమా! ఏమీ భయపడకు. నీ వలత్రాళ్లు కొరికి నీకు సహాయం చేసి బయటకు రప్పిస్తాను. ఆ గుడ్లగూబ, ముంగిస నాకోసం ఎదురుచూస్తున్నాయి. మనమిద్దరం మిత్రులమై ఆపదలను తొలగించుకోవచ్చు అన్నది. ఆ మాటలకు పిల్లి ఇతరులచేత విశ్వసించబడని వాడు, ఇతరులను విశ్వసించనివాడు ఎప్పుడూ మనస్సులో బాధపడుతూనే ఉంటారు. మనఇద్దరిమధ్య స్నేహం వర్ధిల్లాలంటే మనకి ఒకరిమీద ఒకరికి నమ్మకం, విశ్వాసం ఉండాలి అన్నది.

ఆ మాటలపై పూర్తివిశ్వాసంతో ఎలుక పిల్లి ఒడిలో కూర్చున్నది. ముంగిస, గుడ్లగూబ అది చూచి నిరాశచెంది ఎవరి నివాసాలకు వారు వెళ్ళి పోయారు.

అవి వెళ్లిన తర్వాత ఎలుక వలత్రాళ్లు నెమ్మదిగా కొరకడం ప్రారంభించింది.



మిత్రమా! ఎందుకు పాశాలు కొరకడంలో ఆలస్యం చేస్తున్నావు అని లోమశం ‘పలితాన్ని’ అడిగింది.

ఈ లోకంలో ఎవరూ ఎవరికీ మిత్రుడూ కాదు. శత్రువూ కాదు. ఈ మిత్రత్వమూ, శత్రుత్వమూ అవసరాన్ని బట్టి మాత్రమే ఏర్పడతాయి. వ్యాధుడు దగ్గరకు రాగానే నేను వల తాళ్లు పూర్తిగా కొరుకుతాను. అప్పుడు నేను కలుగులోకి, నీవు చెట్టుమీదకు వెళ్లవచ్చు. ముందుగా కొరికితే నీవు నాకు హాని తలపెడతావేమో అన్నది.

ఇంతలో తెల్లవారింది. వ్యాధుడు కుక్కలను వెంట బెట్టుకుని వస్తున్నాడు. అతణ్ణి చూడగానే ఎలుక వల త్రాళ్లు పూర్తిగా కొరికేసింది. వెంటనే ఎలుక కలుగులోనికి, పిల్లి చెట్టుమీదికి వెళ్ళిపోయాయి.

చెట్టుమీదికి ఎక్కిన మార్జాలం పలితంతో ఇలా అంది. ప్రాణభిక్ష పెట్టిన నిన్ను ఎవరైనా పూజించకుండా ఉంటారా? మనమిద్దరమూ పరస్పరం ఉపకారం చేసు కుందాం. నువ్వు నాకు అమాత్యుడుగా ఉంటూ తండ్రిలా శాసించు అంది.

ఆ మాటవిని మూషికం నువ్వు చెప్పింది బాగానే ఉంది. నేను చెప్పేది కూడా విను. మిత్రులెవరో, శత్రువు లెవరో తెలుసుకోవడం చాలా కష్టమైన విషయం. స్థిరమైన మైత్రిగాని, శత్రుత్వంగాని ఎవరికీ ఉండదు. మిత్రుడే కొంతకాలానికి శత్రువౌతాడు. శత్రువే మిత్రుడౌతాడు. స్వార్థమనేది చాలా బలవత్తరమైనది. మానవుడు ఎప్పుడూ స్వప్రయోజనాన్నే కోరుకుంటాడు. భ్రాతలమధ్య, భార్యా భర్తలమధ్య ఉండే సఖ్యం కూడా కలుషితమే అని అన్నది.

ఆ మాటలకు మార్జాలం చెట్టుకొమ్మ విడిచి దూరంగా ఎటో వెళ్ళిపోయింది. పలితం కూడా మరో కలుగును వెతుక్కుంటూ వెళ్ళిపోయింది.

కాబట్టి యుధిష్ఠిరా! మూషికమార్జాలాలు బద్ధశత్రువులు. తమ అవసరానికి సంధి చేసుకుని ప్రాణాలు రక్షించుకున్న విధంగా చాలామంది శత్రువులు ఒకేసమయంలో ఆక్రమించడానికి వచ్చినప్పుడు దేశకాలపరిస్థితులనుబట్టి రాజు శత్రువులతో కూడా మిత్రత్వం అవలంబించి లేదా మిత్రత్వం నటించి కార్యం సాధించుకోవాలి అని చెప్పాడు.

గ్రంథసమీక్ష

చతుర్వేదాంతర్గత ఉపనిషత్ ఉద్యానవనము

(ప్రథమ-ద్వితీయభాగములు)

(గ్రంథకర్త: శ్రీయేలేశ్వరపు హనుమరామకృష్ణ;
ప్రథమసంపుటం-638 పుటలు; ఏ4 ఆకృతి; వెల-రూ.500/-;
ద్వితీయసంపుటం-666 పుటలు; ఏ4 ఆకృతి; వెల-రూ.500/-;
ప్రాప్తిస్థానం- శ్రీమతి యేలేశ్వరపు కనకదుర్గ, ఇ.నెం.2/8,
శివాలయంవీథి, కూచిపూడి-521136. కృష్ణాజిల్లా, ఆం.ప్ర.
చరవాణి సంఖ్య - 92479 25278.

ప్రపంచవాఙ్మయంలో అత్యంత ప్రాచీనమైనవి వేదాలు. కర్మకాండ, జ్ఞానకాండ అని వేదాలను రెండు విధాలుగా పరిగణిస్తారు. అందులో జ్ఞానకాండకు సంబంధించినవే ఉపనిషత్తులు. చతుర్వేదాలకు సంబంధించి నూటఎనిమిది ఉపనిషత్తులు సుప్రసిద్ధంగా ప్రచారంలో ఉన్నాయి. బ్రహ్మవిజ్ఞానాన్ని బోధించే ఈ ఉపనిషత్తులు తత్త్వజ్ఞులైనవారిచేత పరాకాష్ఠకు చెందిన జ్ఞానగ్రంథాలుగా ప్రశంసింపబడి ఉన్నాయి.

ఆదిశంకరాచార్యులు మున్నగు పెక్కుమంది ఆచార్యులు ముఖ్యమైన కొన్ని ఉపనిషత్తులకు భాష్యాలు వ్రాసి ఉన్నారు. ఉపనిషద్వాక్యాలను ఆధారంగా చేసుకొని వారు తమ తమ మతాలను ప్రతిష్ఠాపించారు. ఆర్షవిజ్ఞానంలో మిక్కిలి ఆదరణీయమైన గ్రంథాలుగా ఉపనిషత్తులు ప్రసిద్ధి పొందాయి. ‘చతుర్వేదాంతర్గత ఉపనిషదుద్యానవనము’ అను ఈ మహోత్కృష్టగ్రంథాన్ని రూపొందించిన వారు శ్రీ వై. హెచ్.రామకృష్ణ. వీరు ఇంతకుముందు రచించిన “శ్రీ వసిష్ఠరామసంవాదము” యోగవాసిష్ఠానువాదరూపమైన వచన గ్రంథంగా వెలువడింది. ప్రస్తుతం అది శ్రీరామకృష్ణమఠం వారి ప్రచురణల్లో ఒకటిగా ప్రచారంలో ఉన్నది. ‘శ్రీకృష్ణోద్ధవసంవాదం’ మున్నగు మరికొన్ని ఆధ్యాత్మికగ్రంథాలను కూడా వీరు రచించారు.

‘ఉపనిషదుద్యానవనము’ అను ఈ గ్రంథాన్ని 108 ఉపనిషత్తుల తాత్పర్యంతోనూ, విమర్శనాత్మక అధ్యయనంతోను కలిపి నాలుగుబృహత్సంపుటాలుగా వీరు ప్రచురించదలచారు. అందులో ప్రస్తుతానికి మొదటి రెండు సంపుటాలు వెలువడ్డాయి. తర్వాతి సంపుటాలు త్వరలోనే వెలువడనున్నాయి. మొదటి సంపుటంలో ఋగ్వేదానికి చెందిన 10 ఉపనిషత్తులు, శుక్లయజుర్వేదంలోని 18 ఉపనిషత్తులు; రెండవసంపుటంలో కృష్ణయజుర్వేదానికి చెందిన 22 ఉపనిషత్తులు ప్రకటించడమైనది. ఇందులో మూల గ్రంథము, దానికి తాత్పర్యం మరియు అధ్యయనపూర్వక వివరణం సమకూర్చబడ్డాయి. అతివిస్తృతంగా సాగిన ఈ రచన రామకృష్ణ గారి ధర్మనిష్ఠకు, జ్ఞానదీక్షకు, అద్భుతమైన ధార్మికసాహిత్య సేవకు చక్కని నిదర్శనం.

ఆధునికకాలంలో ఇట్టి బృహత్సంపుటాలను అధ్యయనం చేసేవారు అరుదైపోయారు. ఐనా ప్రాచీనమైన ఆత్మవిజ్ఞానవ్యాప్తికీ, దాని పరిరక్షణకూ ఇట్టి మహాగ్రంథాలు తప్పక అవసరమై ఉన్నవి. సంస్కృత గ్రంథాలు సరియైన వివరణ లేకపోతే పఠించేవారుండరు. అందువల్ల శ్రీరామకృష్ణ దీక్షబూని ఇలా ఉపనిషత్తులను సవ్యాఖ్యానంగా రూపొందించి ప్రకటించటం అభినందనీయం! గ్రంథాలయాలు, విశ్వవిద్యాలయాలు, ఇతరవిద్యాసంస్థలు, జిజ్ఞాసగల పాఠకులు ఈ సంపుటాలను ఆదరంతో చదివి ఆర్షవిజ్ఞాన సంపన్నులు కాగలరని ఆశిస్తున్నాను.

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య

శ్రీరామానుజుల యజ్ఞోపవీతమే శ్రీకూరేశులు

- డా॥ కె.రాజగోపాలన్

విశిష్టాద్వైత మత ప్రవర్తకులై ఆసేతుహిమాచలం ఎంతోమంది శిష్యబృందమున్న భగవత్ రామానుజాచార్యుల ఆంతరంగిక శిష్యుల్లో ప్రథములు శ్రీకూరేశమిశ్రులు. రామావతారంలో పితృభక్తిని లోకానికి తెల్పిన శ్రీమన్నారాయణుడు గురుభక్తిని లోకమంతటా చాటేందుకు తన అంశగ శ్రీకూరేశులను అవతరింపజేసారని ప్రసిద్ధి. వీరికి తమిళభాషలో కూరత్తాళ్వాన్ అని, సంస్కృతంలో శ్రీవత్సాంకమిశ్రులని పేర్లున్నాయి.

విద్యాభ్యాసాదులు

శ్రీ కాంచీపురానికి సమీపంలో 'కూర' అనే గ్రామ ముంది. కూరఅగ్రహారంలో క్రీ.శ.1008వ సంవత్సరంన 'పుష్య' మాసంలో 'హస్తా' నక్షత్రమందు శ్రీ అనంత భట్టార్యునకు కుమారులుగ కూరేశులు జన్మించారు. వీరు బాల్యంనుండే విద్యయందు బృహస్పతిగా వెలుగొందారు. సకాలంలో ఉపనయన పంచసంస్కారాదులను కావించుకున్నారు. యుక్తవయసుకు వచ్చేసరికి వేద వేదాన్తాది శాస్త్రాదులందు అసమానప్రతిభను కలిగి మహావిద్వాంసులుగ పేరు పొందారు. ఇంతటి మహాప్రతిభాశాలియైన వీరు కూర గ్రామాధిపతిగా వెలిగారు. అందుకే 'కూరేశు'లనే సార్థకనామ ధేయులయ్యారు.

వివాహాదివిశేషాలు

కూరగ్రామ పరిపాలనలో భాగంగా కూరేశులు ఒకనాటి రాత్రి ఏకాంతంగా నగరంలో సంచరిస్తూన్నారు. ఆ సమయంలో ఒక ఇంట్లో బ్రాహ్మణదంపతుల కన్నీటి గాథను రహస్యంగా విన్నారు. ఆ ఇంటి యజమాని కుమార్తెను ఎవరైనా వివాహమాడినట్లైతే ఆ కన్యకు జాతకరీత్యా ఉన్న దోషంవల్ల వివాహమాడినవాడు మరణిస్తాడట. కాబట్టి తమ కూతురికి వివాహం కాదేమోనంటూ బాధపడ్తూ చనిపోవాలనుకున్నారు. ఈ విషయం తెలుసుకొని కూరేశులు తరువాతి రోజువారిని రాజసభకు పిలిపించి ఆ కన్యను తాను వివాహమాడుతానన్నారు. వారు రాజుకు మరణం సంభవిస్తుందేమోయని సందేహిస్తూండగా అప్పుడు కూరేశులు కేవలం 'ధర్మానుష్ఠానానికి తప్ప సంతానంకోసం ఈ వివాహానికి సమ్మతించటం లేదు' అని చెప్పి ఆ కన్యను వివాహం చేసికొన్నాడు. ఆమె పేరు ఆండాళ్. ఆ సాధ్వీమణి భర్త నియమాలకు భంగం కలుగకుండ సహధర్మచారిణియై వారికి సపర్యలు చేసేది.

మహావైరాగ్యకారణం

అత్యంత ఐశ్వర్యసంపన్నులైన వీరు ప్రతినిత్యం సూర్యోదయంనుండి రాత్రి రెండవజామువరకు అనేకమంది బీదలకు, సాధువులకు అన్నదానం చేసేవారు. ప్రతిదినం కంచిలో వరదరాజస్వామికి ఏకాంతసేవ ఐన తర్వాత వీరియొక్క భవనం తలుపులు మూసివేయాలన్నది ఒక ఆచారంగా ఉండేది. ఒకనాడు వరదరాజస్వామికి ఏకాంతసేవ ఆలస్యంకాగా కూరేశుల భవనద్వార పాలకులు ఆ విషయం తెలీక ద్వారపుతలుపులు మూసేశారు. ఆ సమయంలో ఆ తలుపులకున్న చిరుగంటల శబ్దం కంచిలో నున్న స్వామివారికి అమ్మవారికి చెవినబడ్డాయి. దానిని విన్న స్వామి తిరుక్కచ్చినంబిని చూసి చాలా ఆశ్చర్యంగ ఉందే! తిరువారాధనం కాకుండానే తలుపులు మూసేశారు. కారణమేమై ఉంటుందన్నాడు. ఆ ధ్వని ఇక్కడిది కాదు. చాలాదూరంలోనున్న కూరేశుల భవన ఐశ్వర్యాతిశయధ్వని అదియని తిరుక్కచ్చినంబి చెప్పాడు.

అ విధంగా తిరుక్కచ్చినంబికిని, వరదరాజస్వామికిని జరిగిన సంభాషణాన్ని అర్చకులమూలంగ విన్నారు కూరేశులు. వైరాగ్యంతో 'భగవంతుని తన ఐశ్వర్యంతో భ్రమింపజేసినందుకు' చాలా బాధపడ్డారు. తన సకల ఐశ్వర్యాన్ని బీదలకు దానంచేసి, రామానుజుల వద్దకు బయలుదేరారు. అడవిమార్గంలో ప్రయాణిస్తూండగా వారి భార్య 'స్వామీ! నాకు చాలా భయంగ ఉందన్నది. అందుకు కూరే శులు నీ ఒడిలో బరువుంటేనే కదా! దారిలో భయముండేది. కాబట్టి నీవద్దేమైనా ఉందా?' అని అడిగారు.

'స్వామీ! దారిలో మీకు దాహమేస్తే మంచినీళ్ళకోసం ఒక చిన్న బంగారుపాత్రను మాత్రం తెచ్చాను' అన్నది. దాన్నందుకుని కూరేశులు బీదవారెక్కడైనా బంగారుపాత్రతో దాహం తీర్చుకుంటారా? అంటూ ఆ పాత్రను అడవిలో దూరంగా విసిరేసి శ్రీరంగానికి బయలుదేరారు.

శిష్యరికం

అలా శ్రీరంగానికి వచ్చిన కూరేశులు రామానుజులను గురువుగా భావించి వారి పాదాలను ఆశ్రయించారు. రామానుజులు కూడా వీరి గొప్పతనం విని వీరిని అంతరంగశిష్యులుగ చేర్చుకున్నారు. వీరికి సకల వేదవేదాంతాల్లోని రహస్యాల్ని ఉపదేశించారు.

త్రిదండ యజ్ఞోపవీతాలు

రామానుజులు గోష్ఠీపూర్ణులవారివద్ద అష్టాక్షరీమంత్రోపదేశాన్ని పొందాలని ఎన్నోసార్లు వారివద్దకెళ్లి మంత్రోపదేశం చేయాల్సిందిగా ప్రార్థించారు. కానీ, గోష్ఠీపూర్ణులు మంత్రోపదేశం చేయలేదు. పట్టుదలతో మరల రామానుజులు వెళ్లి అడగ్గా రామానుజుల అర్హతను గుర్తించి త్రిదండ యజ్ఞోపవీతాలతో ఒంటరిగా రమ్మని ఆజ్ఞాపించారు. మరుసటిదినం రామానుజులవారు,

కూరేశ, దాశరథులను వెంటబెట్టుకొని గోష్ఠీపూర్ణుల వద్దకెళ్ళారు. తన ఆదేశానికి విరుద్ధంగా వచ్చిన రామానుజులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు రామానుజులు "గురువర్యా! మీ ఆనతి ప్రకారమే త్రిదండం, యజ్ఞోపవీతాలతో వచ్చాను. వీరిద్దరూ నాకు త్రిదండ యజ్ఞోపవీతాలు" అన్నారు. అప్పుడు గోష్ఠీపూర్ణులు ఆశ్చర్యంతో ఇందులో ఎవరు త్రిదండం? ఎవరు యజ్ఞోపవీతం? అని అడిగారు. అందుకు దాశరథి త్రిదండం, కూరేశులు యజ్ఞోప వీతమని చెప్పారు. రామానుజుల శిష్యవాత్సల్యా నికి ముగ్ధులై ముగ్గురికీ మంత్రోపదేశం చేశారు.

పుత్రోదయం

ఉంఛవృత్తితో జీవితాన్ని గడుపుతూన్నారు కూరేశ దంప తులు. ఒకనాడు కుండపోతగా వర్షం కురుస్తోంది. భిక్షాటనకు కూడా పోలేకపోయారు. అలాగే, నిరాహారులై నీరు మాత్రం త్రాగి నిద్రకు ఉపక్రమించారు. ఆ సమయంలో స్వామి తిరువా రాధన జరుగుతోంది. ఆ ఘంటానాదం విని కూరేశులవారి భార్య "స్వామీ! నీ భక్తుడు నిరాహారుడుగా ఉంటే నీవు మాత్రం ఆరగిస్తు న్నావా" అని మనసులో అనుకొంది. ఆ తలపునెరిగి రంగనాథ స్వామి అర్చకులద్వారా వారికి ప్రసాదాన్ని పంపించారు. మేళతాళా లతో తనగుమ్మం వద్దకు అయాచితంగా వచ్చిన భగవత్ప్రసాదానికి ఆశ్చర్యపడ్డారు. దానిని రెండుభాగాలు చేసి దంపతులిద్దరు భుజిం చారు. కానీ అతనికి సందేహమొచ్చింది. తన భార్యను పిలిచి నీవే మైనా స్వామిని అడిగావా అని అడిగాడు. ఆమె జరిగిన విషయం చెప్పింది. అందుకు కూరేశులు చాలా బాధపడ్డారు. భగవంతుని క్షమించుమని ప్రార్థించారు. ఆ ప్రసాదమహిమవలన వారికి ఇద్దరు



పుత్రులు కలిగారు. వేదవ్యాసభట్టర్, పరాశరభట్టర్ అని రామా నుజాచార్యులువారికి నామకరణం చేశారు.

అహంకారరాహిత్యం

సకలశాస్త్రాలను ఆపోసన పట్టిన వీరికి విద్వాంసుడ నన్న అహంకారం ఏ కోశానా లేదు. ఒకసారి ఒక ఆచార్యులు వీరి వద్దకొచ్చి సంప్రదాయరహస్యాలను నేర్పించుమన్నారు. కానీ, తాను ఆచార్యుడైనందున అందరెదుట బహిరంగంగా విద్యనేర్చు కోవడం అవమానంగా భావించారు. ఎవరూలేని, చూడని ఏకాంత ప్రదేశంలో విద్యనేర్పుమని అడిగారు. ఆచార్యుని అజ్ఞానానికి బాధ పడ్డారు కూరేశులు. అతని కోరిక ప్రకారం మధ్యాహ్నసమ యాల్లో దేవాలయప్రాంగణంలో అతనికి సంప్రదాయరహస్యాలను బోధి స్తుండేవారు.

ఒకనాడు కొందరు రాజభటులు ఆ ప్రాంగణంలో ప్రవే శించారు. వారిని చూశాడు ఆ ఆచార్యుడు. అందుకు చాలా బాధ పడ్తూ, తాను విద్యాభ్యాసం చేయడం (ఒక ఆచార్యుడిగా ఉండి) వారు చూస్తే తనకు అగౌరవంగా ఉంటుందని బాధపడ్డారు. అతని మనసులోని భావాన్ని, బాధను గుర్తించారు కూరేశులు. అతనిచేతిలోనున్న పుస్తకాన్ని తాను తీసికొని ఆ ఆచార్యుడు తనకు ఉపదేశిస్తున్నట్లును, వారివద్ద తాను విద్యాభ్యాసం చేస్తున్నట్లును అక్కడికొచ్చిన వారి ఎదుట అభినయించారు. అలా అతని బాధను పోగొట్టటమేగాక కూరేశులంతటి వారికి కూడా ఉపదేశించగలడీ ఆచార్యుడు అని అతని కీర్తిని ఇనుమడింపజేశారు.

శ్రీభాష్యలేఖనం

రామానుజులు బ్రహ్మసూత్రాలకు భాష్యం రచించడానికి పూనుకున్నారు. బ్రహ్మసూత్రాలకు అంతకుపూర్వం బోధాయన మహర్షి వ్రాసిన వృత్తి కాశ్మీరదేశంలో శారదాపీఠంలో ఉందని కూరేశులతో పాటు అక్కడికెళ్లారు. అక్కడి పండితులను వాదంలో ఓడించి వృత్తిగ్రంథాన్ని సంపాదించారు. రామానుజులు మొదటి అధ్యాయం చదువుతుండగానే కూరేశులు మిగతా గ్రంథం పూర్తిగా చదివేశారు. ఇంతలో అక్కడి పండితులు వచ్చి పుస్తకం మరల తీసుకోవడంతో రామానుజులు పుస్తకం పూర్తిగా చదువలేదేయని బాధపడ్డారు. అప్పుడు కూరేశులు రామానుజులతో "గ్రంథం తీసుకెళ్లారని బాధపడొద్దు. ఆ గ్రంథం నేను పూర్తిగా చదివాను. ఆ గ్రంథంలోని వాక్యాలను యథాతథంగా చెప్పగలను. పరీక్షిం చండి" అని రామానుజులతో పలికారు. రామానుజులు కూడా పలు విషయాలపై ప్రశ్నించారు. కూరేశులు కొంచెమైనా తడబడ కుండా గ్రంథస్థవాక్యాల్నే చెప్పారు. అప్పుడు రామానుజులు కూరే శుల ఏకసంథాగ్రాహిత్వానికి ఆశ్చర్యపడ్డారు.

ఒకానొక శుభదినంన రామానుజులు శ్రీభాష్యంను చెప్తూండగా దానిని రచించారు శ్రీకూరేశులు. ఇట్లు శ్రీభాష్య

లేఖనంలో అమూల్యమైన నిర్మాణాత్మక పాత్రను పోషించారు శ్రీకూరేశమిశ్రులు.

గురుప్రాణరక్షణం

చోళరాజ్యాన్ని కులోత్తుంగచోళుడనే రాజు పరిపాలిస్తూ న్నాడు. శైవుడైన రాజు అనేకమంది వైష్ణవులను శైవమతావలంబు లనుగా చేస్తూండేవాడు. అప్పుడు రాజుకు ఆంతరంగుడై ఉన్న 'నాలూరాన్' అనే వైష్ణవుడు రామానుజులచే శైవమతాన్ని అంగీ కరింపచేసినట్లైతే మిగిలినవారందరూ కూడా వారి మార్గాన్నే అను సరిస్తారని చెప్పాడు. రాజు రామానుజులను పిలుచుకురమ్మని భటులను పంపారు. వారు ఆశ్రమానికి వెళ్లారు. తన గురువర్యు లకు రానున్న ఆపద గ్రహించారు. వారు స్నానార్థం సమీపంలోని కొలనుకు వెళ్ళినందువల్ల కూరేశులు కాషాయవస్త్ర త్రిదండములను ధరించి తానే రామానుజులని భటులతో రాజసభకు బయల్దేరారు. వీరితో పాటు 'పెరియనంబి' కూడా వెళ్లారు. రాజు ఆ వచ్చినతనే రామానుజులనుకుని 'శివాత్పరతకం నాస్తి' (శివుని కన్నా గొప్ప దైవం లేదు) అని వ్రాసి సంతకం చేశాడు.

'శివ' 'ద్రోణ' శబ్దాలకు రెండర్థాలున్నాయి. ఈ పదాలు రెండు కొలతపాత్రలను కూడా బోధిస్తాయి. 'శివుని కంటె పర దైవం లేదు' అని వ్రాయుమని రాజు కోరాడు. 'శివ' శబ్దానికి కొలతపాత్ర అను అర్థంలో శివంకంటె పెద్దపాత్ర లేదనటం తప్పు. ద్రోణము (కుంచమువంటిది) అనే పెద్దపాత్ర ఉన్నదనే అర్థ మొచ్చేట్లు వాక్యాన్ని పూరించాడు.

ఆలస్యంగా ఈ అర్థాన్ని గ్రహించిన రాజు కోపంతో వారికనుగుడ్లు పీకేయాల్సిందిగా భటుల్ని ఆజ్ఞాపించాడు. అందుకు కూరేశులు పాపాత్ముడైన నిన్ను చూసిన కళ్ళతో నా గురువునీ, స్వామినీ చూడలేనంటూ తానే తన కనుగుడ్లని పీకేసుకున్నాడు. ఆ తర్వాత శ్రీరంగంవైపు ప్రయాణిస్తూ ఆ కన్నుబాధను ఓర్చుకోలేక భగవంతుని కీర్తిస్తూ బయలుదేరారు.

పంచస్తవీరచన


అలా శ్రీరంగానికి బయలుదేరిన కూరేశులు కంటిబాధ అనే వ్యథ గుర్తుకు రాకుండేందుకు భగవంతుని స్తుతిస్తూ ఐదు స్తోత్రాలను రచించారు. అవి. 1)వైకుంఠ స్తవం 2)అతిమానుష స్తవం 3)సుందరబాహుస్తవం 4)వరదరాజ స్తవం 5)శ్రీస్తవం- అనే ఈ ఐదుస్తోత్రాలు అత్యంత గంభీరమైన స్తోత్రాలుగా వెలు గొందాయి.

వరదరాజస్తవం రచించేటప్పుడు స్వామి ప్రత్యక్షమై కావలసింది కోరుకొమ్మన్నాడు. రామానుజుల కోరికమేరకు నేత్రాల్ని కాంక్షింపక చోళరాజసభలో ఉన్న నాలూరాన్ అనే వైష్ణవునికి మోక్షాన్నిమ్మని ప్రార్థించిన మహానుభావులు శ్రీకూరేశమిశ్రులు.

పరమపదప్రాప్తి

ఒకనాడు శ్రీరామానుజాచార్యులు తిరువాయ్‌మొళిని చెప్తున్నారు. ఆ సందర్భంలో 'పరమపదానికి ముందు వేంచేసిన వారు తర్వాత వేంచేసేవారిని ఉపచరిస్తారు" అనే అర్థం వచ్చే పాశురాన్ని విన్నారు కూరేశులు. రామానుజుల తర్వాత తాను పరమపదానికి పోయినట్లైతే వారు తనకు ఉపచరించవలసి వస్తుందని తలచాడు. ముందుగా తనే పరమపదానికి వెళ్ళాలని నిశ్చయించుకొని రంగనాథుని సన్నిధికి వెళ్ళి ప్రార్థించారు. అప్పుడు శ్రీరంగ నాథుడు "కూరేశా! నీకు, నీకు సంబం ధించిన వారికి, వారికి సంబంధించిన వారికి గూడా తప్పక పరమపదం లభిస్తుం దని మోక్షం అనుగ్రహించారు."

ఈ విషయం తెలుసుకున్న రామా నుజులు కూరేశులు లేరేయని కొంత బాధ పడ్డా, కూరేశుల సంబంధంతో తమకు కూడా మోక్షం లభిస్తుంది కదాయని చాలా ఆనందపడ్డారు. అంతటి ఉత్తమోత్తమ ఆచార్యులు శ్రీకూరత్తాళ్వాన్లు.



(గతసంచిక తరువాయి భాగం...)

మంత్రివరులు కూడగట్టుకొన్న ధైర్యంతో– "దేవా! మీరు భరోసా ఇచ్చారు. తప్పక చెబుతాము. ఆలకించండి. తమరు రాజ్యాధిపతిగా ఆదాయవ్యయాలగురించి పారుపత్తెం చేయాలికదా! బొక్కసంగురించి ఎచ్చరిక అవసరమే కదా! ఎప్పటికీ మీ ఆనతిని పాటించేవారమే. తమరు కార్య విభాగం చేసుకోవడం సమంజసమని భావి స్తున్నాం. రాజచిహ్నాలతో పాలించడానికి, హెచ్చరిక చేయడానికి కొంతతడవు, నామ తీర్థం, రామనామస్మరణ, ఆ మీద హరి పూజలకు కొంతతడవు, శ్రీ వైష్ణవులతో సల్లా పానికి కొంతతడవు, తదనంతరం రామా యణేతి హాసశ్రవణం. ఈ విధంగా కాల విభాగంతో పాలించాలి గాని సదా వైష్ణవు లంటూ కాలం గడపడం సరికాదు. మీ కంతా తెలుసు. చెప్పేవాళ్లం కాదు– మేము. అయినా విన్నవించాం. ఆపై మీ చిత్తం. అంతేకాదు మీ తండ్రిగారు ఏమను కొంటారో ఆలోచించండి" అని భయం భయంగా చెప్పారు. శ్రీ వైష్ణవపారిజాతం కులశేఖరులు సాంతం శాంతంగా విన్నారు.

"మంత్రులారా! మీరు పదివేలు చెప్పినా వినను. విశ్లేషించి చెప్పినా నేను సమ్మతిం చను. నా జనని జానకి. జనకుడు శ్రీరాముడు. శ్రీ సీతారామభక్తులందరు నా చుట్టాలు. నా దృష్టిలో ఈ రాజ్యభోగాలు, ధనధాన్యాదులు సర్వం వైష్ణవసేవకు సమానం కాదు. మీరు అవివేకులు పరమ భాగవతసంభాషణరుచులు మరగినవారికి మరేవీ రుచించవు. ఇంతకు మించి మీరేద యిన చెబితే ఏమవుతుందో ఆలోచించు కోండి" అన్నారు.

మంత్రివరులు చేసేదేమీలేక వెనుదిరిగి పోయారు. కులశేఖరులలో ఏమాత్రం మార్పురాలేదు. వైష్ణవులనేకులు వస్తున్నారు. వచ్చినవారిందరికీ లేదనకుండా అడిగినవి రాజు ఇస్తూనే ఉన్నాడు. వారు పట్టుకు పోతునే ఉన్నారు. ఒక రోజు రాజు కొలువు దీరాడు.

ఆ సందర్భంలోనే వైష్ణవులు సరాసరి కొలువుకూటానికే విచ్చేశారు. ఆ వైష్ణవులు సామాన్యులు కారు. అష్టాక్షరీవిద్యాసార్వభౌములు. అర్థకామాలను కోరనివారు. ధీమంతులు. జగదేక బంధువులు. దివ్యప్రబంధపారాయణులు. వీరిని చూడగానే రాజు రాచకార్యం పక్కనపెట్టారు. గద్దె దిగాడు. వారిని ఉచితాసనాలపై ఆసీనుల చేశాడు. ఈ దృశ్యమంతా మంత్రులు చూస్తున్నా కిమ్మనలేకపోయారు. మధ్యాహ్నమయింది.

'జలకమువారు' స్నానానికి లెండని' సూచనలిచ్చారు.

రాజు కనుసన్నలతో కొందరిని, శిరశ్చాలనంతో కొందరిని, ఠీవితో కొందరిని సాగనంపాడు.

తాను తొడుక్కొన్న నగలను సడలించుకొన్నాడు. తానున్న కొలువుకూటంలోనే సింహం చిత్రించిన కంభం చాటున పచ్చల కాళ్ళ పలకపీటమీద పెట్టాడు. స్నానాగారం వైపు అడుగులు వేశాడు.

అపుడే మల్లురు వచ్చారు. ఒంటినిండా నూనె పట్టించారు. మర్దించారు. సరిగ్గా ఆ సమయంలోనే వైష్ణవులు స్నానాగారం దగ్గరికే వచ్చారు. కులశేఖరులువారికి స్వాగతం పలికారు. ఉపచారాలు చేశారు. వారు వెళ్ళిపోయాక స్నానాగారం కేసి నడిచారు.

రాజు కొలువుకూటంలో పెట్టిన నగలను ఇతరులెవ్వరు చూడలేదు. బొక్కసం వారు రాజుతో ఆదాయవ్యయాలు నివేదించడానికి వచ్చి, ఆ సొమ్ములు చూశారు.

అదే సందర్భంలోనే రాజుగారికి ఒక విన్నపం చేయడానికి మంత్రులు వచ్చారు. అక్కడిసొమ్ములు చూచారు. ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవడాన్ని పసిగట్టారు. అయినా! అంతా మన మంచికే! ఈ రాజు వైష్ణవభ్రాంతితో రాజ్యపాలనలో సుతరామూ శ్రద్ధ



09

పరమయోగివిలాసం

– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

చూపడంలేదు. ఎంత చెప్పినా - ఏలా చెప్పినా వినడం లేదు. అయినా ఈ వెఱ్ఱిదాసులు మాటిమాటికి గుంపులు గుంపులుగా వచ్చి, బొక్కసాన్ని గుల్ల చేస్తున్నారు. ఈ దాసులగురించి ఏమైనా చెబుదామంటే రాజుకు దూరమవుతున్నాం. ఏం చేయాలో తోచడం లేదు. అవును. ఆ నగలు దాచి, ఈ నింద వైష్ణవధూర్తులమీద నెట్టేద్దాం. ఇలా చేస్తే వారిమధ్య సంబంధం బెడిసికొడుతుంది. ఆ తరువాత వైష్ణవులు రానేరారు. అంటూ ఆ నగలను బొక్కసం వారికి చేర్చి, తమ సంకల్పాన్ని చెప్పి, వారిని అనునయించారు. బొక్కసంవారు- "రాజసంపదను దాచడం మనకర్తవ్యం. ఈ నగలూ రాజసంపదలే కదా! రాజాజ్ఞను పాటించడం ప్రథమ కర్తవ్యం. అయినా మంత్రుల ఆదేశపాలనంకూడా విధిధర్మాలలో ఒకటి. మంత్రులు నగలను తమతో పట్టుకెళ్ళడం లేదు. భద్రం చేయమన్నారు. మంత్రులు మంచివారు. రాజ్యసంక్షేమం, మహా రాజుల సంక్షేమం కోరేవారు. బహుశః వైష్ణవులకు నింద అంట గట్టడం వారిఆలోచనలలో ఒక భాగంకావచ్చు. అందాకా వారు నిద్రపోరులే" అని అనుకొని నగలు దాచారు.

రాజుగారిమాధ్యాహ్నికం ముగిసింది. కాసేపు విశ్రాంతి తీసుకొన్నారు. అపుడు ఆంతరంగికులు 'మహారాజా! కొలువుకూటా నికి దయచేయవలె' అన్నారు. రాజు సరేనన్నారు. నగలు తొడు క్కోవాలనుకొన్నాడు. నగలు కనిపించలేదు. వైష్ణవులు వచ్చినవేళ మాధ్యాహ్నికస్నానమని పరిచారకులు, సూచించినవేళ కొలువు కూటంలోనే తాను పెట్టడం గుర్తుకు వచ్చింది. తనచుట్టూవున్న పరిచారకులతో కొలువు కూటంలోని నగలను పట్రమ్మన్నాడు. చెలికత్తెలైన పరిచారకులు పరుగుతీశారు. రాజు చెప్పినట్లు సింహ చిత్రితమైన కంభంచాటున పచ్చలకాళ్ళపలకపీటదగ్గర వెతికారు. అయినా నగలు కనబడలేదు. అక్కడంతా వెతికారు. చివరకు రాజుతో చెప్పారు. అయనా రాజు శాంతించలేదు. మరలా వెత కండని పురమాయిస్తే అందరూ అన్వేషించారు. చివరకు రాజుతో-

"దేవా! అన్నిచోట్లా వెదికాం. ఇతరులెవరో అడిగినట్లుగా అక్కడి కాపలావారినికూడా అమాయకంగా ప్రశ్నించాం. వారికి నిజంగా తెలియదు. మేము అన్నిప్రదేశాలూ వెదకడంమాత్రం నిజం. కావాలంటే ఒట్టుపెడతాం" అన్నారు- దీనంగా.

రాజు ఆలోచించాడు. సొమ్ములు ఎవరివో కావు. నావి. నా సొమ్ములు. మరి మాయం కావడం- నా కొలువుకూటంలోనా? అని ఆశ్చర్యపడి కొలువుకూటం చేరుకొని, మంత్రుల కందరికి కబురంపాడు. వారందరూ చప్పున వచ్చారు.

'మంత్రులారా! వినండి. నేను స్నానార్థం వెళ్ళేవేళ ఈ కొలువుకూటంలోనే నా నగలు పెట్టాను. అవి కనబడ్డం లేదు. ఏ మాత్రం భయంలేని దొంగలు పట్టుకెళ్ళారేమో? ఈలాంటి సంఘ టనలు ముందెప్పుడూ వినం. ఇది అనుకోనిసంఘటన...

అయినా శ్రీరామచంద్రుల కృపతో నా రాజ్యంలో చోరత్వం అనేమాట లేకుండా పాలిస్తుంటే ఈ సంఘటన జరగడమేమిటి? నా నగలను తెలిసి తెలిసి ఎత్తుకు పోవడమేమిటి? నా కొలువు కూటంలో - నా ఇంట్లోనే ఈ దొంగతనమయితే ఇతరత్రా సొమ్ము లకు రక్షణ ఎక్కడా? మీరందరు నయవిదులు. అందుకే మిమ్మల్ని నమ్మాను. ఈలాంటి స్వామిద్రోహులున్నారని మీరు పసిగట్టక పోవడం వింత. మంత్రులారా! లోపల, వెలుపల తిరిగేవారిని ప్రశ్నించండి. దొంగ ఎవరో తేల్చండి. నగలను సురక్షితంగా తెండి. ఆలా చేయకపోతే మీ మొఖాలు చూడనే చూడను. రాఘవుని ఆన!

అయినా మీ ఆటలు నాకు తెలియనివి కావు. ఎవరూ ఇక్కడకు రాలేరు. మీకు తెలియకుండా సొమ్ము చోరీ కావడం అసాధ్యం. అంటూ కేకలు వేశారు.

అమాత్యులు భయపడ్డారు. చివరకు ధైర్యం కూడగట్టు కొని- 'రాజన్యా! మీ రడిగాక విన్నవించడం మా ధర్మం. విన్న వించకపోతే మేమే తప్పులు చేసినవారమవుతాము. నిజంగా దొంగ లెవరో మాకు తెలియదు. తరతరాలనుండి ఈ కొలువులోని మంత్రులం. బిడ్డలా పెరిగినవారం. ఈ మాళిగెలో సేవకులం. పైగా పరిచారకులం. మేము ద్రోహం చేస్తామా? మీ ఆజ్ఞకు బద్ధులం. ఇక్కడున్న సేవకులెవ్వరూ అబద్ధాలకోర్లు కారు. అయినా స్వామీ! మేము మొదటి నుండికూడా మీకు అంతగా ఇష్టం లేకపోయినా అనేకసార్లు విన్నవిస్తూనే ఉన్నాం. అయినా మీ ఆనకు కట్టువడినవారం. మీరు తప్పుగా అనుకోవద్దండి. మమ్ము మన్నిస్తే చాలు. సామాన్యరాజ్యసంరక్షణంకూడా ఇక్కడ లేదు. కావలి, కట్టడి రెండూ మిథ్య. మంత్రి ఆనలకు విలువలేదు. తప్పనిసరిగా చెప్పినా స్వీకరించడం లేదు. మరి రాజసమా అంటే అదీ కాదు.

నొసట నామాలు పెట్టినవారు పెద్దలంటూ వెలుపలికీ, లోపలికీ ఉదయాస్తమానం వస్తూ పోతూవుంటే ఎవరిని దొంగలని పట్టుకోవాలి? వారికి తప్ప ఇక్కడవారి కెవరికయినా మీ సొమ్ము కావాలనే గుండెలున్నాయా?

"జననాథవర్యా! మా దృష్టిలో వైష్ణవులే 'పెరవారలు'. వారే కనిపెట్టి సొమ్ము తస్కరించివుంటారు. ఇతరులకంత ధైర్యం లేనే లేదు.' అన్నారు. కులశేఖరులు సాంతం విన్నారు. వారిమాట లకు ఉలిక్కిపడ్డారు.

(ఇంకా ఉంది)

ముత్యాలముగ్గుల్లో... రతనాలముగ్గుల్లో...

– శ్రీమతి పసుపులేటి అరుణ

గృహలక్ష్మి

గృహాలంకరణంలో ముఖ్యస్థానాన్ని ఆక్రమించేవి ముగ్గులు. ఈ ముగ్గుల్లో రమ్యత, జాతీయత, కళాతత్త్వం, శాస్త్రీయత, ఆరోగ్య, ఆధ్యాత్మిక సూత్రాలు ఇమిడి ఉన్నాయి. బిందువుల్లోను, రేఖల్లోను ఎడబాటు లేకుండా కూర్చబడిన చిత్రాలేముగ్గులు. బిందుజ చిత్రాలైన ఈ ముగ్గులనే స్త్రీలు గృహాలంకరణకి ఉపయోగించేవి. ఈ కళ ఆంధ్రామహిళల్లో ఎక్కువగా ఉంది. మన పురాణాల్లో గూడ సీతాదేవిచేత జనకమహారాజు రాజప్రాసాదాలముందు కస్తూరిని కళాపుగా చల్లించి రంగుల్లో రంగవల్లులు వేయించినట్లుగా ఉంది. నిత్యదరిద్రుడు, నిరంతరవ్యాధిగ్రస్తుడు అయిన ఒక సామాన్యగృహస్థుడు సతీసమేతుడై సూర్యాలయంలో నిత్యమూ ముగ్గులు పెట్టడం వల్లనే వారు మరుజన్మలో సత్రాజితుడను రాజుగా, అతని భార్య మహారాణిగా జన్మించారని సాత్రాజితోపాఖ్యానంలో ఉంది.



ముగ్గుల్లో వైజ్ఞానికత

ఉదయాన్నే నిద్రలేచి ప్రతి హైందవగృహిణి ఇంటితోపాటు ఇంటిపరిసరాలను కూడా శుభ్రంచేసి కళాపుచల్లి, ముగ్గులు వేయడం అనాదిగా వస్తోన్న ఆచారం. నిత్యం ఈ విధంగా చేయడంలో ఆరోగ్య, ఆధ్యాత్మిక సూత్రాలు ఎన్నో ఇమిడి ఉన్నాయి. మన పెద్దలు ఆరోగ్యంతో పాటు నేత్రానందాన్ని కూడా ఆలోచించేవారు. గోమయపు నీరు చల్లినచోట తేమగా పీల్చేగాలి ప్రవేశించి శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు రాకుండా కాపాడుతుంది. గోమయం కలిపిన నీరు కాబట్టి నీటికి చిక్కదనం కలిగి మామూలు నీరు చల్లినపుడు రేగినంత త్వరగాకాక ఎక్కువ కాలంవరకు దుమ్ము రేగదు. ప్రతిరోజూ ఈ విధంగా కళాపు చల్లడంవల్ల పొరమీన పొరగా గోమయం పూతపూసినట్లై అసలు దుమ్ము రేగక అలికినట్లు తయారౌతుంది. గోమయం ఆరోగ్యాన్ని కాపాడ్డంలో ముఖ్యమైంది. క్రిమిసంహారకమైంది. నల్లగా ఉంటే పితపితలాడుతూ ఉంటుంది. అందుకని ఆ భాగం మీద ముగ్గు వెయ్యాలి. అలా వేసినవే ముత్యాలముగ్గులు, రత్నాలముగ్గులు అయ్యాయి.

శుభకరమైన ముగ్గులు

ఇంట్లో మరణాలు సంభవించినపుడు మొదటి పదిరోజులు ఊడ్చి కళాపుచల్లి వదలివేస్తారు. ముగ్గను మాత్రం వేయరు. దీనివల్ల ముగ్గుపెట్టడం శుభసూచకమనీ, పెట్టకపోవడం అశుభసూచకమనీ అర్థం.

అంతేకాక సంపదశుక్రవారాలు, పండుగలవ్రతాలు, గొబ్బిపూజలు మున్నగునవి కల్పించారు. బాలికలు మొదలు పండు ముత్తయిదువులవరకూ నేల అలికి, ముగ్గులుపెట్టడం వల్ల కలిగే శుభఫలితాలను గురించి చెప్పేవారు.

ప్రతిరోజు గృహాలంకరణలోను, పూజాప్రదేశాల్లో, యజ్ఞయాగాదిక్రతువుల్లో యజ్ఞవేదికలను తప్పక ముగ్గులతో అలంకరిస్తారు. యజ్ఞంచేసే దీక్షితుని యజ్ఞవేదికను ఆడ పడుచు అలంకరించాలనే ఆచారం కూడా ఉంది. మన పూర్వులు కుంకుమతోను, చందనంతోను అలికి వజ్రాలు, పగడాలు, మంచిముత్యాలు, కర్పూరం మున్నగువాటితో ముగ్గులు వేసి అలంకరించినట్లు రామాయణ భారతాది ప్రాచీనగ్రంథాలు చాటుతున్నాయి.



ముగ్గుల్లో రకాలెన్నున్నాయంటే....

గృహాలంకరణకు వేసే ముగ్గుల్లో ముత్యాల ముగ్గులు, రత్నాలముగ్గులు, కఱ్ఱముగ్గులని మూడురకాలు న్నాయి. చుక్కలు పెట్టి వాటిచుట్టూ గుండ్రంగా గీస్తూ పెట్టే ముగ్గులు దారానికి గుచ్చిన ముత్యాల్లా ఉండడంవల్ల ముత్యాలముగ్గులని పేరొచ్చింది.

చుక్కలతో పెట్టినా పక్షములు, కోణములు ఏర్పడే టట్లు ముగ్గులుపెడతారు. రత్నాల్లాగ బహుముఖాల కోణా లతో ఉండే ముగ్గులకు రత్నాలముగ్గులని పేరొచ్చింది. చుక్క లవసరం లేకుండా చిన్న ముగ్గు కఱ్ఱలులాగా గీసిపెట్టే ముగ్గులకు కఱ్ఱలముగ్గులని పేరొచ్చింది.

స్త్రీలు పెట్టే ముగ్గుల్లో పరిసరప్రభావం ఎక్కువగా కనిపిస్తూంటుంది. వారికి ఎక్కువ అవసరం కలిగే వస్తువులే ముగ్గుల్లోనూ కనిపిస్తాయి. ఉదాహరణకు గాజుల మలా రము, పెళ్లిఅరుగు, తులసికోట, మల్లెపందిరి, పారిజాతం, గులాబిగుత్తి, కుట్టుడాకు, గోకర్ణము, ఊయల, గుమ్మడి పండు, మారేడుదళము, కల్యాణమండపము, సాలెగూడు, గుంటలు కోనేరు, తాబేలు, రథము, దర్భముడి, నిమ్మగుత్తి, గంధపుగిన్నె, పన్నీరుసీసా మున్నగునవి. కాంతల కళానైపు ణ్యానికి ముగ్గులొక తార్కాణమని చెప్పొచ్చు.

స్త్రీలు వ్రతాలు చేసేటప్పుడు పూజచేసే ప్రదేశాన్ని గోమయంతో అలికి, ఆ వ్రతంలో చెప్పబడ్డ బంధాన్ని చిత్రిస్తారు. ముఖ్యంగా వినాయక, లక్షవర్తి, చిత్రగుప్త, సంకటచతుర్థీవ్రతాలకు, ద్వాదశీవ్రతానికి, శతవర్తివ్రతానికి అష్టదళపద్మాలను చిత్రించాలని పురాణాల్లో చెప్పబడి ఉంది. అనంతవ్రతం, ఋషిపంచమీవ్రతం, అమావాస్య సమనతీ వ్రతాలకు సర్వతోభద్రబంధాన్ని చిత్రిస్తారు.

పద్మాలను పూజాప్రదేశాల్లో అనగా బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు, లక్ష్మి, దేవేంద్రుడు, సూర్యుడు, చంద్రుడు మొదలగు దేవతాప్రతిమలను పూజించే స్థలాల్లో చిత్రించి, దానిపై ఆ దేవతాప్రతిమనుంచి పూజించాలని చెప్పబడింది. ఈ భావమే స్త్రీలపాటల్లో కూడ వ్యక్తీకరింప బడింది.

పూజాప్రదేశాల్లో పద్మాలు చిత్రించాలని చెప్పినట్లే ఒక్కొక్కసందర్భంలోను ఒక్కొక్కరీతిగా రంగవల్లులు అలం కరించాలనే నియమాలున్నాయి. సాధారణంగా శిశువులను పడుకోబెట్టే ఊయల క్రింద తమ పాపలు గుమ్మడిపండులా ఉండాలనే భావంతో గుమ్మడిపండును చిత్రిస్తారు.

ప్రతి శుభకార్యం జరిగే ప్రదేశంలో 'పేటపట్టు'ను, వివాహాలు జరిగే ప్రదేశంలో 'పెండ్లిఅరుగు' లేదా 'కల్యాణ మంటపం'ను వేస్తారు. అట్లే వివాహంలో ఐదవరోజున పురోహితుడు 'నాకబలి' చిత్రాన్ని అలంకరిస్తాడు. తద్దినం నాడు పితృస్థానంలో వర్తులంగాను, విశ్వదేవస్థానంలో చతుర స్రంగాను గోమయంతో అలకాలి.

ప్రతిరోజు భోజనంచేసే స్థలంలో చతురస్రాకారంగా గోమయంతో అలికి, ఆరుకోణాలతో పద్మాన్ని పిండితో వేయాలి. ఇట్టి నిబంధనలు శ్రౌతస్మార్తాది గ్రంథాల్లో విపులంగా వివరింపబడి ఉన్నాయి.



సంవత్సరం మొత్తంలోనూ, ధనుర్మాసంలో ముగ్గుల సంరంభం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. గొబ్బి పూజలు ముగ్గుల కోలాహలాలు ఎక్కువగా ఉంటాయి.





ధనుర్మాసపుముగ్గుల్లో....

ధనుర్మాసంలో గోమయంతో గోవర్ధనపర్వతాన్ని, గోవును చేసి అందు గోపాలకృష్ణుని ఉంచి నిత్యమూ పూజించాలని అర్థం. ఇదే బాలికలు చేసే గొబ్బిపూజ. గోవర్ధన పర్వతం, గోవు, గోపాలకృష్ణులకు చిహ్నాలుగా మూడు గొబ్బిళ్లనుంచి పూజిస్తారు.

ధనుర్మాసం నెలరోజులు గుచ్ఛ బంధంముగ్గును, దానికి రెండువైపులా పాములను వేస్తారు. గుచ్ఛబంధం సూర్యుని రథచక్రపు చిహ్నంగానూ, రెండు వైపులా ఉన్న పాములు ఆ ఋతువులో సూర్యునితో పాటు సంచరించే గుణాలైన మహాపద్ముడు, కర్కోటకుడు అని భావం. పైగా అది హేమంతఋతువుకావటంచేత ప్రజలు చలికీ, మంచుకీ పాముల్లా మెలికలు తిరిగిపోతారనీ అర్థం.

ఆరోగ్యప్రదమైన మకరసంక్రమణం రాగానే దక్షిణాయనమందలి అనారోగ్యప్రకృతిని రథమెక్కించి సాగ నంపుతున్నట్లు ముక్కనుమునాడు రథంముగ్గును వేస్తారు. తర్వాత రథసప్తమినాడు పద్మం వేసి సూర్యారాధన చేస్తారు. రథసప్తమినాడుకూడా రథంముగ్గు వేస్తారు. ఆనాటినుండి రథాలు తిరగడం ప్రారంభమౌతుంది. అనగా దేవతోత్స వాలు, రథయాత్రలు, వివాహాదిశుభకార్యాలు జరుగు తాయి.

రంగవల్లులగుణగణాలు

రంగులతో వేసే ముగ్గులను రంగవల్లులని అంటారు. పూజాగృహాల్లో తీర్చే ముగ్గుల్లో తెలుపు, ఎరుపు, పసుపురంగులు కనిపిస్తాయి. ఈ రంగుల వినియోగం సత్త్వరజస్తమోగుణాత్మకమైన ప్రపంచరహస్యాన్ని మనకు బోధిస్తున్నది. తెలుపు సత్త్వ గుణాన్ని, ఎరుపు రజో గుణాన్ని, నలుపు తామస గుణాన్ని, పసుపు సత్త్వరజో గుణాల సామరస్యాన్ని సూచిస్తాయి. మానవుని యందు సత్త్వరజస్తమో గుణాలు మిళితములై ఉన్నాయి. ప్రపంచంలో మనకు దృగ్గోచరములైన తెలుపు, ఎరుపు, నలుపు ఆయా గుణాలకు బాహ్యరూపాలుగా చెప్పబడ్డాయి. ఈ మూడుగుణాలు సమ పాళ్ళుగా ఉంటేనే మానవుని ఆరోగ్యంకూడా పరిపూర్ణంగా ఉంటుంది. కాబట్టి మానవుని ఆరోగ్యానికి, సత్త్వరజస్తమో గుణాలకు, రంగులకు అవినాభావసంబంధమున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

వివాహాల్లో నాకబలిచిత్రం ఈ మూడురంగులతోనే వేస్తారు. ఈ తంతు గృహస్థాశ్రమతత్త్వాన్ని సూచిస్తుంది.

ఈ విధంగా ఆధ్యాత్మికతత్త్వానికీ, ఆరోగ్యసూత్రా లకు అవినాభావసంబంధముండేలా మనవారు ఆచారవ్యవ హారాలను తీర్చిదిద్దారు.

ఈ ఆచారాలతో ఆరోగ్యం, అందం, అలంకారాల్ని పొందే అవకాశాన్ని మనపూర్వులు కల్పించి తర్వాతి తరాలవారికి మార్గదర్శకులై మహోపకారం చేశారు.



ఓం సాత్త్వికాహారాయై నమః

– శ్రీ శ్రీరామకవచం చంద్రశేఖర్

సామాన్యంగా శరీరపోషణకు మాంసాహారంకన్నా శాకాహారం మేలైందని ఒక అభిప్రాయం. మాంసాహారం హింస అనీ, శాకాహారం అహింస అనీ భావించేవారు కూడా ఉన్నారు. నిజానికి అంతో ఇంతో హింస రెండింటిలోనూ ఉంటుంది.

'జీవో జీవస్య జీవనమ్' ఇది లోకరీతి. సూక్ష్మ దృష్టితో చూసినపుడు ఒకే అంతర్యామి ఇన్ని తరహాల దేహాలను ధరిస్తూ ఒక దేహాన్ని మరొక దేహానికి ఆహారంగా సమర్పిస్తున్నాడు. ఇది తప్పని సరై సృష్టియజ్ఞంలో జరుగుతున్న ధర్మమైన జీవహింస. నీరు, భూమి, ఆకాశం సర్వమూ జంతుమయమే. కాబట్టి ఏ కర్మను మొదలుపెట్టినా ఎంతో కొంత హింస జరక్కతప్పదు. హింస జరక్కుండా దేహయాత్ర నడపటం సాధ్యం కాదు. ఇవేమీ గమనించకుండానే కొందరు తాము అహింసాపరులమని అనుకోవడం కద్దు.

శాకాహారం మేలా? మాంసాహారం మేలా?

అంటే ఇది ఎవరి శరీరతత్త్వాన్నిబట్టి వారు నిర్ణయించుకోవలసిందే. ఒక శరీరం శాకాహారాన్ని కోరుతుంది. మరొకతత్త్వమున్న శరీరం మాంసాహారాన్ని అపేక్షిస్తుంది. ఎవరి శరీరతత్త్వాలకు తగిన ఆహారం వారు స్వీకరించడం ధర్మమౌతుంది. ఈ శాకాహార, మాంసాహార భేదం ఒక్క మానవుల్లోనే కాదు. జంతువుల్లో కూడా ఉంటుంది. అందులో ఆవు, గేదె, గుర్రం, గాడిద, ఏనుగు మొదలైనవి శాకాహారులు. బల్లి, పిల్లి, పులి, సింహం మొదలైనవి మాంసాహారులు. ఆయా జంతువులు ఈ శాకాహార, మాంసాహార విభాగాన్ని కోరి అభ్యాసం చేయలేదు గదా! వాటికి కావాలనిపించిన ఆహారాన్ని అవి స్వీకరిస్తున్నాయి. అలాగే మానవుల్లో కూడా ఎవరి ప్రవృత్తికి తగిన ఆహారం వారి మనస్సు అపేక్షిస్తుంది. శరీరం తన అస్తిత్వానికి కోరుకున్న ఆహారాన్ని అందించడం మానవుడి కర్తవ్యం. కాబట్టి ఈ విషయంలో ఏ ఆహారం మంచిదని ఇతరుల్ని సలహా అడిగేబదులు ఎవరి శరీర ప్రవృత్తుల్నివారు గమనించుకొని నిర్ణయించుకోవడం మంచిది.

వ్యక్తి తత్త్వంపైన అతడు అపేక్షించే ఆహారం ఆధారపడి ఉంటుందని చెప్పు కున్నాం. ఆ తత్త్వం అతడిలో పనిచేసే త్రిగుణాల కలయికవల్ల వ్యక్తమౌతోంది. ఆ త్రిగుణాల్లో దేని ప్రభావం ఎక్కువగా ఉంటుందో ఆ గుణం ఆ వ్యక్తి స్వభావాన్ని రూపొందించడంలో ప్రధానపాత్ర వహిస్తుంది. ఈ మూడుగుణాల ప్రభావాలను అను సరించి మూడురకాల ఆహారాలను అపేక్షించేవారు లోకంలో ఉంటారని కృష్ణుడు గీతలో వివరించాడు.

సత్త్వగుణాహారలక్షణాలు

సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవాడికి సాత్త్వికాహారం అంటే ఇష్టంగా ఉంటుంది. ఆయువు, సత్త్వం, బలం, ఆరోగ్యం, సుఖం, ప్రీతి అనే వాటిని పెంచే ఆహారమిది. సాత్త్వికమంటే రసవంతాలు, చమురుకలవీ, స్థిరత్వంకలవీ, హృదయానికి ఇంపైనవి అయిన ఆహారాలు. రస్యాలంటే రసంగల కాయలు, పండ్లు, పువ్వులు, ఆకులు. చమురు, కలవి. స్నిగ్ధాలంటే నువ్వులు మొదలైన చమురుపదార్థాలు. స్థిరా లంటే దేహధాతువులకు స్థిరత్వాన్నిచ్చే పప్పులు, దుంపలు మొదలైనవి. హృద్యాలంటే తేనె, నేయి మొదలైన గుండెకు బలమిచ్చే పదార్థాలు. సాత్త్వికస్వభావం కలవాడికి ఇవన్నీ ప్రియంగా ఉంటాయి. ఆహారం స్వీకరించడమంటే పై చెప్పబడినవాటిల్లో లభ్య మైన వాటిని స్వీకరించడమని సాత్త్వికుని భావన.





రజోగుణాహారలక్షణాలు

రజోగుణప్రవృత్తి కలవారికి కారం, పులుపు, ఉప్పు, వేడివేడిగా ఉండేవీ, నాలుకకు తీక్షణమైనరుచిని అందించేవీ, ఎండబెట్టినవీ, కాల్చినవీ అయిన ఆహారాలు ఇష్టంగా ఉంటాయి. ఇవి దుఃఖాన్నీ, శోకాన్నీ, రోగాల్నీ కలిగిస్తాయి. ఎండబెట్టినవంటే ఒరుగులు, వడియాలు మొదలైనవి. కాల్చినవంటే వేపుళ్ళు, కాల్చినకూరలు, మాంసం మొదలైనవి. దుఃఖాన్ని కలిగించేవి అంటే మనస్సుకు దిగులూ, శోకభావం పెంచేవి. ఉప్పూ, పులుపూ, కారాలూ హెచ్చుగా వాడటంవల్ల ఇవి కలుగుతాయి.

తమోగుణాహారలక్షణాలు

తామసప్రవృత్తి కలవారికి వండిన వెనుక మూడు గంటలు దాటినవీ, రుచి తప్పేవరకూ నిలువ ఉన్నవీ, దుర్వాసనవేసేవీ, చద్దిపోయిన పదార్థాలు, అంటే ఒకపూట దాటిన చద్దన్నం మొదలైనవి, తిని మిగిల్చినవి లేక ఎంగిలి పదార్థాలు, మేధస్సుకు పనికిరానివీ రుచిస్తాయి. మేధస్సుకు పనికిరానివి అమేధ్యం! అంటే తెలివినీ, చురుకుదనాన్నీ హరించగలిగే ఆహారమిది.

'ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః'

ఇది భగవద్గీతలో శ్రీకృష్ణుడు చేసిన ఆహార విభజన. దీన్నిబట్టి మనలో ఏ గుణం ప్రాధాన్యం వహిస్తుందో ఆ గుణానికి సంబంధించిన ఆహారం మనకి నచ్చుతుంది. మనకు నచ్చే ఆహారాన్ని బట్టి మనలో ప్రాతినిధ్యం వహిస్తున్న గుణాన్ని మనం గమనించుకోవచ్చు. ఈ సందర్భంలో గమనించాల్సిన సూక్ష్మం మరొకటుంది. ఒక గుణానికి సంబంధించిన ఆహారాభిలాష గల వ్యక్తి కావాలని కోరి మరో గుణానికి సంబంధించిన ఆహారాన్ని స్వీకరించడం ప్రారంభిస్తే క్రమంగా అతడిలో ప్రాతినిధ్యం వహించే గుణం కూడా మారుతుంది. ఉదాహరణకు రజోగుణప్రవృత్తి కలవాడు తమోగుణానికి సంబంధించిన చద్దిపోయిన పదార్థాలూ, రుచితప్పిన పదార్థాలూ మొదలైనవి తినడం ప్రారంభిస్తే, క్రమంగా అతడి ప్రవృత్తిలో రజోగుణం వెనక్కు తగ్గి, తమోగుణం ప్రాతినిధ్యం వహించడం ప్రారంభిస్తుంది. అలాగే ఏ తమోగుణప్రవృత్తి కలవాడో కావాలని కోరి సాత్త్వికమైన ఆహారాన్ని అలవాటు చేసుకోగల్గితే క్రమంగా అతడి ప్రవృత్తి సత్త్వోన్ముఖమౌతుంది. ఈ సత్యాన్ని గమనించే పెద్దలు 'ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః' అన్నారు.

ఆహారస్వీకరణ-సాధనామార్గం

సత్త్వగుణసంపన్నులైన పెద్దలు ఆధ్యాత్మికసాధనకు సాత్త్వికాహారం మంచిదని చెప్పడంలో కూడా ఒక ధర్మసూక్ష్మం ఉంది. చెట్లకు మూలచ్ఛేదం కలగకుండా అవి ఇచ్చే ఆకులు, కాయలు, పళ్ళూ; జంతువులకు మూలచ్ఛేదం కలగకుండా అవి ఇచ్చే పాలూ, పాలనుంచి వచ్చే పెరుగూ, నెయ్యీ స్వీకరించి తృప్తిపడటం జరుగుతుంది.

వానప్రస్థులు ఆకుల్ని, కాయల్నీ కొయ్యకుండా రాలిన పళ్లనీ, మొలకెత్తడానికి అవకాశం లేకుండా రాతిబండల మీద పడ్డ గింజల్ని ఏరుకుని తినేవారు. ఈ సాధన భూతదయ పెరగడానికి, తద్వారా ఆత్మసాక్షాత్కారానికి దారితీస్తుంది. వారు ఆశించిన గమ్యానికి అనువుగా ఉండేందుకు తుదకు ఆహారస్వీకరణను కూడా ఒక సాధన మార్గంగావారు మలచుకున్నారు.

మనిషి తన కార్యసాధనం, గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రవృత్తికి తగిన ఆహారాన్ని అందించడమో లేదా ఆవశ్యకమైనపుడు తన గమ్యానికి తగ్గట్లుగా ప్రవృత్తిని మలచుకోవడమో చేయాలి. శారీరకంగా శ్రమించడం కర్తవ్యంగా కలవారికి ఒక రకమైన ఆహారం కావాలి. ఆధ్యాత్మికసాధనలో ముందుకు సాగి సత్త్వసిద్ధిని పొందగోరే వారికి ఇంకో రకమైన ఆహారం కావాలి. ఈ సత్యాన్ని గ్రహించి మానవుడు తన ప్రవృత్తినీ, కర్తవ్యాన్నీ గమనించుకొని, సమన్వయ పరచుకొని తనకు తగిన ఆహారాన్ని నిర్ణయించుకొని స్వీకరించాలి. కాబట్టి మనమందరమూ కూడా 'ఓం సాత్త్వికాహారాయై నమః' అంటూ సాత్త్వికగుణాన్ని కల్గించే ఆహారాన్నే స్వీకరించి సన్మార్గంవైపే పయనిద్దాం.



జనవరి- 27 పిండపితృయజ్ఞసందర్భంగా....

పితృకర్మల్లో మార్మికత

-డా॥ ఎక్కిరాల కృష్ణమాచార్య

కర్మతోనూ, పునర్జన్మతోనూ ముడిపడి ఉన్న హిందూమతసంప్రదాయంలో పితృకర్మలు ఎంతో కీలకమైనవి. ఆ కర్మలను వైజ్ఞానికసమన్వయంతో అర్థవంతంగా చెయ్యవచ్చుననేదే ఈ వ్యాసోద్దేశం.

పితృకర్మల్లోని రకాలు

